ఆదివారం
25-08-2024
విజయవాడ ప్రచురణ
సంపుటి : 73, సంచిక : 65
పేజీలు : 6+8, వెల: రూ.6.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

జర్మనీలో రెచ్చిపోయిన ఉన్మాది: ముగ్గురి మృతి

బెర్లిన్: జర్మనీలోని సోలింజన్ నగరంలో ఒక ఉన్మాది రెచ్చిపోయాడు. వేడుక జరుగుతున్న సమయంతో కత్తితో దాడి చేశాడు. విచక్షణ కోల్పోయి ఎదురొచ్చిన వారిపై విరుచుకుపడ్డాడు. ఈ ఘటనలో ముగ్గురు మృతి చెందగా, మరో నలుగురికి గాయాలయ్యాయి. సిటీ సెంటర్‌లో ఈ ఘటన జరిగింది. పరారీలో ఉన్న అతని కోసం హెలికాప్టర్లతో గాలింపులు చేపట్టారు. 40 వాహనాలను రంగంలోకి దింపారు. ప్రత్యేక టాస్క్ ఫోర్స్ పోలీసులు కూడా గాలిస్తున్నారు. త్వరలోనే పట్టుకుంటామని అధికారులు తెలిపారు. పారిశ్రామిక నగరమైన సోలింజన్‌లో 650వ వార్షికోత్సవం వేళ ఉన్మాది కత్తితో దాడికి పాల్పడ్డాడని, బాధితుల మెడపై దాడి చేశాడని ప్రత్యక్ష సాక్షులు వెల్లడించారు.

యూపీఎస్‌కు ఓకే

కేంద్ర కేబినెట్ నిర్ణయం

న్యూఢిల్లీ: ప్రభుత్వ ఉద్యోగుల కోసం ఏకీకృత పింఛన్ పథకం (యూపీఎస్)కు కేంద్ర కేబినెట్ ఆమోదం లభించింది. బయో ఈ-3 విధానం, విజ్ఞాన్ ధార, ఇంటర్ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌నకు పచ్చజెండా ఊపింది. 2025, ఏప్రిల్ 1 నుంచి యూపీఎస్ అమల్లోకి రానున్నది. జాతీయ పింఛన్ వ్యవస్థ (ఎన్‌పీఎస్) స్థానంలో ఈ కొత్త పథకాన్ని తీసుకు రానుంది. దీని ప్రకారం పదవీ విరమణ తర్వాత వేతనంలోని 50శాతాన్ని పింఛన్‌గా పొందేందుకు వీలు

- మిగతా 2 లో

అందుబాటులోకి చంద్రయాన్-3 డేటా

న్యూఢిల్లీ: చంద్రయాన్-3 మిషన్ సేకరించిన డేటాను విశ్లేషణ కోసం ఇస్రో అందుబాటులో తెచ్చింది. చంద్రుడి దక్షిణ ధ్రువానికి చేరువలోని ప్రాంతంలో ఈ వ్యోమనౌక కాలుమోపి ఏడాది పూర్తయిన సందర్భంగా మొత్తం 55 గిగాబైట్ల డేటాను అందిస్తోంది. విక్రమ్ ల్యాండర్, ప్రజ్ఞాన్ రోవర్‌లోని ఐదు సైన్స్ పరికరాలు ఈ డేటాను సేకరించాయి. 'ఆయా పరికరాలను రూపొందించిన

- మిగతా 2 లో

'సినర్జిన్' కంపెనీలో ప్రమాదం

చికిత్స పొందుతూ జార్ఖండ్ వాసి మృతి

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: అనకాపల్లి జిల్లా పరిధిలోని ఫార్మా పరిశ్రమల్లో వరుస ప్రమాదాలతో జనం ఉలిక్కిపడుతున్నారు. అచ్యుతాపురం సెజ్‌లోని ఎసెన్షియా ఫార్మా పరిశ్రమలో ప్రమాద ఘటన మరవకముందే పరవాడలోని జవహర్‌లాల్ నెహ్రూ ఫార్మాసిటీలోని సినర్జిన్ యాక్టివ్ ఇన్‌గ్రేడియంట్స్ యూనిట్-3లో గురువారం అర్ధరాత్రి ప్రమాదం చోటుచేసుకుంది. ఆ సమయంలో విధుల్లో ఉన్న విజయనగరం జిల్లా వంగర మండలం కోనంగిపాడుకు

- మిగతా 2 లో

ఇదీ లోకం!

మన కార్యకర్తలు సార్, వాళ్లు కూడా ఆయన వెంటే నడవాలా అని అడుగుతున్నారు సార్?!

'స్మార్ట్' ముప్పు

- గృహ, వాణిజ్య, పంపు సెట్లకు ప్రీపెయిడ్ మీటర్లు
- ముందుగా డబ్బులు చెల్లిస్తేనే విద్యుత్ సరఫరా
- సరుకు, సాంకేతిక సిబ్బందితో రంగంలోకి అదానీ సంస్థ
- గతంలో తీవ్రంగా వ్యతిరేకించిన టీడీపీ
- విద్యుత్ వినియోగదారుల తీవ్ర ఆగ్రహం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్ర విద్యుత్ వినియోగదారులకు స్మార్ట్ మీటర్ల ముప్పు ముంచుకొచ్చింది. గత వైసీపీ ప్రభుత్వంతో చేసుకున్న ఒప్పందం ప్రకారం రాష్ట్రంలో గృహ, పారిశ్రామిక, వాణిజ్య విద్యుత్ కనెక్షన్లకు, వ్యవసాయ పంపుసెట్లకు స్మార్ట్‌మీటర్ల బిగింపు కోసం అదానీ సంస్థ సిద్ధమైంది. గుజరాత్ నుంచి భారీ కంటెయినర్ల ద్వారా అదానీ సంస్థ స్మార్ట్ మీటర్లను పెద్దసంఖ్యలో ఇక్కడకు తరలించింది. వాటిని అమర్చడానికి అవసరమైన సాంకేతిక సిబ్బందినీ తీసుకొచ్చింది. సీపీడీసీఎల్ పరిధిలో నాలుగు కంటెయినర్లలో వచ్చిన స్మార్ట్ మీటర్లను భద్రపరిచేందుకు విజయవాడ గుణదలలోని ట్రాన్స్‌ఫార్మర్ల షెడ్లను కేటాయించారు. తొలుత ప్రభుత్వ కార్యాలయాలు, సబ్‌స్టేషన్లలో స్మార్ట్ మీటర్లు బిగించనుండగా... దశలవారీగా ఇళ్లకు, ఇతర వినియోగదారులకు కూడా అమర్చనుంది. ఇళ్లకు స్మార్ట్ మీటర్ల ఏర్పాటు పనులకు గత వైసీపీ ప్రభుత్వం పిలిచిన టెండర్లు దక్కించుకునేందుకు అదానీ, షిర్డీసాయి సంస్థలు పోటీ పడగా, పట్టణాల్లో స్మార్ట్ మీటర్ల ఏర్పాటు పనులను అదానీ సంస్థ దక్కించుకుంది. స్మార్ట్ మీటర్లు బిగించడమే కాకుండా ప్రీపెయిడ్ విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం ముందుకు తీసుకొచ్చింది. అంటే సెల్‌ఫోన్‌ల తరహాలోనే స్మార్ట్ మీటర్లకు కూడా రీచార్జి చేసుకోవాల్సి ఉంటుంది. ఎప్పటికప్పుడు ఇంకెంత బ్యాలెన్స్ ఉందో... విద్యుత్ రోజువారీ ఎంత ఖర్చు అవుతుందో అవగాహన చేసుకుని, ముందుగా రీఛార్జి చేయించుకుంటేనే విద్యుత్ సరఫరా అవుతుంది. ఈ టెక్నాలజీపై ఏమాత్రం అవగాహన లేకపోయినా చీకట్లో గడపాల్సిందే. మనం ఇంట్లో వాడే విద్యుత్‌కు ఇకపై ఇదే విధానం అమల్లోకి రానుంది. దీనికోసం ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లను విద్యుత్ సంస్థలు ఏర్పాటు చేస్తున్నాయి. దీనివల్ల మనం ఇంట్లో వాడే విద్యుత్‌కు ఇకపై ముందుగానే డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది. మొదటి దశలో 200 యూనిట్లు కంటే ఎక్కువ వినియోగించే గృహ, వాణిజ్య, పారిశ్రామిక విద్యుత్ వినియోగదారులకు స్మార్ట్ మీటర్లు బిగించడానికి గత ప్రభుత్వ హయాంలోనే టెండర్ల ప్రక్రియ ముగిసింది. దశల వారీగా మిగిలిన 1.43 కోట్ల కనెక్షన్లకు కూడా స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయనున్నాయి.

దీనివల్ల విద్యుత్ వినియోగదారులపై ప్రభుత్వం స్మార్ట్‌గా రూ.4,486.93 కోట్ల భారం మోపనుంది. మూడు డిస్కంల పరిధిలో స్మార్ట్ మీటర్ల కొనుగోలు, నిర్వహణ, ఫీడర్ల విభజన పనులకు కలిపి రూ.8,927.36 కోట్లు ఖర్చు చేయనున్నారు. ఇందులో కేంద్ర ప్రభుత్వం రూ.4,440.43 కోట్లు గ్రాంటు రూపేణా అందజేస్తుంది. మొదటి దశలో 27.68 లక్షల గృహ, వాణిజ్య, పారిశ్రామిక విద్యుత్ కనెక్షన్లతో పాటు 25 కేవీఏ, అంతకంటే ఎక్కువ సామర్థ్యం ఉన్న 2.92 లక్షల పంపిణీ ట్రాన్స్‌ఫార్మర్లు, 14,033

- మిగతా 2 లో

ఒప్పందం రద్దు చేయాలి: రామకృష్ణ

2లో

ప్రక్రియ నిలిపివేయాలి: శ్రీనివాసరావు

ఫార్మా ప్రమాదాలపై
అఖిలపక్షం

రామకృష్ణ డిమాండ్

బాధితులను పరామర్శించిన సీపీఐ బృందం

విశాలాంధ్ర-విశాఖ: ఫార్మా కంపెనీలలో జరుగుతున్న ప్రమాదాలపై అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. పరవాడలోని సినర్జీస్ ఫార్మా కంపెనీలో జరిగిన ప్రమాద బాధితులను, వారి కుటుంబ సభ్యులను విశాఖలోని ఇండస్ ఆసుపత్రిలో శనివారం ఆయన పరామర్శించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ ప్రమాదాలకు యాజమాన్యాలు, వారితో లాలూచీపడిన అధికారులు బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఫార్మా కంపెనీల్లో సరైన భద్రతా చర్యలు, నైపుణ్య కార్మికులు లేరని, కార్మికులకు సరైన శిక్షణ, సౌకర్యాలు లేవని, అందువల్లే ప్రమాదాలు జరిగి ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారని విమర్శించారు. ఇవి ప్రమాదాలు కాదని... యాజమాన్యాలు చేసిన హత్యలని, వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని రామకృష్ణ అన్నారు. రాష్ట్రంలోని అన్ని ఫార్మా కంపెనీలపై సమగ్ర విచారణ జరిపించాలని, లోపాలు ఉన్న కంపెనీల లైసెన్సులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఫార్మా కంపెనీల ద్వారా ఆర్జించిన లాభాలతో యాజమాన్యాలు విదేశాల్లో జల్సా చేస్తున్నాయని, కార్మికులకు మాత్రం అతి తక్కువ

- మిగతా 2 లో

సందీప్ ఘోష్‌పై అవినీతి కేసు

- అలీపూర్ కోర్టుకు ఎఫ్ఐఆర్ ప్రతి అందజేత
- ఆరుగురికి సీబీఐ పాలిగ్రాఫ్ పరీక్షలు
- నిందితులకు 20-25 ప్రశ్నలు సంధించిన దర్యాప్తు బృందం

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలోని ఆర్జీ కర్ వైద్య కళాశాల, ఆసుపత్రిలో ట్రైనీ వైద్యురాలిపై సామూహిక అత్యాచారం, హత్య ఉదంతం చిలికిచిలికి గాలివానగా మారింది. రాష్ట్రంలో నిరసనలు హోరెత్తుతున్నాయి. కేసును సీబీఐకి అప్పగించినప్పటికీ బెంగాల్ వైద్యుల్లో సంతృప్తి లేదు. తోటి వైద్యురాలికి న్యాయం జరిగేంత వరకు ఆందోళనలు సాగిస్తామని ప్రకటించారు. వీరికి వామపక్షాలు, ప్రజాసంఘాలతో పాటు విద్యార్థి సంఘాలు మద్దతు ప్రకటించాయి. ఆర్జీ కర్ ఆసుపత్రిలో అక్రమాలు పెద్దఎత్తున జరిగినట్లు ఆరోపణలు రావడంతో మాజీ ప్రిన్సిపల్ సందీప్ ఘోష్‌పై శనివారం అవినీతి కేసు నమోదైంది. కలకత్తా హైకోర్టు ఏకసభ్య ధర్మాసనం ఇచ్చిన ఆదేశాల మేరకు ఆయనపై సీబీఐ కేసు నమోదు చేసింది. తాను నిర్దోషినని, ఏ తప్పు చేయలేదని ఘోష్ తెలిపారు. ఘోష్‌పై విచారణను సీబీఐ చేపట్టిన క్రమంలో సిట్ అధికారులు ఉదయం కోల్‌కతా నిజాం ప్యాలెస్‌లోని సీబీఐ కార్యాలయానికి వెళ్లి సంబంధించిన అన్ని పత్రాలు

- మిగతా 2 లో

ఎండీయూ వాహనాలకు చెక్ !

- మళ్లీ చౌక ధరల దుకాణాల్లోనే రేషన్ పంపిణీకి కసరత్తు
- పాత విధానంతో ఏటా రూ.204 కోట్లు ఆదా
- వచ్చే మంత్రివర్గ భేటీలో నిర్ణయానికి అవకాశం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : పౌర సరఫరాల వ్యవస్థ ప్రక్షాళన దిశగా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. గత వైసీపీ ప్రభుత్వం ఆర్భాటంగా తీసుకువచ్చిన ఇంటి వద్దకే రేషన్ పథకం ఆచరణలో విఫలమైంది. బియ్యం డోర్ డెలివరీ అంటూ చేపట్టిన విధానం లోపభూయిష్టంగా సాగిందని అధికారులే అంగీకరిస్తున్నారు. రాష్ట్రంలో ఎక్కడా ఈ వాహనాల ద్వారా రేషన్ డోర్ డెలివరీ జరగలేదు. వీధి చివర వాహనం పెట్టి మాత్రమే కార్డు దారులకు సరుకులు పంపిణీ చేస్తున్నారు. ఇదే విషయాన్ని ఇటీవల పౌర సరఫరాల శాఖ సమీక్షా సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబుకు అధికారులు వివరించారు. రేషన్ డోర్

- మిగతా 2 లో

నింగిలోకి పునర్వినియోగ రాకెట్ రూమీ-1

చెన్నై: దేశంలో తొలిసారిగా పునర్వినియోగ హైబ్రిడ్ రాకెట్ ప్రయోగం జరిగింది. చెన్నైలోని ఈసీఆర్‌లో తిరువిడంధై తీర గ్రామం నుంచి 'రూమీ-1' అనే చిన్న రాకెట్ శనివారం ఉదయం నింగిలోకి దూసుకెళ్లింది. స్పేస్‌జోన్ ఇండియా సంస్థ తయారుచేసిన ఈ రాకెట్ శకలాలను సేకరించి తిరిగి వినియోగించుకోనున్నారు. దాదాపు 80 కిలోల బరువున్న ఈ రాకెట్‌ను హైడ్రాలిక్ మొబైల్ కంటైనర్ లాంచ్‌పాడ్ పైనుంచి ప్రయోగిం చారు. ఇది కిలోకన్నా తక్కువ బరువున్న మూడు క్యూబ్ ఉపగ్ర హాలు, 50 పికో శాటిలైట్లను మోసుకుని ఉప కక్ష్య పథంలోకి దూసుకెళ్లింది. వాతావరణ పరిస్థితులు, కాస్మిక్ రేడియేషన్, యూవీ రేడియేషన్, గాలి నాణ్యత తదితరాల్ని క్యూబ్ ఉపగ్రహాలు సేకరించనున్నాయి. నింగిలో కంపనస్థాయి, ఓజోన్ పొర పరిస్థితిని, ఇతర పర్యావరణ పరిస్థితుల్ని పికో ఉపగ్రహాలు గుర్తించనున్నాయి. కంటైనర్ తరహా మొబైల్ లాంచ్‌పాడ్ నుంచి ప్రయోగించిన తర్వాత భూ ఉపకక్ష్యలోకి ఉపగ్రహాలు వెళ్లేలా రాకెట్ పైకెళ్లింది.

అక్కడికి వెళ్లేలోపు శకలాలు తిరిగి భూమికి చేరేలా రాకెట్‌లోనే పారాచూట్లను ఉంచారు. నిర్ణీత దూరం వరకు వెళ్లాక... శకలాలు కిందకు జారి భూమికి కొంత ఎత్తుకు చేరేసరికి పారాచూట్లు తెరచుకొని సురక్షితంగా దిగడం దీని సాంకేతికత. సెన్సార్ల సాయంతో ఆ శకలాల్ని సేకరించి తిరిగి మరో రాకెట్ వినియోగానికి వాడతారు. తద్వారా ప్రయోగ ఖర్చు బాగా తగ్గుతుందని స్పేస్‌జోన్ ఇండియా సీఈవో ఆనంద్ మేఘలింగం గతంలో తెలిపారు.

హీరో నాగార్జున
ఎన్ కన్వెన్షన్ కూల్చివేత

విశాలాంధ్ర-హైదరాబాద్: ప్రముఖ సినీ నటుడు అక్కినేని నాగార్జునకు చెందిన ఎన్ కన్వెన్షన్‌ను హైడ్రా బృందం శనివారం కూల్చివేసింది. మాదాపూర్‌లో భారీ బందోబస్తు మధ్య కన్వెన్షన్ కూల్చివేతను అధికారులు చేపట్టారు. తుమ్మిడిచెరువును ఆక్రమించి ఈ నిర్మాణం చేపట్టారని ఆరోపణలు వెల్లువెత్తాయి. మూడున్నర ఎకరాలు కబ్జా చేసి కన్వెన్షన్‌ను నిర్మించారని అధికారులకు ఫిర్యాదులు అందాయి. హైదరాబాద్ పరిధిలో అక్రమ నిర్మాణాలను అడ్డుకునేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హైడ్రా (హైదరాబాద్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ) తీసుకొచ్చారు. ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలను తొలగించడం, చెరువులను రక్షించడం, విపత్కర పరిస్థితుల్లో నగరానికి అండగా ఉండటం దీని ప్రధాన లక్ష్యం. హైడ్రా కబ్జాదారుల వెన్నులో వణుకు పుట్టిస్తోంది. నిత్యం ఏదో ఒకచోట అధికారులు ఆక్రమణలను కూల్చేస్తున్నారు.

ఆక్రమణపై మంత్రికి ఫిర్యాదులు

అక్రమంగా నిర్మించిన ఎన్ కన్వెన్షన్‌ను కూల్చివేయాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డికి ఫిర్యాదు అందినట్లు తెలిసింది. ఈ విషయాన్ని పరిశీలించి చర్యలు తీసుకోవాలని హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు ఈ నెల 21న మంత్రి లేఖ రాశారు. విచారణ జరిపిన హైడ్రా శనివారం తెల్లవారుజాము నుంచే కూల్చివేతను

- మిగతా 2 లో

బంగ్లాదేశ్ సుప్రీంకోర్టు మాజీ జడ్జి అరెస్ట్

దేశం వీడేందుకు యత్నం
నిర్బంధించిన సరిహద్దు దళం

ఢాకా: బంగ్లాదేశ్ సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి షంషుద్దీన్ చౌధురి మాణిక్ అరెస్టుకు గురయ్యారు. దేశం వీడి వెళ్లేందుకు ప్రయత్నించిన ఆయనను బంగ్లాదేశ్ సరిహద్దు దళం (బీజీబీ) అదుపులోకి తీసుకుంది. భారత్‌తో పంచుకునే సరిహద్దు వద్ద సిల్హెట్ దగ్గర ఆయనను నిర్బంధించింది. అవామీ లీగ్ నేత ఏఎస్ఎం ఫిరోజ్‌ను ఆయన ఇంటి వద్ద అరెస్టు చేసిన కొన్ని గంటల్లోనే ఈ పరిణామం చోటుచేసుకుంది. సిల్హెట్ కనైఘాట్ సరిహద్దు గుండా భారత్‌కు చేరుకునేందుకు ప్రయత్నించిన రిటైర్డ్ జడ్జి షంషుద్దీన్ చౌదరి మాణిక్‌ను అదుపులోకి తీసుకున్నట్లు బీజీబీ కేంద్ర కార్యాలయం నుంచి ఎస్ఎంఎస్ ద్వారా విలేకరులకు సమాచారం అందింది. శుక్రవారం అర్ధరాత్రి వరకు బీజీపీ అవుట్‌పోస్టు వద్దనే జస్టిస్ మాణిక్‌ను ఉంచినట్లు క్యాంపు ఇన్‌చార్జి వెల్లడించినట్లు ప్రోతమ్ ఆలో వార్తాసంస్థ పేర్కొంది. షేక్ హసీనా ప్రభుత్వం కుప్పకూలిన తర్వాత బంగ్లాదేశ్‌లో అనిశ్చితి నెలకొంది. తొలుత దేశం వీడేందుకు

ప్రయత్నించిన న్యాయశాఖ మాజీ మంత్రి అనిసుల్ హుక్, మాజీ ప్రధాని సలహాదారు సల్మాన్ ఎఫ్ రహ్మాను సైనికులు అరెస్టు చేశారు. జర్నలిస్టు దంపతులు ఫర్జానా రూపా, ఆమె భర్త షకీల్ అహ్మద్‌నూ నిర్బంధించారు. భారత్‌లో ఆశ్రయం పొందుతున్న షేక్ హసీనాను తమకు అప్పగించాలంటూ కొన్ని రోజులుగా బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ) డిమాండ్ చేస్తోంది. హత్య ఆరోపణలతో పాటు అనేక కేసులలో విచారణ జరిపేందుకు ఆమెను తమకు అప్పగించాలని బీఎన్‌పీ సెక్రెటరీ జనరల్ మీర్జా ఫఖ్రుల్ ఇస్లామ్ ఆలంగీర్ ఇటీవల భారత్‌ను డిమాండ్ చేశారు.

గాజాలో కాల్పుల విరమణపై సిసీ, బైడెన్ చర్చలు

కైరో: గాజాలో కాల్పుల విరమణపై ఈజిప్టు, అమెరికా అధ్యక్షుడు అబ్దెల్-ఫత్తా అల్ సిసీ, జో బైడెన్ ఫోన్‌లో సంప్రదింపులు జరిపారు. తమ దేశాల అధ్వర్యంలో జరిగే దౌత్యంపై చర్చించారు. గత శుక్రవారం దోహాలో అమెరికా, ఈజిప్టు, ఖతార్ నాయకులు భేటీ అయి గాజాలో కాల్పుల విరమణపై చర్చలు జరిపారు. వారంలోగా ఒప్పందం కుదుర్చుకోవాలని నిర్ణయించుకున్నారు. ఇదే క్రమంలో గాజా స్ట్రిప్‌లో కాల్పుల విమరణ, బందీల విడుదల కోసం తీవ్రంగా సాగిస్తున్న ప్రయత్నాలపై ఇద్దరు అధినేతలు సమీక్షించినట్లు ఈజిప్టు అధ్యక్ష కార్యాలయ వర్గాలు వెల్లడించాయి. మానవతా సంక్షోభం దృష్ట్యా ఆ

ప్రాంతంలో సైనిక దాడులు మరింత పెరగకుండా నివారించడానికి కాల్పుల విరమణ అత్యవసరమని సిసీ నొక్కిచెప్పారు. ఇదిలావుంటే, బందీల విడుదల కోసం ఒప్పందంపై సంప్రదింపులు జరిపేందుకు మొసద్ ఇంటెలిజెన్స్ సర్వీస్, ఇజ్రాయిలీ భద్రతా సంస్థ అధినేతలు కైరో చేరుకుంటారని ఇజ్రాయిల్ ప్రధానమంత్రి కార్యాలయం ఇంతకుముందే ప్రకటించడం విదితమే.

యూపీఎస్‌కు ఓకే

(మొదటిపేజీ తరువాయి)

కలుగుతుంది. తద్వారా 25లక్షల మంది కేంద్రప్రభుత్వ ఉద్యోగులకు లబ్ధి చేకూరుతుంది. యూపీఎస్‌ను ఎంపిక చేసుకునే అవకాశం రాష్ట్ర ప్రభుత్వాలకూ లభించనుంది. రాష్ట్ర ప్రభుత్వాలు ఆమోదిస్తూ లబ్ధిదారుల సంఖ్య 90లక్షలకు పెరుగుతుంది. ప్రధాని మోదీ నేతృత్వంలో కేబినెట్ శనివారం సమావేశమైంది. యూపీఎస్‌తో పాటు సైన్స్ అండ్ టెక్నాలజీకి సంబంధించి మూడు పథకాలను ఆమోదించింది. అలాగే ఇంటర్ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌కూ అంగీకారం తెలిపింది. సైన్స్ అండ్ టెక్నాలజీ పథకాలను విజ్ఞాన ధారలో విలీనం చేసింది. ఇందుకోసం 2021-22 నుంచి 2025-26 వరకు 15వ ఆర్థిక కమిషన్ కాలానికి రూ.10,579 కోట్లు కేటాయించింది. ఈ పథకంలో సైన్స్ అండ్ టెక్నాలజీలో మానవ సామర్థ్యం పెంపు, పరిశోధనలు, అభివృద్ధి, నూతన ఆవిష్కరణలు, సాంకేతికత అభివృద్ధి, విస్తరణపై ప్రత్యేక దృష్టి కేంద్రకరించనున్నారు. కేబినెట్ నిర్ణయాలను కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ మీడియాకు తెలిపారు.

కొత్త పింఛన్ పథకాల్లో కొన్ని మార్పులను ప్రభుత్వ ఉద్యోగులు డిమాండ్ చేశారని చెప్పారు. ఇందుకోసం కేబినెట్ కార్యదర్శి టీవీ సోమనాథన్ చైర్మన్‌గా కమిటీని ప్రధాని మోదీ ఏర్పాటు చేశారన్నారు. కమిటీ 100కుపైగా సమావేశాలు నిర్వహించిందని, వేర్వేరు వ్యవస్థలు, దాదాపు అన్ని రాష్ట్రాలతో సంప్రదింపులు జరిపిందని తెలిపారు. భారత రిజర్వు బ్యాంకు, ప్రపంచ బ్యాంకు సలహాలు సూచనలు పొందిన తర్వాత యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్ (యూపీఎస్) రూపు దిద్దుకున్నట్లు వెల్లడించారు. ఈ పథకానికి కేంద్ర కేబినెట్ ఆమోదం లభించడంతో త్వరలోనే అమలవుతుందని వైష్ణవ్ చెప్పారు. ఇక అరియర్ల వ్యయం రూ.800 కోట్లుగా ఉన్నట్లు వెల్లడించారు. తొలి ఏడాదిలో వార్షిక ఖర్చు రూ.6,250 కోట్లకు పెరుగుతుందన్న అంచనా ఉందన్నారు. బయో ఈ-3 విధానం ద్వారా బయో విప్లవం రాబోతోందని.. బయో టెక్నాలజీ, బయో సైన్స్ రంగాల్లో అధిక ఉపాధి అవకాశాలు ఉన్నాయని అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. ఎకానమీ, ఎన్విరాన్మెంట్, ఎంప్లాయిమెంట్ ఆధారంగా బయో మనుఫ్యాక్చరింగ్ విధానం ఉంటుందన్నారు.

'స్మార్ట్' ముప్పు

(మొదటిపేజీ తరువాయి)

11 కేవీ ఫీడర్లకు డిస్కంలు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తాయి. ఇందులో అడ్వాన్స్‌డ్ మీటరింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, సర్వీస్ ప్రొవైడర్ కింద స్మార్ట్ మీటర్ల నుంచి రీడింగ్ నమోదు కోసం మూడు డిస్కంలు రూ.2,201.24 కోట్లతో వేర్వేరు టెండర్లు పిలిచాయి. వ్యవసాయానికి ప్రత్యేక ఫీడర్ల ఏర్పాటుకు రూ.6,725.72 కోట్లు జిల్లాల వారీ 9 పనులుగా విభజించి టెండర్ ప్రకటన జారీ చేశాయి. ఈ భారం మొత్తం విద్యుత్ వినియోగదారులపైనే పడనుంది. స్మార్ట్ మీటర్ల ఏర్పాటు, నిర్వహణకు టోటెక్స్ విధానంలో టెండర్లు పిలిచాయి. మూడు డిస్కంల పరిధిలో మొత్తం 30.74 లక్షల స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయనున్నాయి. దీనికోసం సీపీడీసీఎల్ రూ.783 కోట్లు, ఈపీడీసీఎల్ రూ.628.24 కోట్లు, ఎస్పీడీసీఎల్ రూ.790 కోట్లతో పనులను ప్రతిపాదించాయి. వ్యవసాయ విద్యుత్‌కు ప్రత్యేక ఫీడర్లు ఏర్పాటు, లోడు ఎక్కువగా ఉన్న ఫీడర్లను విభజించే పనులకు రూ.6,725 కోట్లతో డిస్కంలు ప్రతిపాదించాయి. డిస్కంల పరిధిలో చేపట్టనున్న పనులకు ఒకే టెండరు కాకుండా ప్రతి జిల్లాకు వేర్వేరుగా టెండర్లు పిలిచాయి. అయితే కేంద్ర ప్రభుత్వ నిబంధనలకు తలొగ్గి గత ప్రభుత్వం స్మార్ట్ మీటర్ల బిగింపుకు సిద్ధం కాగా... నాడు ప్రతిపక్ష పార్టీగా ఉన్న తెలుగుదేశం తీవ్రంగా వ్యతిరేకించింది.

ఇప్పుడు అదే టీడీపీ కూటమి ప్రభుత్వం చేష్టలుడిగి చూస్తోంది. ఇదంతా తమకేమీ తెలియదన్నట్లు వ్యవహరిస్తోంది. దీంతో కూటమి ప్రభుత్వ వైఖరిపై విద్యుత్ వినియోగదారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే గత ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో ప్రజాగ్రహం చవిచూడాల్సి వస్తుందని వినియోగదారులు హెచ్చరిస్తున్నారు.

ఒప్పందం రద్దు చేయాలి: రామకృష్ణ

స్మార్ట్‌మీటర్ల ఏర్పాటు ఒప్పందాన్ని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే రద్దుచేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్రంలో గృహ, పారిశ్రామిక, వాణిజ్య విద్యుత్ కనెక్షన్లకు స్మార్ట్‌మీటర్ల ఏర్పాటు కోసం అదానీ సంస్థ సిద్ధమవ్వడానికి రాష్ట్రంలో ఉన్నది చంద్రబాబు ప్రభుత్వమా లేక జగన్ సర్కారా అని ఆయన సూటిగా ప్రశ్నించారు. రాష్ట్రంలో గృహ, వాణిజ్య, పారిశ్రామిక విద్యుత్ కనెక్షన్లకు స్మార్ట్‌మీటర్ల ఏర్పాటును అదానీ సంస్థకు అప్పగిస్తూ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. 2025 డిసెంబర్ నాటికి 1.5 కోట్ల కనెక్షన్లకు విద్యుత్ స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసేలా అధికారులు ప్రతిపాదించారు. తొలిదశలో మూడు డిస్కంల పరిధిలో 27.68 లక్షల స్మార్ట్‌మీటర్ల ఏర్పాటుకు అదానీ కంపెనీ నాలుగు కంటైనర్లలో మీటర్లను, మీటర్లు అమర్చేందుకు సాంకేతిక సిబ్బందిని విజయవాడ పంపినట్లు తెలుస్తోంది. అదానీ కంపెనీ స్మార్ట్‌మీటర్ల ఏర్పాటుకు సిద్ధమవ్వడాన్ని సీపీఐ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నది. గత వైసీపీ ప్రభుత్వం మోదీ ప్రభుత్వ అనాలోచిత విధానాలకు, ఆదేశాలకు తలొగ్గి ఏపీలో విద్యుత్ సంస్కరణలకు పచ్చజెండా ఊపింది. విద్యుత్ స్మార్ట్‌మీటర్ల ఏర్పాటు పట్ల ప్రజానీకం నుండి తీవ్రమైన వ్యతిరేకత వ్యక్తమవుతున్నప్పటికీ జగన్ సర్కార్ నిరంకుశంగా వ్యవహరించి... అదానీ కంపెనీతో ఒప్పందాలు కుదుర్చుకుంది. రాష్ట్రంలో ప్రస్తుతం తెలుగుదేశం ప్రభుత్వం వచ్చినప్పటికీ అదానీ సంస్థ మొండిగా స్మార్ట్‌మీటర్ల ఏర్పాటు చేయాలనుకోవడం పాలకుల అసమర్థతకు తార్కాణం. స్మార్ట్‌మీటర్ల ఒప్పందాన్ని రద్దుచేసుకుంటే అదానీ కంపెనీ బలవంతంగా మీటర్లు బిగించే అవకాశం ఎందుకుంటుంది? జగన్‌మోహన్‌రెడ్డిలా అదానీకి ఈ ప్రభుత్వం కూడా దాసోహమయ్యిందా అని రామకృష్ణ ప్రశ్నించారు. తక్షణమే రాష్ట్రంలో విద్యుత్ స్మార్ట్‌మీటర్ల ఏర్పాటు ఒప్పందాన్ని రద్దు చేయాలని, లేనిపక్షంలో మరో విద్యుత్ ఉద్యమం తప్పదని హెచ్చరించారు.

ప్రక్రియ నిలిపివేయాలి: శ్రీనివాసరావు

రాష్ట్రంలో వ్యవసాయ పంపుసెట్లకు, నివాస గృహాలకు విద్యుత్ స్మార్ట్ మీటర్ల బిగింపు ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలని సీపీఐ(యం) రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాదేశాలకు లొంగి రాష్ట్రంలోని నివాస గృహాలకు విద్యుత్ ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు, వ్యవసాయ పంపు సెట్లకు మీటర్లు పెట్టాలని గత వైసీపీ ప్రభుత్వం నిర్ణయించింది. అదానీ, షిరిడి సాయి తదితర కంపెనీలకు కాంట్రాక్టులు కట్టబెట్టింది. ఇందులో పెద్ద ఎత్తున అవినీతి చోటుచేసుకున్నది. తెలుగుదేశం ప్రతిపక్షంలో ఉండగా ఈ మీటర్లను వ్యతిరేకించింది. హైకోర్టులో పిటిషన్లు వేసింది. నేడు తెలుగుదేశం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ ఒప్పందాలను రద్దు చేయకపోగా స్మార్ట్ మీటర్ల ప్రక్రియను కొనసాగిస్తున్నది. విజయవాడ సహా అనేక ప్రాంతాల్లో అదానీ సంస్థకు చెందిన మీటర్లు తెచ్చి విద్యుత్ కార్యాలయాల్లో భద్రపరుస్తున్నారు. వ్యవసాయ పంపు సెట్లకు, ప్రభుత్వ కార్యాలయాలలోను మీటర్లు బిగిస్తున్నారు. తదుపరి నివాస గృహాలకు మీటర్లు బిగించే ప్రక్రియకు సిద్ధమవుతున్నారు. అందువల్ల తక్షణమే అదానీ, షిర్డీసాయి తదితర కంపెనీలతో చేసుకున్న ఒప్పందాలు రద్దు చేయాలని, బిగించిన మీటర్లను తొలగించాలని డిమాండ్ చేశారు.

తుంగభద్ర డ్యామ్ ఎత్తుపై
దాగుడుమూతలు

సీపీఐ నేత జగదీశ్ విమర్శ

విశాలాంధ్ర-గుత్తి (గుంతకల్): తుంగభద్ర డ్యామ్ ఎత్తును బోర్డు అధికారులు వెల్లడించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు డి.జగదీశ్ డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న స్మార్ట్ మీటర్ విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో శనివారం జగదీశ్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తుంగభద్ర డ్యామ్ ఎత్తును బోర్డు అధికారులు 2023లో1633 అడుగుల నుంచి1634 అడుగులకు పెంచారు. దీనిని అమలు చేయకుండా రహస్యంగా ఉంచడానికి కారణమేమిటని జగదీశ్ ప్రశ్నించారు. జిందాల్ లాంటి పరిశ్రమలకు నీటి అమ్మకానికి ప్రయత్నం చేస్తున్నారా అని అనుమానం వ్యక్తంచేశారు. 1633 అడుగుల నుండి 1634 అడుగులు ఎత్తు పెంచడం వల్ల 10 లేక 15 టీఎంసీల నీరు నిల్వ ఉంచడానికి అవకాశాలు ఉన్నాయని చెప్పారు. కర్నాటక, తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాలకు నీటి వాటాలు పంపిణీ చేయాల్సిన అవసరం ఉందన్నారు. గతంలో కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డి కర్నూలు పరిధిలో గూడ్స్ మరమ్మతు తయారీ పరిశ్రమను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని, ఇప్పుడు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వమే ఉండటంతో ఈ పరిశ్రమ ఏర్పాటుకు ప్రయత్నించాలని కోరారు. గూడ్స్ మరమ్మతు పరిశ్రమకు కావలసిన భూమి గుంతకల్లు రైల్వే పరిధిలో ఉందని తెలిపారు.

గుంతకల్లు రైల్వే పరిధిలో గూడ్స్ మరమ్మతు పరిశ్రమ ఏర్పాటు కోసం స్థానిక ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో స్మార్ట్ మీటర్ల విధానం సరికాదని, దీనివల్ల సామాన్యులు, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుందని, ఈ ఆలోచనను విరమించుకోవాలని జగదీశ్ హితవు పలికారు. స్మార్ట్ మీటర్లను ప్రతిపక్ష పార్టీగా టీడీపీ వ్యతిరేకించిన విషయాన్ని గుర్తుచేశారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి, సహాయ కార్యదర్శి మహేశ్, పట్టణ కార్యదర్శి గోపీనాథ్, సహాయ కార్యదర్శి ఎస్ఎండీ గౌస్, మండల కార్యదర్శి రాము రాయల్, ఏఐఎస్ఎఫ్ నియోజకవర్గ కార్యదర్శి వెంకట్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ జార్ఖండ్ వాసి మృతి

(మొదటిపేజీ తరువాయి)

చెందిన కెమిస్ట్ కొవ్వాడ సూర్యనారాయణ(36), జార్ఖండ్‌కు చెందిన హెల్పర్లు ఓయబోం కొర్వ(24), రొయా అంగిరియా(22), లాల్సిం పూర్తి(24)కి తీవ్ర గాయాలయ్యాయి. విశాఖలో ఇండస్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ రోయా అంగిరియా (22) శనివారం సాయంత్రం మృతి చెందాడు. మిగిలిన ముగ్గురికి చికిత్స అందిస్తున్నట్టు వైద్యులు తెలిపారు. మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీకి తరలించారు.

ఫార్మా ప్రమాదాలపై అఖిలపక్షం

(మొదటిపేజీ తరువాయి)

వేతనాలు ఇస్తున్నాయని దుయ్యబట్టారు. అచ్యుతాపురం సెజ్‌లోని ఎసెన్షియా ఫార్మా కంపెనీలో జరిగిన ప్రమాదంలో 17 మంది, పరవాడ ఫార్మాసిటీలోని సినర్జిన్ యాక్టివ్ ఇన్ గ్రేడియంట్స్‌లో జరిగిన ప్రమాదంలో ఒకరు మరణించగా... మిగిలిన ముగ్గురి పరిస్థితి విషమంగా ఉందని, అయినా యాజమాన్యాలు పత్తా లేకుండా దొంగలు మాదిరిగా దాక్కున్నాయని విమర్శించారు. సినర్జిన్ ఫార్మా కంపెనీలో జరిగిన ప్రమాదంలో మృతి చెందిన కార్మికుడి కుటుంబానికి కోటి రూపాయలు, తీవ్రంగా గాయపడిన వారికి రూ.50 లక్షల చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని ఫార్మా కంపెనీలలో నెలకొన్న పరిస్థితులపై చర్చ జరగాలని అన్నారు.

రామకృష్ణ వెంట సీపీఐ విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, కార్యవర్గ సభ్యులు ఎ.విమల, షేక్ రెహమాన్, పి.చంద్రశేఖర్, ఎం.మన్మథరావు, సీఎన్ క్షేత్రపాల్ తదితరులు ఉన్నారు.

ఎండీయూ వాహనాలకు చెక్ !

(మొదటిపేజీ తరువాయి)

డెలివరీ పేరుతో గత ప్రభుత్వం రూ.1,844 కోట్లు వెచ్చించి 9,260 మొబైల్ డిస్ట్రిబ్యూషన్ యూనిట్స్ (ఎండీయూ) వాహనాలు కొనుగోలు చేసింది. ఎండీయూ వాహనాల వల్ల నష్టమే తప్ప లాభం లేదని ప్రభుత్వం గుర్తించింది. ఎండీయూ ఆపరేటర్‌కు నెల వేతనంగా రూ.10 వేలు, వాహనంలో ఉండే హమాలీకి రూ.5 వేలు, పెట్రోల్ ఖర్చులకు మరో 3 వేలు ఇలా మొత్తం కలిపి ప్రభుత్వం నెలకు ఒక్కో వాహనంపై 18 వేల రూపాయలు ఖర్చు చేస్తోంది. దాదాపు నెలకు రూ.17 కోట్ల భారం ప్రభుత్వంపై పడుతోంది. ఈ లెక్కన పాత విధానం మళ్లీ అమలులోకి తీసుకువస్తే ఏటా ప్రభుత్వ ఖజానాకు రూ.204 కోట్లు ఆదా అవుతుందని అధికారులు అంచనా వేశారు. ఈ నేపథ్యంలో మరల చౌక ధరల దుకాణాల (రేషన్ షాపుల) ద్వారానే నిత్యావసర వస్తువులను పంపిణీ చేసినట్లయితే ఆర్థిక భారం గణనీయంగా తగ్గుతుందని ప్రభుత్వం భావిస్తోంది. ప్రస్తుతం రేషన్ షాపుల్లో బియ్యం, పంచదార మాత్రమే పంపిణీ జరుగుతుండగా, గతంలో మాదిరిగా బియ్యం, పంచదారతో పాటు కందిపప్పు, గోధుమ పిండి, పామాయిల్ వంటి నిత్యావసర వస్తువులను రేషన్ షాపుల ద్వారానే కార్డు దారులకు చౌక ధరలకు అందించాలని ప్రభుత్వం యోచిస్తోంది. చౌక ధరల దుకాణాల్లో ఎక్కువ సరుకులు పంపిణీ చేసినట్లయితే ప్రజల నుంచి కూడా సానుకూలత ఉంటుందని భావిస్తోంది. ఈ క్రమంలోనే రేషన్ దుకాణాల ద్వారా నిత్యావసరాలను పంపిణీ చేయాలని కోరుతున్నారా?, ఎండీయూ వాహనాల ద్వారానే రేషన్ పంపిణీ కొనసాగించాలా? అనే విషయాలపై ఇటీవల ప్రభుత్వం కార్డుదారుల నుంచి అభిప్రాయాలు కూడా సేకరించింది. మెజార్టీ ప్రజలు రేషన్ దుకాణాల ద్వారానే నిత్యావసరాల పంపిణీ జరిగితే ఉపయోగకరమని అభిప్రాయపడ్డారు. దీనివల్ల ఎప్పుడు ఖాళీగా ఉంటే అప్పుడు తీసుకునే వీలు ఉంటుందని చెప్పారు. పనులకు వెళ్లకుండా ఇళ్ల వద్ద ఖాళీగా ఉండే వారు మాత్రం తమ వీధి చివర ఎండీయూ వాహనం ద్వారా ఇచ్చినా, లేక రేషన్ షాపుల ద్వారా ఇచ్చినా ఫరవాలేదంటున్నారు. అయితే ఉన్నపళంగా 9 వేలకు పైగా ఉన్న ఎండీయూ ఆపరేటర్ సేవలను నిలుపుదల చేస్తే వారి పరిస్థితి ఏమిటి? వారు వ్యాన్ కొనుగోలు కోసం చేసిన అప్పునకు ప్రతి నెలా కిస్తీలను ఎలా చెల్లిస్తారనే ప్రశ్న ఉదయిస్తోంది. ఎండీయూ వాహనాలకు ఇంకా చెల్లింపులు జరపాల్సి ఉండడంతో ఆ సమస్యను ఎలా పరిష్కరించాలన్న దానిపై ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఎండీయూ వాహనాల విషయంలో ఎలా వ్యవహరించాలి, రేషన్ డీలర్లను ఎలా ఉపయోగించుకోవాలనే అంశాలపై వివిధ ప్రతిపాదనలతో రావాలని ఇప్పటికే సీఎం చంద్రబాబు అధికారులకు సూచించారు. ఏది ఏమైనా ఎండీయూ వ్యవస్థను త్వరలో రద్దు చేసేలా ప్రభుత్వం నిర్ణయం ఉంటుందని భావిస్తున్నారు. పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ సైతం ఎండీయూ వాహనాల వ్యవస్థపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో 28న జరిగే మంత్రివర్గ సమావేశంలో రేషన్ పంపిణీ విధానంపై చర్చించి కీలక నిర్ణయం వెలువరించే అవకాశం ఉందని తెలుస్తోంది.

అందుబాటులోకి చంద్రయాన్-3 డేటా

(మొదటిపేజీ తరువాయి)

శాస్త్రవేత్తలకు మాత్రమే ఈ డేటాను పరిమితం చేయడంలేదు. దేశ, విదేశాల్లోని పరిశోధకులకు దీన్ని అందుబాటులో ఉంచుతున్నాం. దీనివల్ల ఫలితం మరింత మెరుగ్గా ఉంటుంది' అని ఇస్రో చైర్మన్ సోమనాథ్ తెలిపారు. ఇండియన్ స్పేస్ సైన్స్ డేటా సెంటర్ (ఐఎస్ఎస్‌డీసీ)కి సంబంధించిన వెబ్‌సైట్ నుంచి ఈ డేటాను పొందవచ్చని ఇస్రో వెల్లడించింది.

12 గంటల వ్యవధిలోనే తల్లీకూతుళ్ల మృతి

అధికారుల పర్యవేక్షణ కొరవడిందని ఆవేదన

విశాలాంధ్ర-పార్వతీపురం: మన్యం జిల్లాలోని జియ్యమ్మవలస మండలం బిత్రపాడు పంచాయతీ పరిధిలోని పునరావాస గ్రామం బట్లభద్రలో డెంగీ లక్షణాలతో 12 గంటల వ్యవధిలోనే తల్లీకూతురు మృతిచెందడంతో స్థానికుల్లో భయాందోళన నెలకొంది. వైద్యారోగ్య అధికారుల తీరుపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోనూ, జిల్లా కేంద్ర ఆసుపత్రిలోనూ సక్రమంగా వైద్య సేవలు అందకపోవడం వల్లనే లక్షలాది రూపాయలు అప్పుచేసి ప్రైవేటు ఆసుపత్రిలో చేరాల్సిన దుస్థితి నెలకొందని మండిపడుతున్నారు. బట్లభద్రలో జ్వరపీడితులు అధికంగా ఉండడంతో శనివారం వైద్యశిబిరం ఏర్పాటు చేసి 33 మందికి మలేరియా, డెంగీ తదితర పరీక్షలు నిర్వహించారు. రాష్ట్ర వైద్యారోగ్య శాఖమంత్రి, ఆ శాఖ ఉన్నతాధికారులు మన్యం జిల్లాలో పర్యటించిన రోజే మరణాలు సంభవించడం ప్రజానీకానికి మింగుడుపడడం లేదు. వివరాలివి. బట్లభద్రకి చెందిన మేరువ దుర్గమ్మ (47)కు జ్వరం రావడంతో సమీపంలోని చినమేరంగి సామాజిక ఆరోగ్య కేంద్రానికి వారం క్రితం వెళ్లి చికిత్స పొందింది. జ్వరం తగ్గకపోవడంతో పార్వతీపురంలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చేరింది. అక్కడా తగ్గక పోవడంతో విజయనగరంలో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేరింది. చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందింది. అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఆమె కుమార్తె మేరువ చైతన్య (20) తల్లికి బాగాలేదని తెలిసి మరుసటి రోజు ఇంటికి వచ్చింది. ఆమెకు జ్వరం రావడంతో మొదటి సామాజిక ఆరోగ్య కేంద్రంలో చేరి... జ్వరం తగ్గకపోవడంతో పార్వతీపురంలో ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో వారం క్రితం జాయిన్ అయింది. వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స నిమిత్తం శ్రీకాకుళంలో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేరింది. అక్కడ చికిత్స పొందుతూ తల్లి మృతి చెందిన 12 గంటల అనంతరం ఆమె తనువు చాలించింది.

సందీప్ ఘోష్‌పై అవినీతి కేసు

(మొదటిపేజీ తరువాయి)

అందజేశారు. ఈ మేరకు సీబీఐ వర్గాలు తెలిపాయి. కేసులో ఎఫ్ఐఆర్ ప్రతిని అలీపూర్‌లోని చీఫ్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్‌కు అందజేసినట్లు పేర్కొన్నాయి. ఇదిలావుంటే దిల్లీ కేంద్ర ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ (సీఎఫ్ఎస్ఎల్) నిపుణుల బృందం కోల్‌కతాకు చేరుకొని సందీప్‌ఘోష్‌తో పాటు వైద్యురాలిపై హత్యాచారానికి సంబంధం ఉన్న నిందితులకు పోలీగ్రాఫ్ పరీక్ష నిర్వహించింది. సంజయ్ రాయ్‌కు జైలులో పాలీగ్రాఫ్ పరీక్ష జరిగింది. సందీప్ ఘోష్‌తో పాటు నలుగురు డాక్టర్లకు ఏజెన్సీ కార్యాలయంలో పరీక్షలు నిర్వహించింది. రాయ్‌ను 20 ప్రశ్నలు అడిగిన సీబీఐ... ఘోష్‌ను సుమారు 25 ప్రశ్నలు అడిగినట్లు సమాచారం. నిందితుడిని గందరగోళపరిచేందుకు కొన్ని అనవసరమైన ప్రశ్నలు కూడా అడిగినట్లు తెలిసింది. సందీప్ ఘోష్‌తో పాటు నలుగురు వైద్యులు, ఒక వలంటీర్‌కు పాలీగ్రాఫ్ పరీక్ష నిర్వహించేందుకు సీబీఐకి హైకోర్టు ఆదేశాలిచ్చింది. ఈ కేసులో మూడు వారాల్లో (అంటే సెప్టెంబరు 17నాటికి) ప్రగతి నివేదిక ఇవ్వాలని కూడా స్పష్టం చేసింది. వైద్యురాలిపై హత్యాచారం జరిగిన మరుసటి రోజు సంజయ్ రాయ్ అరెస్టు కాగా ఈనెల 13న కేసు దర్యాప్తును కోల్‌కతా పోలీసుల నుంచి సీబీఐకి అప్పగిస్తూ హైకోర్టు ఆదేశాలిచ్చింది. 14వ తేదీ నుంచి సీబీఐ దర్యాప్తు మొదలైంది.

సహనం కోల్పోతున్నాం: మృతురాలి తల్లిదండ్రులు

తమ బిడ్డ దోషులెవరో తేల్చేందుకు సీబీఐ చాలా సమయం తీసుకుంటోందని, విచారణ నత్త నడకన సాగుతోందని వైద్యురాలి తల్లిదండ్రులు అసహనం వ్యక్తంచేశారు. విచారణను వేగవంతం చేయాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. 'సహనం కోల్పోతున్నాం. 14 రోజులు గడిచిపోయాయి. సీబీఐ వేగం పెంచాలి. ప్రజలు సీబీఐని నమ్ముతారు. మాకూ నమ్మకం ఉంది కానీ ఇప్పటివరకు కేసులో ఎలాంటి పురోగతి లేదు' అని వైద్యురాలి తండ్రి అన్నారు. తమకు ప్రతి క్షణం ఒక యుగంగా మారిందని ఆమె తల్లి ఆవేదన వ్యక్తంచేశారు. తమలో సహనం నశించిపోయే లోపు దోషులు ఎవరో తేల్చాలని కోరారు.

హీరో నాగార్జున ఎన్ కన్వెన్షన్ కూల్చివేత

(మొదటిపేజీ తరువాయి)

ప్రారంభించింది. తుమ్మిడికుంట ఎఫ్‌టీఎల్ మొత్తం విస్తీర్ణం 29.6 ఎకరాలు. 2014లో 2.39 ఎకరాల్లో 19 అక్రమ కట్టడాలు నిర్మించినట్లు హైడ్రా గుర్తించింది. ఎఫ్‌టీఎల్ పరిధిలో 2020లో 4.69 ఎకరాల్లో 32 అక్రమ కట్టడాలు నిర్మించినట్లు పేర్కొంది. తుమ్మిడికుంట బఫర్ జోన్ మొత్తం విస్తీర్ణం 10 ఎకరాలు అని హైడ్రా పేర్కొంది. తుమ్మిడి చెరువులో ప్రైవేటు వ్యక్తుల షెడ్లను కూల్చేస్తోంది. కొందరు అక్రమంగా బోరుబావులను తవ్వారు. వాటి ద్వారా నీటిని బయటకు సరఫరా చేస్తున్నారు.

అనుమతులు లేవు: హైడ్రా కమిషనర్ రంగనాథ్

మాదాపూర్‌లోని ఎన్ కన్వెన్షన్ కూల్చివేతపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ శనివారం ఓ ప్రకటనలో వివరణ ఇచ్చారు. 'తుమ్మడికుంట ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలోని ఆక్రమణలను హైడ్రా, జీహెచ్ఎంసీ, టౌన్‌ప్లానింగ్, రెవెన్యూ సిబ్బంది కూల్చివేశారు. తుమ్మిడికుంటలోని అనధికార నిర్మాణాల్లో ఎన్ కన్వెన్షన్ ఒకటి. చెరువులోని ఎఫ్‌టీఎల్‌లో ఎకరా 12 గుంటలు, బఫర్ జోన్ పరిధిలోని 2 ఎకరాల 18 గుంటల్లో ఎన్ కన్వెన్షన్ నిర్మించారు. ఈ నిర్మాణానికి జీహెచ్ఎంసీ నుంచి అనుమతులు లేవు. బీఆర్ఎస్ కింద అనుమతుల కోసం ఎన్ కన్వెన్షన్ ప్రయత్నించింది. సంబంధిత అధికారులు బీఆర్ఎస్‌కు అనుమతించలేదు. 2014లో హెచ్ఎండీఏ నోటిఫికేషన్ ఇచ్చింది. ఆ తర్వాత ఎన్ కన్వెన్షన్ యాజమాన్యం హైకోర్టుకు వెళ్లింది. చట్టబద్ధంగా ఉండాలని గతంలో ఉన్నతన్యాయస్థానం ఆదేశించింది. 2017లో ఎఫ్‌టీఎల్ సర్వే నివేదికపై కేసు పెండింగ్‌లో ఉంది. ఎన్ కన్వెన్షన్‌కు ఇప్పటి వరకు ఏ కోర్టు స్టే ఇవ్వలేదు. ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌కు సంబంధించి ఎన్ కన్వెన్షన్ తప్పుదోవ పట్టించి వాణిజ్య కార్యక్రమాలు సాగించింది' అని రంగనాథ్ వివరించారు.

అది పట్టా భూమి... చట్ట విరుద్ధమైతే నేనే కూల్చేవాడిని: నాగార్జున

ఎన్ కన్వెన్షన్ సెంటర్ కూల్చివేతపై సినీ నటుడు అక్కినేని నాగార్జున స్పందించారు. హైడ్రా చట్టవిరుద్ధంగా వ్యవహరించిందంటూ వ్యాఖ్యానించారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా పోస్టు పెట్టారు. స్టే ఆర్డర్‌లు, కోర్టు కేసులకు విరుద్ధంగా ఎన్ కన్వెన్షన్‌కు సంబంధించి కూల్చివేతలు చేపట్టడం బాధాకరమని పేర్కొన్నారు.

చట్టాన్ని ఉల్లంఘించేలా తాము ఎటువంటి చర్యలు చేపట్టలేదని, కొన్ని వాస్తవాలను తెలిపేందుకు ఈ ప్రకటన చేసినట్లు వెల్లడించారు. 'ఆ భూమి పట్టా భూమి. ఒక్క అంగుళం ట్యాంక్ ప్లాన్ కూడా ఆక్రమణకు గురికాలేదు. ప్రైవేట్ స్థలంలో నిర్మించిన భవనమిది. కూల్చివేత కోసం గతంలో ఇచ్చిన అక్రమ నోటీసుపై స్టే కూడా మంజూరు చేసింది. స్పష్టంగా చెప్పాలంటే, కూల్చివేత తప్పుడు సమాచారంతో లేదా చట్ట విరుద్ధంగా జరిగింది. కూల్చివేతకు ముందు ఎలాంటి నోటీసు ఇవ్వలేదు. కేసు కోర్టులో ఉన్నప్పుడు ఇలా చేయడం సరికాదు. చట్టాన్ని గౌరవించే పౌరుడిని. కోర్టు నాకు వ్యతిరేకంగా తీర్పునిస్తే, ఆ కూల్చివేతను నేనే నిర్వహించేవాడిని. తాజా పరిణామాల వల్ల, మేం ఆక్రమణలు చేశామని, తప్పుడు నిర్మాణాలు చేపట్టామని ప్రజలకు తప్పుడు సంకేతాలు వెళ్లే అవకాశముంది. ఆ అభిప్రాయాన్ని పోగొట్టాలనేదే మా ప్రధాన ఉద్దేశం.

హైకోర్టు స్టే

ఎన్ కన్వెన్షన్ కూల్చివేతపై నాగార్జున హైకోర్టును ఆశ్రయించారు. తమది పట్టా భూమి అని, ట్యాంక్ భూమిని అంగుళం కూడా ఆక్రమించలేదని పిటిషన్‌లో పేర్కొన్నారు. తప్పుడు సమాచారం ఆధారంగా అధికారులు కూల్చివేశారని తెలిపారు. దీనిపై స్టే ఇవ్వాలని కోర్టును కోరారు. సానుకూలంగా స్పందించిన జస్టిస్ టీ వినోద్ కుమార్ విచారణ అనంతరం కూల్చివేతలు నిలిపివేయాలని తాత్కాలిక ఉత్తర్వులు జారీ చేశారు.

అక్రమ కట్టడాలపై ప్రత్యేక దృష్టి

హైదరాబాద్‌లో గత కొన్నిరోజులుగా అక్రమ కట్టడాలపై హైడ్రా స్పెషల్ ఫోకస్ పెట్టింది. అక్రమ కట్టడాలను గుర్తించి వెంటనే కూల్చివేస్తోంది. తాజాగా మాజీ మంత్రి కేటీఆర్‌కు చెందినదిగా భావిస్తున్న జవ్వాడ ఫామ్ హౌస్ సైతం అక్రమ నిర్మాణం అంటూ కూల్చివేయడానికి రంగం సిద్ధమైంది. అయితే దీనికి వ్యతిరేకంగా కోర్టుకు వెళ్లారు. కేటీఆర్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కేవీపీ, గడ్డం వివేక్, మధుయాష్కీ, పట్నం మహేందర్‌రెడ్డిల ఫామ్‌హౌజ్‌లన్నీ అక్రమంగా నిర్మించినవే అన్న ఆరోపణలు ఉన్నాయి.అమీన్ పూర్, పటాన్ చెరు మండలాల్లో చెరువుల చుట్టూ వెలసిన కాలనీలు, ఎఫ్‌టీఎల్ పరిధిలోకి వచ్చే ప్లాట్లు, ఆక్రమణలను గుర్తించే పనిలో నిమగ్నమైంది. అమీన్ పూర్ మండలం, మున్సిపాలిటీలోని చెరువులు, నాలాలు ఆక్రమణకు గురైనట్టు డ్రోన్ కెమెరాతో సర్వే చేసి గుర్తించింది. హైడ్రా కమిషనర్ రంగనాథ్ చెరువులను సందర్శించి సమగ్ర నివేదికలు తయారుచేయాలని అధికారులను ఆదేశించారు. గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలతో గతంలో సర్వే నిర్వహించగా, అక్రమ నిర్మాణాల కూల్చివేతలపై న్యాయపరమైన చిక్కులు రాకుండా హైడ్రా అధ్యయనం చేస్తున్నట్టు సమాచారం. దీంతో కొంతమంది ఆక్రమణదారులు ఆందోళనపడుతూ న్యాయనిపుణుల చుట్టూ తిరుగుతున్నట్లు తెలుస్తోంది.

విశాలాంధ్ర

3

ఆదివారం
25 ఆగస్టు 2024

ఒకటిన రైతాంగ డిమాండ్స్ డే

రైతు సంఘం నేతలు ఈశ్వరయ్య, కేవీవీపీ పిలుపు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తెచ్చేందుకు అఖిల భారత కిసాన్‌సభ పిలుపు మేరకు సెప్టెంబరు 1న రాష్ట్ర వ్యాపితంగా రైతాంగ డిమాండ్స్ డే పాటించి... పర్యావరణ రక్షణ కోసం మొక్కలు నాటాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.ఈశ్వరయ్య, కేవీపీ ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. సెప్టెంబరు 1న రైతుసంఘం పతాకావిష్కరణతోపాటు రైతాంగ సమస్యలపై సభలు, సమావేశాలు, గ్రూపు మీటింగ్‌లు నిర్వహించాలని అన్నదాతలకు పిలుపునిచ్చారు. నరేంద్రమోదీ ప్రభుత్వం రూపొందించిన నల్ల వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా దిల్లీ సరిహద్దుల్లో 13 మాసాలకుపైగా రైతాంగం నిర్వహించిన చారిత్రాత్మక పోరాటం విరమణ సందర్భంగా ఇచ్చిన హామీలు ఏ ఒక్కటీ అమలు చేయకుండా రైతాంగాన్ని మోసం చేస్తున్నదన్నారు. హామీల అమలు కోసం దేశవ్యాపితంగా రైతు, కార్మిక, ప్రజాసంఘాలు ఉద్యమిస్తున్న తరుణంలో రాష్ట్రంలోని రైతాంగ సమస్యలను జోడించి పాలకులపై ఒత్తిడి తెచ్చేందుకు సెప్టెంబరు 1వ తేదీన మరోమారు ఉద్యమానికి సన్నద్ధమవ్వాలని ఈశ్వరయ్య, ప్రసాద్ కోరారు.

భారత్ నెట్ ప్రాజెక్టుకు సహకరించాలి

కేంద్ర మంత్రి పెమ్మసానికి వినతి

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: కేంద్ర కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్ర శేఖర్‌ని రాష్ట్ర పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ కార్యదర్శి ఎస్.సురేశ్ కుమార్ దిల్లీలో కలిశారు. ఆంధ్రప్రదేశ్‌లో భారత్ నెట్ ప్రాజెక్టు అమలుపై మంత్రి పెమ్మసానికి నివేదిక సమర్పించారు. రాష్ట్రంలో భారత్ నెట్ ప్రాజెక్టును మరింత విస్తృతంగా అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వ సహకారం అందించాలని సురేశ్‌కుమార్ కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఫైబర్ నెట్ మేనేజింగ్ డైరెక్టర్ కె.దినేశ్ కుమార్ పాల్గొన్నారు.

కిడ్నీ బాధితుల గోడు పట్టదా? దోనేపూడి

విశాలాంధ్ర-విజయవాడ: ప్రజల ప్రాణాలు పోతున్నా కిడ్నీ బాధితుల గోడు పాలకులకు పట్టడంలేదని, కూతవేటు దూరంలో కృష్ణాజలాలు ఉన్నా తాగునీటికి నోచుకోవడం లేదని సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ నెల 27, 28, 29 తేదీలలో జరగనున్న ప్రజా ఆరోగ్య పరిరక్షణ పాదయాత్రను జయప్రదం చేయాలని కోరుతూ శనివారం స్థానిక దాసరిభవన్‌లో గోడపత్రికను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ తిరువూరు నియోజకవర్గం ఎ. కొండూరు, గంపలగూడెం మండలాలు కిడ్నీ బాధితుల ఆవాస కేంద్రాలుగా మారిపోయాయిని ఆందోళన వ్యక్తం చేశారు. ఐదేళ్ల కాలంలో దళిత, గిరిజన తండాల్లో 300మందికి పైగా ఊపిరి వదిలారన్నారు. వందలాదిమంది ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మంచినీళ్లే కబళిస్తున్నాయని తెలిసినా, ఫ్లోరైడ్, సిలికాన్ కలుషిత నీరు తమ ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్నా ఉన్న ఊరిమీద ప్రేమతో అక్కడే జీవనం సాగిస్తున్నారని చెప్పారు. తిరువూరు నియోజకవర్గం మొత్తానికి కృష్ణాజలాలను సరఫరా చేస్తాం అని చెప్పిన గత ప్రభుత్వాల మాటలు నీటి మూటలుగా మిగిలిపోయాయని విమర్శించారు.

సిట్టింగ్ జడ్జితో విచారణ అవశ్యం

- ప్రభుత్వ అండతో ఫార్మా యాజమాన్యాల బరితెగింపు
- ఓబులేసు, నర్సింగరావు విమర్శ

విశాలాంధ్ర బ్యూరో-అనకాపల్లి: అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం సెజ్‌లో ఎసెన్షియా ఫార్మా పరిశ్రమలో జరిగిన దుర్ఘటనపై సిటింగ్ జడ్జితో విచారణ జరిపించాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. ఓబులేసు, సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న 20 మంది కార్మికులను శనివారం వారు పరామర్శించారు. సంఘటన వివరాలు, వారి ఆరోగ్య పరిస్థితి, ప్రభుత్వం ప్రకటించిన ఎక్స్‌గ్రేషియా వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం సీపీఎం కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఓబులేసు మాట్లాడుతూ ఎసెన్షియా పరిశ్రమలో జరిగిన ఘోర ప్రమాదంపై వివరాలు తెలుసుకోవడానికి కేంద్ర, రాష్ట్ర కార్మికసంఘాల ప్రతినిధులమంతా వచ్చామని తెలిపారు. సంఘటన జరిగిన నాటి నుండి నేటి వరకు యాజమాన్యం అందుబాటులోకి రాకపోవడం చూస్తే ప్రభుత్వం ఏ స్థాయిలో వారిని కాపాడుతుందో అర్థమవుతోందన్నారు. యాజమాన్యం అందుబాటులోకి రాలేదని ముఖ్యమంత్రి, హోంమంత్రి చెప్పడం సిగ్గుచేటు కాదా అని ప్రశ్నించారు. ఫార్మా యాజమాన్యాలు, ప్రభుత్వాలు కుమ్మక్కై నిబంధనలను గాలికొదిలేసి కార్మికుల ప్రాణాలు తీస్తున్నాయని మండిపడ్డారు. ప్రభుత్వాలు ఫార్మా కంపెనీల యజమానులతో లాలూచీ పడడం వల్లే... నియంత్రణ కోల్పోయిందని విమర్శించారు. ప్రభుత్వం, యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని, దీనికి పూర్తి బాధ్యత వారే వహించాలని డిమాండ్ చేశారు. అత్యున్నతస్థాయి కమిటీ పేరుతో హడావుడి చేయడం తప్ప కంపెనీ యాజమాన్యంపై ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోదని అన్నారు. సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపిస్తే ప్రభుత్వ సంస్థల నిర్లక్ష్యం బయటపడుతుందన్నారు. చంద్రబాబుకు పరిశ్రమలపై అవగాహన లేదని, కేవలం కక్ష సాధింపుపైనే దృష్టి ఉందని అన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే కార్మిక సంఘాలతో ప్రభుత్వం సమావేశం ఏర్పాటు చేసి సలహాలు తీసుకోవాలని సూచించారు. మృతుల కుటుంబాలలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

నర్సింగరావు మాట్లాడుతూ ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో నెంబర్ వన్ స్థానంలో ఉన్నామని చెప్పుకుంటున్న ముఖ్యమంత్రి చంద్రబాబు... ఇలాంటి ఘోర తప్పిదాలకు కారణం ఎవరని చెబుతారని ప్రశ్నించారు. ప్రత్యేక ఆర్థిక మండళ్లలో తనిఖీలే ఉండకూడదని 2019లో జీవో 62 తీసుకువచ్చిన చంద్రబాబు... ఆ జీవోను ఉపసంహరించి ఫార్మా కంపెనీలలో నిరంతరం తనిఖీలు నిర్వహించే విధంగా ఫ్యాక్టరీ చట్టాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్ఈజెడ్‌లు ఆధునిక జైళ్లుగా మారిపోయాయని ఆరోపించారు. రాష్ట్రంలో పదిమంది ధనికులు ఉంటే... అందులో 9 మంది ఫార్మా కంపెనీ యాజమాన్యాలు ఉన్నాయని చెప్పారు. ప్రభుత్వ అండతో నిబంధనలను గాలికి వదిలేసి అనుమతులు లేకుండా పరిశ్రమలు నడుపుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి కొండలరావు, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరరావు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజాన దొరబాబు, సీఐటీయూ నాయకులు శంకరరావు, ఐఎఫ్‌టీయూసీ, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

సీనియర్ కమ్యూనిస్టు ఎన్.వి.నరసింహారావు మృతి

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్: గుంటూరు జిల్లాలో సీనియర్ కమ్యూనిస్టు నాయకులు ఎన్.వి.నరసింహారావు శనివారం పొన్నూరులోని డాక్టర్ రాజారావు నర్సింగ్ హోంలో మరణించారు. గుంటూరు కొరిటెపాడులోని ఆయన కుమార్తె గృహంలో నరసింహారావు భౌతికకాయాన్ని ఉంచారు. చరిత్ర అధ్యాపకుడిగా పని చేసిన ఆయన అనేక ప్రజా ఉద్యమాలలో పాల్గొన్నారు. గుంటూరు జిల్లా చరిత్ర కాంగ్రెస్‌ను స్థాపించి గత 30 ఏళ్లుగా చరిత్ర పాఠ్యాంశం అధ్యయనానికి అనేక సదస్సులు నిర్వహించారు. 2004లో గుంటూరు జిల్లా ఏర్పడి వందేళ్లు అయిన సందర్భంగా జిల్లా చరిత్రపై రెండు పుస్తకాలను ప్రచురించారు. ఆయన భౌతికకాయానికి అనేక మంది నివాళులర్పించారు.

సీపీఐ నాయకుల నివాళి

నరసింహారావు భౌతికకాయాన్ని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్, నగర కార్యదర్శి కోట మాల్యాద్రి సందర్శించి ఘనంగా నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు. గుంటూరులో ప్రజా ఉద్యమాలు, ప్రజాసంఘాలకు పెద్దదిక్కుగా ఉన్న ఆయన తన చివరి శ్వాస వరకు ఉద్యమమే ఊపిరిగా బతికారని గుర్తు చేసుకున్నారు. కమ్యూనిస్టు విలువలు, భావజాలంతో జీవిస్తున్నట్లు ఎంతో ఆత్మవిశ్వాసంతో చెబుతుండేవారని అన్నారు. నివాళులర్పించిన వారిలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేడా హనుమంతరావు, సీపీఐ జిల్లా కార్యాలయ కార్యదర్శి వి.రమణ తదితరులు ఉన్నారు.

11 నగర వనాలకు రూ.15 కోట్లు

కేంద్రం మంజూరు: పవన్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో 11 నగర వనాల అభివృద్ధికి రూ.15కోట్లను కేంద్ర పర్యావరణం, అటవీ, వాతావరణ మార్పు మంత్రిత్వశాఖ మంజూరు చేసింది. ఈ మేరకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ శనివారం ప్రకటించారు. చిత్తూరు, కడప, కాసిబుగ్గ (శ్రీకాకుళం), గర్గేయపురం (కర్నూలు), వెలగాడ (నెల్లిమర్ల), కలిగిరి (చిత్తూరు), కైలాశగిరి (శ్రీకాళహస్తి), ప్రకాశరావు పాలెం (తాడిపల్లిగూడెం), శ్రీ కృష్ణదేవరాయ కోట (పెనుకొండ), బత్రేపల్లి (కదిరి), విశాఖపట్నంలో తూర్పు కనుమనుల జీవవైవిధ్య కేంద్రంలో నగర వనాలాభివృద్ధి జరగనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం 50 నగర వనాల పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. అవసరమైతే మరిన్ని నిధులు ఇచ్చేందుకు కేంద్రం సానుకూలంగా ఉందని పవన్ వెల్లడించారు. వచ్చే 100 రోజుల్లో 30 నగర వనాలు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం అధ్వర్యంలో ఈనెల 30న వన మహోత్సవాన్ని జయప్రదం చేయాలని, యువత పెద్ద సంఖ్యలో భాగస్వాములు కావాలని కోరారు. ప్రతి గ్రామం, పట్టణం, నగరంలో మొక్కలు నాటాలన్నారు. ప్రభుత్వ శాఖలతోపాటు అన్ని విద్యా సంస్థలు, విశ్వవిద్యాలయాలు, పరిశ్రమలు, పేపర్ మిల్లులు, ఆధ్యాత్మిక సంస్థలు వన మహోత్సవంలో పాల్గొనాలని, అందుకు అధికారులు తగు చర్యలు తీసుకోవాలని పవన్ కల్యాణ్ ఆదేశాలిచ్చారు.

ఫార్మా బాధితులకు అండగా ఉంటాం

మండలి విపక్ష నేత బొత్స

విశాలాంధ్ర-విశాఖపట్నం: అనకాపల్లి జిల్లాలో ఫార్మా కంపెనీలో పేలుడు ఘటన బాధితులకు తమ పార్టీ వైసీపీ అండగా ఉంటుందని శాసన మండలిలో విపక్ష నేత బొత్స సత్యనారాయణ స్పష్టం చేశారు. శనివారం ఆయన విశాఖలో మీడియాతో మాట్లాడుతూ మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున, గాయపడిన ప్రతి ఒక్కరికి లక్ష చొప్పున సహాయం ప్రకటించారు. ఎక్కడికక్కడ తమ పార్టీ నాయకులు దాన్ని అందజేస్తారని తెలిపారు. పేలుడు ఘటన తర్వాత సహాయ చర్యల్లో ప్రభుత్వ వైఫల్యం చెందిందని, మంత్రులు, అధికారులు సక్రమంగా స్పందించలేదని, పరిశ్రమల్లో రక్షణ చర్యల్లోనూ అంతులేని నిర్లక్ష్యం కనిపిస్తోందని అన్నారు. అదేపనిగా గత మా ప్రభుత్వంపై విమర్శల చేయడం సరికాదన్నారు. ఎక్కడైనా ఇలాంటి దుర్ఘటన జరిగినప్పుడు అక్కడికి వచ్చే ప్రభుత్వ పెద్దలు, వెంటనే ఏమేం చేశారు?, బాధితులను ఎలా ఆదుకున్నారు?, భవిష్యత్‌లో మళ్లీ జరగకుండా ఏ జాగ్రత్తలు తీసుకుంటారో చెబుతారని బొత్స గుర్తు చేశారు. ఇదే విశాఖలో ఎల్జీ పాలిమర్స్‌లో గ్యాస్ లీకేజీ ప్రమాదం జరిగితే, తామెంత వేగంగా స్పందించామన్నదీ వివరించారు. ఎచ్చెర్లలో తమ పార్టీ కార్యకర్త ప్రసాద్‌పై అధికార పక్షం వారు దాడి చేయగా, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మరణించాడని బొత్స సత్యనారాయణ తెలిపారు. ఈ దాడితో ప్రమేయం ఉన్న వారందరిపై హత్య కేసు నమోదు చేసి, చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

బదిలీల నుంచి మినహాయింపు

చంద్రబాబుకు ఏపీ జేఏసీ అమరావతి నేతల కృతజ్ఞతలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏపీ జేఏసీ అమరావతి నేతల విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం ఉద్యోగుల సాధారణ బదిలీల నుండి ఏడాది లోపు పదవీ విరమణ అయ్యే ఉద్యోగులకు మినహాయింపు ఇచ్చింది. ఈ మేరకు శనివారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 2025 మార్చిలోపు పదవీ విరమణ అయ్యే ఉద్యోగులకు ప్రస్తుత సాధారణ బదిలీల నుండి మినహాయింపు ఇస్తూ ఉత్తర్వులు జారీ చేయడంపై ఏపీ జేఏసీ అమరావతి హర్షం వ్యక్తం చేసింది. సంఘ నేతలు బొప్పరాజు, పలిశెట్టి ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. అలానే ఈ ఉత్తర్వులు వెలువడటంలో విశేష కృషి చేసిన సీఎం ప్రిన్సిపల్ కార్యదర్శి ముద్దాడ రవిచంద్ర, ప్రిన్సిపల్ ఫైనాన్స్ సెక్రటరీ పీయూశ్ కుమార్‌కు జేఏసీ అమరావతి పక్షాన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

రాష్ట్ర సమగ్రాభివృద్ధికి సత్వర చర్యలు

సీఎంకు మాజీ మంత్రి వడ్డే విజ్ఞప్తి

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్): రాష్ట్రంలో సమగ్ర, సత్వర అభివృద్ధే లక్ష్యంగా ప్రజలు కూటమి ప్రభుత్వానికి అధికారం కట్టబెట్టారని, దానిని సద్వినియోగించుకుని అన్ని ప్రాంతాలు సమగ్రంగా అభివృద్ధి చెందేలా కృషి చేయాలని మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఆయన రాసిన లేఖను శనివారం విజయవాడ ప్రెస్ క్లబ్‌లో విడుదల చేశారు. వడ్డే మాట్లాడుతూ రాష్ట్ర విభజనతో అనేక రకాలుగా నష్టపోయామని, ఆ సమయంలో చట్టంలో ఇచ్చిన హామీలు... ప్రత్యేక హోదా, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు, మేజర్ పోర్టు, కడప ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు వంటి అంశాలను కేంద్రం అమలు చేయలేదన్నారు. గత వైసీపీ ప్రభుత్వ అరాచక పాలనలో అన్ని రంగాలు తీవ్రంగా నష్టపోయాయని, వ్యవస్థలను నిర్వీర్యం చేయటం వలన రాష్ట్ర మరింత అప్పుల ఊబిలో కూరుకుపోయిందని తెలిపారు. రాష్ట్రం గాడిలో పడి అభివృద్ధి చెందాలంటే ప్రస్తుత చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం పోలవరం, అమరావతే కాకుండా ఇతర ప్రాంతాలలో ఉన్న సమస్యలను గుర్తించి పరిష్కరించటంతో పాటు ఇరిగేషన్ డ్యామ్‌ల నిర్వహణ, గేట్ల మరమ్మతులు, రైతాంగానికి అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ఇప్పటికే లక్షలాది ఎకరాలకు నీటి వసతి లేదని, సెజ్‌ల పేరిట వేల ఎకరాలను ప్రభుత్వం తీసుకుంటుందని అన్నారు. ముందుగా అమరావతిలో రైతులకు ఇచ్చిన ప్లాట్ల లేఅవుట్లకు రోడ్లు, డ్రెయినేజీలు, విద్యుత్ సౌకర్యం కల్పించాలన్నారు. విజయవాడ పడమర బైపాస్ నిర్మాణం పూర్తికావచ్చిందని, తూర్పు బైపాస్ నిర్మాణం పేరుతో మరలా 1,250 ఎకరాలు సేకరించాలనే యోచన మంచిది కాదన్నారు. ప్రధాని మోదీ రాష్ట్రానికి 15 వేల కోట్లు అప్పుగా కాకుండా గ్రాంట్‌గా ఇవ్వాలన్నారు. మంగళగిరిలో ఉన్న ఎయిమ్స్‌ను అభివృద్ధి చేయాలని, దానికి కావలసి మరింత స్థలం, తాగునీటి సౌకరం కల్పించాలన్నారు. అనేక ప్రాంతాలకు తాగు, సాగునీరు ఇప్పటికీ అందటం లేదని, ఉత్తరాంధ్రలో వంశధార, నాగవల్లి, మహేంద్ర వంటి నదుల మీద చెక్ డ్యామ్‌లు నిర్మిస్తే తాగు, సాగునీరు ప్రజలకు అందుతుందని ఆయన తెలిపారు. వ్యవసాయ ఉత్పత్తులకు కనీస మద్దతు ధర కల్పించి రైతులకు అధిక ఆదాయం లభించేలా, వ్యవసాయ కూలీలకు ఎక్కువ పని దినాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని, రైతులకు సమగ్ర రుణమాఫీ చేయాలని, స్మార్ట్ మీటర్లు పెట్టే విధానానికి స్వస్తి పలకాలని, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను నిలిపివేసి గనులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కేజి బేసిన్‌లో సగం వాటాను మన సాధించుకుంటే రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి దోహదపడుతుందన్నారు. ఇటువంటి అనేక విషయాలను ఈ లేఖలో పొందుపరిచామని, పరిశీలించి అమలుకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు కూలి సంఘం (సీపీఐ ఎంఎల్) రాష్ట్ర అధ్యక్షురాలు సింహాద్రి ఝాన్సీ, రైతు సేవా సంస్థ అధ్యక్షులు అక్కినేని భవాని ప్రసాద్, ఓపీడీఆర్ జాతీయ అధ్యక్షులు చిగురుపాటి భాస్కరరావు, మాజీ ఐఏఎస్ అధికారి బండ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచం ఎదురుచూస్తోంది

'విజ్ఞాన్' స్నాతకోత్సవంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పమిడిఘంటం

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్: ప్రపంచం విభిన్న నైపుణ్యాలు కలిగిన విద్యార్థుల కోసం ఎదురుచూస్తోందని సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ పమిడిఘంటం శ్రీనరసింహ అన్నారు. గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీ 12వ స్నాతకోత్సవం శనివారం వర్సిటీ ప్రాంగణంలో అంగరంగ వైభవంగా జరిగింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన పమిడిఘంటం మాట్లాడుతూ వాస్తవ ప్రపంచం కొత్త సవాళ్లను అందిస్తుందని, అవి మీ విద్యాసామర్థ్యాన్ని పరీక్షించే క్షణాలుగా మిగులుతాయన్నారు. ఉత్సుకతను అన్వేషించండి... ఈ అన్వేషణకు భారతదేశం కంటే మెరుగైన ప్రదేశం మరొకటి లేదని పేర్కొన్నారు. ఎప్పటికప్పుడు మార్పును స్వాగతించాలన్నారు.

లోకేశ్ మెషీన్స్ (హైదరాబాద్) ఫౌండర్ ముళ్లపూడి లోకేశ్వరరావు మాట్లాడుతూ మేథోపరమైన, విద్యాపరమైన అన్వేషణ... వృత్తిపరమైన విజయాలను కుటుంబం, స్నేహితులు, శ్రేయోభిలాషులతో జరుపుకోవడానికి ఇది ఒక చిరస్మరణీయ వేదికని అన్నారు. విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య మాట్లాడుతూ భవిష్యత్ తరాలకు మన మార్గం ప్రతిబింబించేలా ఉండాలన్నారు. ఏఐ(ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) అద్భుతమైన అవకాశాలను సృష్టించడంతో పాటు సవాళ్లను కూడా తీసుకువస్తుందన్నారు. వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ పట్టభద్రులవుతున్న మీరంతా ప్రపంచంపై మీ ముద్ర వేయడానికి ప్రయత్నించాలని పిలుపునిచ్చారు. కలలను సాకారం చేసుకునేందుకు అవిశ్రాంతంగా కృషి చేయాలని కోరారు.

అంబరాన్నింటిన సంబరం

స్నాతకోత్సవం అంబరాన్ని అంటింది. కేరింతలతో వర్సిటీ ప్రాంగణమంతా హోరెత్తిపోయింది. నాలుగేళ్ల తమ అనుభవాలను విద్యార్థులు ఒకరికొకరు పంచుకున్నారు. తరగతి గదుల్లో గడిపిన క్షణాలను నెమరువేసుకున్నారు. విశ్వవిద్యాలయంతో తాము పెంచుకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. గుర్తుగా సెల్ఫీలు దిగారు. దేశాభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని ప్రతిన బూనారు. విద్యార్థులంతా తలపాగా, కండువా వేసుకుని అచ్చతెలుగు పెద్ద మనుషుల్లా కనిపించారు. సంస్కృతీ సంప్రదాయాలు ప్రతిబింబిస్తూనే సాంకేతిక విద్యా సర్టిఫికెట్లను పొందారు.

ముగ్గురికి గౌరవ డాక్టరేట్‌లు

హైదరాబాద్‌లో ఎస్ఈసీ ఇండస్ట్రీస్ ఫౌండర్ అండ్ చైర్మన్ దొంతినేని శేషగిరిరావు, లోకేశ్ మెషీన్స్ ఫౌండర్ ముళ్లపూడి లోకేశ్వరరావు, ఇండియన్ కంపోజర్ అండ్ సింగర్ సాలూరి కోటేశ్వరరావు(కోటి)లకు విజ్ఞాన్ వర్సిటీ గౌరవ డాక్టరేట్‌లు ప్రదానం చేశారు. 1,539 మంది విద్యార్థులకు డిగ్రీలు, 60 మందికి బంగారు పతకాలు అందజేశారు. వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ పి.నాగభూషణ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎం.ఎస్. రఘునాథన్ పాల్గొన్నారు.

భూ బాధితులకు న్యాయమే లక్ష్యం

28న విజయవాడలో రాష్ట్ర సదస్సు జయప్రదానికి దేగా ప్రభాకర్ పిలుపు

విశాలాంధ్ర-ఏలూరు: భూ బాధితుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 28న విజయవాడలో నిర్వహించే భూ బాధితుల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు దేగా ప్రభాకర్ పిలుపునిచ్చారు. బాధితులందరూ తమ వ్యక్తిగత అర్జీలతో పాల్గొనాలని కోరారు. రాష్ట్ర సదస్సు వాల్‌పోస్టర్లను ఆయన శనివారం సీపీఐ ఏలూరు జిల్లా కార్యాలయం 'స్ఫూర్తిభవనం'లో ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ ఏలూరు జిల్లాలో ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న పోలవరం నియోజకవర్గంలో కుక్కునూరు, వేలేరుపాడు, బుట్టాయిగూడెం మండలాలలో పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూములలో ఉంటున్న పేదలకు హక్కుపత్రాలు ఇవ్వాలన్నారు. పేదలకు దక్కిన, దక్కాల్సిన భూములను బడా నాయకులు ఆక్రమించుకున్నారని దేగా ప్రభాకర్ ఆరోపించారు. సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి కృష్ణ చైతన్య మాట్లాడుతూ పోలవరం, నూజివీడు, చింతలపూడి నియోజక వర్గాలలో పోరాటాల ద్వారా సాధించుకున్న భూములకు పట్టాలు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. వనసంరక్షణ సమితి సభ్యులందరికీ హక్కుపత్రాలు ఇవ్వాలన్నారు. భూ పోరాటాలలో పాల్గొన్న కమ్యూనిస్టులపై కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం ఏలూరు జిల్లా అధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గత పాలకులు లక్షల ఎకరాలు అన్యాక్రాంతం చేసుకున్నారని, వాటిని తిరిగి స్వాధీనం చేసుకుని అర్హులైన పేదలకు ఇవ్వాలని ప్రస్తుత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కన్నబాబు, హేమశంకర్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాస్ డాంగే, చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కన్నయ్య, కనకదుర్గారావు, జగన్, శ్రీను పాల్గొన్నారు.

వైద్య ఒప్పంద కార్మికులపై వేధింపులు

వేతన బకాయిలు చెల్లించాలి: వెంకట సుబ్బయ్య

విశాలాంధ్ర-విజయవాడ: ఆంధ్రప్రదేశ్‌లో వైద్య విభాగంలో పనిచేస్తున్న ఒప్పంద కార్మికులకు వేతన బకాయిలు చెల్లించాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపప్రధాన కార్యదర్శి ఎస్.వెంకట సుబ్బయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళగిరిలోని టీడీపీ కార్యాలయంలో శనివారం జరిగిన ప్రజా దర్బారుకు వైద్య విభాగ ఒప్పంద కార్మికుల సంఘం అధ్వర్యంలో కార్మికులతో కలిసి వెంకటసుబ్బయ్య, సంఘం ప్రధాన కార్యదర్శి పూలేటి ప్రకాశ్ గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావుకు విజ్ఞాపనపత్రం సమర్పించారు. కార్మికుల సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 12 వేల మంది కార్మికులు వైద్య కళాశాలలు, ఆసుపత్రులలో పారిశుద్ధ్యం, భద్రతకు సంబంధించి ఒప్పంద కార్మికుల పద్ధతిలో నిరంతరం పనులు చేస్తున్నారని తెలిపారు. వీరికి గుత్తేదారులు సకాలంలో జీతాలు ఇవ్వక కొన్ని జిల్లాలలో మూడు నెలల నుంచి... కొన్ని జిల్లాలలో ఆరు నెలల నుంచి జీతాలు ఇవ్వడం లేదన్నారు. వేతనాలు ఎప్పుడు ఇస్తారని అడిగితే... బిల్లులు రాలేదని, అందుకే ఇవ్వలేదని సాకులు చెబుతున్నారని పేర్కొన్నారు. దుర్భర పరిస్థితుల్లో వైద్య విభాగ ఒప్పంద కార్మికులు ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై తక్షణం రాష్ట్ర ప్రభుత్వం స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. పూదోట ప్రకాశ్ మాట్లాడుతూ వైద్య ఒప్పంద కార్మికులకు సంబంధించి గుత్తేదారు వ్యవస్థను రద్దు చేయాలని, పురపాలక కార్మికుల తరహాలో ఆప్కాస్‌లో కలపాలని విజ్ఞప్తి చేశారు. కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని, యూనిఫామ్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం మారిన తరుణంలో కొన్నిచోట్ల ఒప్పంద కార్మికులపై రాజకీయ వేధింపులు పెరిగాయని తెలిపారు. శివ, రేష్మ, వన్నూరు, సుశీలమ్మ, తులసమ్మ, నారాయణమ్మ, రేచల్, హనుమంతప్ప తదితరులు పాల్గొన్నారు.

సంపాదకీయం

మోదీ శుష్క శాంతి మంత్రాలు

ఆర్థిక, సైనిక ప్రయోజనాలు లేకుండా ఏ యుద్ధమూ జరగదు అన్నది వాస్తవం. దాదాపు రెండేళ్లుగా కొనసాగుతున్న రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలోనూ ఇవే ప్రధానాంశాలు. వీటిని పట్టించుకోకుండా ఆరు వారాల కిందట రష్యా అధినేత పుతిన్ తో, శుక్రవారం ఉక్రెయిన్ అధిపతి జెలిన్ స్కీతో చర్చలు జరిపినప్పుడు ప్రధానమంత్రి మోదీ వల్లించే శాంతి వచనాలవల్ల ప్రయోజనం ఏమీ ఉండదు. పైగా ఉక్రేయిన్ లో తొమ్మిది గంటలపాటు ఉన్న మోదీ ఇటీవల రష్యా అధినేతతో ఇవే మాటలు చెప్పిన దాఖలాలు లేవు. "ఈ యుద్ధంలో మేం తటస్థంగా లేం, శాంతి కావాలంటున్నాం" అన్న మోదీ ప్రకటనలో డొల్లతనమే ఎక్కువ. యుద్ధం చేసేవారు కూడా నిజానికి యుద్ధం కోరుకోరు. ఎందుకంటే యుద్ధంలో విజేతలు, పరాజితులు ఉన్నారని అనుకోవచ్చు. కాని అది కేవలం భ్రమే. ఆర్థికంగా, సైనికంగా రెండు పక్షాలూ అపారంగా నష్టపోతాయి. కానీ ఈ రెండు ప్రయోజనాలు సాధించడానికే యుద్ధాలకు దిగవలసి వస్తుంది. రష్యా-ఉక్రెయిన్ మధ్య యుద్ధం ఎందుకు వచ్చిందో మోదీ ఆలోచించినట్టు లేదు. ఉక్రెయిన్ నాటో కూటమిలో చేరాలనుకుంది. ఈ వాస్తవాన్ని మోదీ వాటంగా విస్మరిస్తున్నారు. "ఇండియా చాలా గొప్ప దేశమే కాక పెద్ద దేశం. పలుకుబడి ఉన్న దేశం కూడా" అని జెలిన్ స్కీ ముఖస్తుతి మాటలు చెప్పి ఉండొచ్చు. భారత్ లో పర్యటించాలని మోదీ ఆహ్వానిస్తే జెలిన్ స్కీ ఎగిరి గంతేశారు. ఆ పర్యటన ఎంత త్వరగా సాధ్యమైతే అంత మంచిది అన్నారు. కానీ తమ దేశంలో పరిస్థితి చక్కబడాలి కదా అనడం ద్వారా ఇప్పట్లో జెలిన్ స్కీ భారత పర్యటన సాధ్యమయ్యేది కాదని తేలిపోతోంది. మోదీ-జెలిన్ స్కీ సంభాషణల తరవాత సంయుక్త ప్రకటన విడుదల చేసిన మాట వాస్తవమే కానీ అందులో మహత్తరమైన అంశాలు ఏమీ లేవు. ఉక్రేయిన్ వెళ్లక ముందు మోదీ అనేక మాటలు చెప్పారు. చర్చలు ముగిసిన తరవాత అతిశయోక్తులు గుమ్మరించారు. సంప్రదింపుల ద్వారా రెండు దేశాలు సమస్యలు పరిష్కరించుకోవాలని చెప్పడం రొడ్డకొట్టుడు హితోక్తికే పరిమితం. ఉక్రేయిన్ మీద దాడి మొదలు పెట్టినప్పుడు, ఉక్రెయిన్ లోని కొంత భూభాగాన్ని ఆక్రమించడానికి ప్రయత్నించినప్పుడు రష్యాకు ఉన్న కారణాలు రష్యాకు ఉన్నాయి. వాటిని నిరాకరించడం కుదరదు. మోదీ రష్యాను ఖండించగలరని ఆశించలేం. గత రెండేళ్లుగా ఆ పని చేయనూలేదు. ఉక్రెయిన్ లో మోదీ శాంతి వచనాలు పలకడంతోపాటు జెలిన్ స్కీని కౌగలిచుకోవడం లాంటివి మామూలు దౌత్య విధానాల్లో భాగమే. యుద్ధంలో అమరణించిన బాలల స్మారక చిహ్నం వద్ద మౌనం పాటించడం కూడా అంతే. మోదీ ఉక్రెయిన్ పర్యటనను పశ్చిమ దేశాలు హర్షించవచ్చు. 1991లో ఉక్రెయిన్ స్వతంత్రదేశంగా అవతరించిన తరవాత ఆ దేశంలో పర్యటించిన మొదటి భారత ప్రధాని మోదీయే కావడం కూడా దస్తావేజుల్లో చేర్చడానికి మాత్రమే ఉపకరించే వివరం. మోదీ పోలెండ్ పర్యటనకన్నా ఉక్రెయిన్ పర్యటనకే పశ్చిమదేశాల మీడియా ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చినట్టు కనిపిస్తోంది. కానీ రష్యాతో భారత్‌కు ఉన్న వాణిజ్య సంబంధాలను అంతర్జాతీయ మీడియా ఈ సందర్భంగా గుర్తు చేయకపోలేదు. రష్యాతో మనకున్న సంబంధాలు సుదీర్ఘమైనవే కాక కాలపరీక్షకు నిలిచినవి. మనం రష్యా నుంచి తక్కువ ధరకు ముడి చమురు దిగుమతి చేసుకుంటున్నాం. అందులో కొత్త భాగం లోపాయికారీగా యూరప్ దేశాలకు తరలిస్తున్నాం. ఈ రహస్యం ఎవరికీ తెలియందీ కాదు. మన జాతీయ పోరాటాన్ని సమర్థించడం దగ్గర నుంచి పాకిస్తాన్ అప్పటి తూర్పు పాకిస్తాన్ మీద దాష్టీకం కొనసాగించినప్పుడూ రష్యా మనకు అండగా నిలబడింది. మనం బంగ్లాదేశ్ స్వాతంత్ర్య పోరాటానికి మద్దతు ఇచ్చినప్పుడు సప్తమ నౌకాదళాన్ని పంపిస్తాం అని అమెరికా బెదిరించినప్పుడు మనకు అండగా నిలిచింది రష్యానే. రష్యాతో చర్చలు జరపడానికి ఉక్రెయిన్ ఒక శాంతి ఒప్పందం ప్రతిపాదన చేసినప్పుడు మనం ఆ సన్నాహాలకు ఒక ప్రతినిధిని పంపాం. కానీ ఆ సదస్సులో పాల్గొనలేదు. దీనికి కారణం ఏమిటో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. రష్యాతో ఉన్న సంబంధాలను మనం అమాంతం తుంచేసుకోవడం కుదరని పని. మోదీ ఉక్రెయిన్ అధినేతతో చర్చలు జరిపినప్పుడు యుద్ధ కారణాన్ని చర్చించిన జాడలూ లేవు.

నాటో కూటమిలో చేరాలన్న ఉక్రెయిన్ ఆలోచననూ మోదీ ప్రస్తావించినట్టు లేదు. ఉక్రెయిన్ నాటో కూటమిలో చేరడాన్ని రష్యా సమర్థించక పోవడానికి కారణం ఉంది. తమ దేశం చుట్టూ నాటొ బలగాలను అమెరికా మోహరిస్తూ ఉంటే రష్యా చూస్తూ కూర్చుంటుందనుకోలేం. రెండవ ప్రపంచ యుద్ధంలో రెండు కోట్లమందిని పోగొట్టుకున్న త్యాగమయ కీర్తి రష్యాకు ఉంది. యుద్ధం అంటే ఏమిటో రష్యాకు ఎవరూ సుద్దులు పలకాల్సిన పనిలేదు. అమెరికా ఎప్పుడూ వివిధ దేశాల మధ్య తంపులు పెట్టి ఆయుధ వ్యాపారమే చేస్తూ ఉంటుంది. ప్రపంచంలో శాంతి నెలకొంటే అమెరికా ఆయుధ కర్మాగారాలు, ప్రధానంగా ప్రైవేటు రంగంలోని ఆయుధ పరిశ్రమలు మూత పడాల్సిందే. ఆర్థికంగా అంత నష్ట పోవడానికి అమెరికా ఎటూ ఇష్టపడదు. కానీ ఉక్రెయిన్ నాటో బలగాలను అనుమతించినా, లేదా నాటో కూటమిలో చేరినా రష్యా భరిస్తుందనుకోవడం కల్ల. తాను గౌతమ బుద్ధుడు, మహాత్మా గాంధీ దేశం నుంచి వచ్చాను కాబట్టే శాంతి నెలకొనాలని ఆకాంక్షిస్తున్నాం అన్న మోదీ మాటలు వినసొంపుగానే ఉండొచ్చు. శాంతి వచనాలు ఎవరికైనా బాగానే ఉంటాయి. చైనా కన్నా మనం రష్యా నుంచి ఎక్కువ చమురు దిగుమతి చేసుకుంటున్నాం అన్న వాస్తవాన్ని మోదీ నిరాకరించలేరుగా! పశ్చిమ దేశాలు రష్యా మీద ఆంక్షలు విధించినప్పుడు మన చమురు దిగుమతులే రష్యా ఆర్థిక వ్యవస్థకు ఉపయోగంగా ఉన్నాయి. తూర్పు యూరప్‌లో నాటో బలగాలు మోహరించారు. నాటో బలగాలు చైనా చుట్టూ కూడా మోహరిస్తున్నారు. చైనా మన భూభాగాన్ని వందల మైళ్ల దూరం ఆక్రమిస్తుంటే మోదీ కిమ్మనకుండా కూర్చోవడాన్ని శాంతి ప్రియత్వం అనుకోలేం. పైగా అలాంటి ఆక్రమణ ఏమీ లేదని మోదీ బుకాయిస్తారు. విదేశాంగ మంత్రి జై శంకర్ మాత్రం "అమ్మో చైనా బలమైన దేశం" అని వాపోతారు. ఈ రెండు ప్రకటనలూ పరస్పర విరుద్ధమైనవని ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. మోదీ మాటలు ఆయన నిత్య అసత్య దండకంలో భాగమే. బంగ్లాదేశ్ లో కూడా నాటో బలగలాను మోహరించే ప్రయత్నం సాగుతుండడం "దేశ భక్తుడైన" మోదీ కంటికి కనిపించదెందుకో! మోదీ శాంతిమంత్రాలతో నిమిత్తం లేకుండా విదేశాంగమంత్రి జై శంకర్ రష్యా-ఉక్రెయిన్ సమస్య సంక్లిష్టమైందనీ ఏ శాంతి యత్నాల్లోనైనా రష్యా పాత్ర ఉండాల్సిందేనని అన్నారు. ఈ ఇద్దరి ధోరణిలో వ్యత్యాసాన్ని గమనించలేని వారు ఎవరూ ఉండరు.

నగరాల్లో తగ్గిన శ్రామిక మహిళలు

హరిహర స్వరూప్

ఈ ఏడాది బడ్జెట్‌లో సుమారు 3 కోట్ల అధికారిక ఉద్యోగాలను సృష్టించే లక్ష్యంతో ఉన్నట్లు బీజేపీ ప్రభుత్వం ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికానికి సంబంధించిన పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే (పిఎల్ఎఫ్) ప్రకారం, దేశంలోని పట్టణప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు గణనీయంగా తగ్గినట్లు పేర్కొంది. ముఖ్యంగా ఉపాధిరంగంలో మహిళలు పురుషుల కంటే ఎక్కువగా నష్టపోతున్నట్లు తెలిపింది. శ్రామికరంగంలో ఉపాధి అవకాశాలు ఈ ఏడాది జనవరి-మార్చి మధ్యకాలంలో 39.5 శాతం నుండి 39.3 శాతానికి తగ్గాయి. స్త్రీలకు శ్రామికరంగంలో అవకా శాలు 20.3 నుండి 20శాతానికి తగ్గాయి. పురుషుల్లో 58 శాతం ఉంది. 15 సంవత్సరాలు, అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్న కార్మికుల సంఖ్య 50.2 - 50.1 శాతంకాగా, ఈ వయస్సులోని మహిళా కార్మికుల సంఖ్య 25.6 శాతం నుండి 25.2 శాతానికి తగ్గింది. పురుషుల సంఖ్య 74.4 శాతం నుండి 74.7 శాతానికి పెరిగింది. 15-29 సంవత్సరాల వయస్సు మహిళా కార్మికుల సంఖ్య కేవలం 21.3 శాతం వద్ద నిలిచింది. శ్రామిక రంగంలో పురుషుల సంఖ్య 58.2 నుండి 58.9 శాతానికి పెరిగింది. కార్మికుల జనాభా నిష్పతి ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో పట్టణ ప్రాంతాల్లో 36.9 శాతం నుండి 36.7 శాతానికి తగ్గింది. ఈ ఏడాది జనవరి-మార్చిలో 18.6 శాతంగా ఉన్న స్త్రీలకు శ్రామిక రంగంలో ఉపాధి అవకాశాలు గణనీయంగా తగ్గాయి. మహిళల్లో ఉపాధి అవకాశాలు అన్ని వయసులవారిలో క్షీణించింది. క్యాజువల్ లేబర్‌లో 10.8 శాతం నుంచి 11 శాతానికి పెరిగింది. దేశంలోని పట్టణ ప్రాంతాల్లో వేతనాలు కేవలం 49శాతం కాగా అంతకు ముందు త్రైమాసికంలో 48 శాతం నమోదయ్యాయి. మహిళలకు రెగ్యులర్ వేతనాలు

52.3 శాతం నుండి 54 శాతానికి పెరిగినప్పటికీ, వారి ఉపాధి శాతం మాత్రం 27.5 శాతం వద్ద నిలిచింది. గృహోపకరణాలలో పురుషుల కంటే మహిళలు నాలుగు రెట్లు ఎక్కువగా ఉన్నారు. దేశంలోని పట్టణ ప్రాంతాల్లో మహిళా కార్మికుల శాతం 11.4 శాతంకాగా గత త్రైమాసికంలో 62.2 శాతం నుండి 62.4 శాతంగా ఉన్నారు. మొదటి త్రైమాసికంలో 5.9 శాతం పట్టణ కార్మికులు వ్యవసాయరంగంలో ఉండగా, 32.1శాతం మంది మైనింగ్, క్వారీలలో ద్వితీయ రంగంలో ఉన్నారు. ఈ ఏడాది ఏప్రిల్-జూన్ లో పట్టణాల్లో నిరుద్యోగిత 6.6 శాతంగా ఉంది. ఇది గత ఏడాది అక్టోబర్-డిసెంబర్ నుంచి ఇప్పటికీ 6.5 శాతానికి పైగా ఉంది. మహిళా నిరుద్యో గిత రేటు మునుపటి త్రైమాసికంలో 8.4 శాతం నుండి 8.9 శాతానికి పెరిగింది. మొదటి త్రైమాసికంలో 15-29 ఏళ్లలోపు మహిళల్లో నిరుద్యోగం 23 శాతంకాగా, పురుషుల్లో 14.8 శాతంగా ఉంది. మొత్తం పట్టణ నిరుద్యోగిత 16.8 శాతంగా ఉంది. 15 ఏళ్లు పైబడిన పట్టణ జనాభాలో నిరుద్యోగిత మొదటి త్రైమాసికంలో 6.6 శాతంకాగా, పురుషు లలో 5.8 శాతం, స్త్రీలలో 9 శాతంగా ఉంది. 3 కోట్ల కొత్త ఉద్యోగాల కల్పన కోసం 2024-25 బడ్జెట్‌లో చేసిన వాగ్దానాలను నెరవేర్చాలంటే ప్రభుత్వం ముఖ్యంగా ఉత్పాదకత రంగంవైపు దృష్టిసారించ వలసిఉంది. అదనపు ఉద్యోగాల కల్పనకును కార్మిక సంస్కరణలను అమలు చేయాలి. ఉద్యోగ కల్పనలో వైఫల్యానికి సంబంధించి రాష్ట్రాలపై నిందలు వేయడం కేంద్ర ప్రభుత్వ వ్యూహంలో భాగంకారాదు.

పొంచి ఉన్న ఉద్యోగ సంక్షోభం : కొన్ని వారాల క్రితం, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా భారత ఆర్థిక వ్యవస్థపై ఒక కథనాన్ని ప్రచురించింది. గత కొన్ని సంవత్సరాలలో భారతదేశంలో ఎనిమిది కోట్ల ఉద్యోగాలు కల్పన జరిగిందని, దేశంలో ఉద్యోగ సంక్షోభం లేదని పేర్కొంది. ఈ వ్యాఖ్యలకు సంబంధించి ఎలాంటి ఉద్యోగాలు కల్పించారు, ఎక్కడెక్కడ ఉద్యోగాలు కల్పించారు? లబ్ధిదారులు ఎవరు.. వంటి ప్రశ్నలను మాత్రం ఎవరూ ఆర్‌బీఐని అడగలేదు. ఇటువంటి విచిత్రమైన వాదనలు చేయడానికి ఆవిర్భ వించిన నీతిఆయోగ్ దీనిపై ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదు. అయితే ఈ వ్యాఖ్యలు ప్రస్తుత పరిస్థితికి పూర్తి భిన్నంగా ఉన్నాయనేది మాత్రం వాస్తం. ఉత్తరప్రదేశ్ పోలీసుశాఖ రాష్ట్ర పోలీసు నియామకాలకోసం 60,244 మందిని, ముఖ్యంగా కానిస్టేబుళ్లను నియామకాలకోసం పరీక్షను నిర్వహిం చింది. ఈ పరీక్షకు 16,00,000 మంది మహిళలతో సహా 48,00,000 మందికి పైగా వ్యక్తులు పరీక్ష రాశారు (కొన్ని రోజుల తర్వాత పరీక్ష రద్దు చేశారు. ఎయిర్ ఇండియాలో వివిధ రిపేర్లు, నిర్వహణకు సంబంధించిన 2,216 ఖాళీలను భర్తీ చేయడానికి పిలుపునిచ్చారు. వాక్-ఇన్ ఇంట ర్వ్యూల కోసం ముంబై విమానాశ్రయానికి దాదాపు 25,000 మంది వ్యక్తులు తరలివచ్చారు, వీరి తొక్కిసలాటలు నియంత్రించేందుకు గాను పోలీసులు చర్యలు చేపట్టవలసిన పరిస్థితి.15 మందికోసం మధ్యప్రదేశ్ తక్కువ నైపుణ్యం కలిగిన ప్రభుత్వ ఉద్యోగాల కోసం ప్రకటన చేసింది. దీనికిగాను 11,000 మంది దరఖాస్తులువచ్చాయి. వీరిలో చాలామంది పోస్ట్ గ్రాడ్యుయేట్లు, ఇంజనీర్లు, న్యాయమూర్తి పదవికి పరీక్ష రాయడానికి సిద్ధమవుతున్న వారు కూడా ఉన్నారు. కేంద్రంలో, అనేక రాష్ట్రాల్లో స్టాఫ్ సెలక్షన్ కమిషన్‌లు ప్రతి సంవత్సరం నిర్వహించే పరీక్ష ద్వారా ఉద్యోగ సంక్షోభాన్ని మనం అంచనా వేయవచ్చు. భారతదేశంలో నిరుద్యోగ సమస్య అతి తీవ్రంగా ఉంది. అయితే తమ పాలనలో ఉపాధి అవకాశాలు గణనీయంగా కల్పించామనేది బీజేపీ వాదన. 2014 లోక్‌సభ ఎన్నికల సందర్భంగా నరేంద్రమోదీ ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. "పకోడీలు వేయించడం కూడా భృతిగా" దేశ ప్రధాని వ్యాఖ్యానించడం హాస్యాస్పదం.

వేధింపులు కొనసాగితే గల్లంతే

హర్యానా అసెంబ్లీకి అక్టోబరు 1న ఎన్నికలు జరగనున్నాయి. రాష్ట్రంలో అసెంబ్లీకి 90 నియోజకవర్గాలున్నాయి. హర్యానాతోపాటు జమ్మూ-కశ్మీరులోనూ అసెంబ్లీకి 90స్థానాలకు సెప్టెంబరులో ఎన్నికలు జరుగుతాయి. ఈ రెండు రాష్ట్రాల్లోనూ బీజేపీది ఎదురీతేనని ఎన్నికల ప్రకటనకు ముందే విశ్లేషకులు అంచనావేశారు. హర్యానాలో ప్రధాన ఆదాయవనరు వ్యవసాయమే. నిరుద్యోగం పెద్ద సమస్య. రెండేళ్ల క్రితం సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో రైతులు చేపట్టిన మహత్తర ఉద్యమం ఏడాదికిపైగా నిర్వహించడంతో నరేంద్రమోదీ ప్రభుత్వం చేసిన మూడు దుష్ట చట్టాలను ఉపసంహరించుకున్నదేగానీ రద్దు చేయలేదు. రైతులు ఉద్యమాన్ని విరమించారు. పంటలకు కనీసమద్దతు ధరకు చట్టబద్ధ హామీ ఇవ్వాలన్న డిమాండ్‌ను ఆలకించి చర్చించి ఇస్తామని రాతపూర్వక హామీ ఇచ్చారుకానీ హామీలు అలాగే ఉన్నాయి. ఇటీవల మళ్లీ హర్యానా సరిహద్దుల్లో రైతులు పోరాటం ప్రారంభించారు. ఆందోళన చేస్తున్న రైతుల డిమాండ్లు నెరవేర్చకుండా వేధిస్తున్నారు. ఇప్పుడు ఎన్నికలు వచ్చాయి. ఎలాగైనా అసెంబ్లీ ఎన్నికల్లో గెలవడానికి రాష్ట్రంలో ప్రస్తుత ముఖ్యమంత్రి సైనీ కనీస మద్దతుధరను కల్పిస్తామని హామీ ఇచ్చారు. అయితే ఇదంతా ఎన్నికల స్టంటని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) అభివర్ణించింది. ఎందుకంటే ప్రధాని మోదీ హామీలేకుండా ఏ బీజేపీ ముఖ్యమంత్రి కీలక విషయాల్లో హామీలు ఇవ్వలేరన్నది వాస్తవం. అందువల్ల ముఖ్యమంత్రి హామీ బూటకమేనని రైతులు కొట్టిపారేశారు. ఎస్‌కెఎంలో సంబంధంలేని మరో చిన్న రైతుల సంఘం పంటలకు కనీస మద్దతుధర నిర్ణయించే సీఏసిపి సంస్థతో చర్చించాలని తలపెట్టింది. చర్చించినట్లుగా సమాచారంలేదు. రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదించిన మద్దతుధరను అంగీకరిస్తే రైతులు నష్టపోతారేగానీ ప్రయోజనం ఉండదని ఎస్‌కెఎం తిరస్కరించింది.

రాష్ట్ర ప్రభుత్వంపట్ల తీవ్ర వ్యతిరేకత రైతులు, ప్రజలలో ఉందని గ్రహించని మోదీ ముఖ్యమంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌ను తప్పించి సైనీని ముఖ్యమంత్రిగా కూర్చోబెట్టారు. ఇది లోక్‌సభ ఎన్నికలకు ముందు జరిగింది. అయినప్పటికీ పది లోక్‌సభసీట్లలో 5 మాత్రమే బీజేపీ గెలుచుకుంది. కాంగ్రెస్ 5 సీట్లు గెలుచుకుని తన బలాన్ని పెంచుకుంది. ఇప్పుడు

కాంగ్రెస్ నాయకుడు హుడా నాయకత్వంలో కాంగ్రెస్ ప్రచారం నిర్వహిస్తోంది. హుడాను ఎదుర్కోవడం సైనీకి కష్టమేనని అంచనా వేస్తున్నారు. కాంగ్రెస్‌లో మూడు గ్రూపులున్నాయని బీజేపీ సంతోషిస్తోంది. రైతులు డిమాండ్లు నెరవేర్చకపోవడం, యువతకు ఉద్యోగాలు లభించకపోవడం, ఆర్థికవ్యవస్థ స్తంభించడం బీజేపీ ప్రభుత్వంపై వ్యతిరేకత పెరగడానికి కారణమవుతున్నాయి. వ్యవసాయంతోపాటు సైన్యంలో చేరడానికి యువకులు గతంలో వలె ఆసక్తి చూపడంలేదు. గౌరవనీయమైన ఉద్యోగాలు కోరుకుంటున్నారు. అగ్నిపథ్ పథకం కింద సైన్యంలో చేరిన యువకులు ఈ ఉద్యోగాలు గ్యారంటీ లేనివని గుర్తించారు. రాష్ట్రంలో ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా నిరుద్యోగం అధికంగా ఉంది. అత్యధిక నిరుద్యోగ రేటు హర్యానాలో ఉందని సీఎంఐఈ అధ్యయనం వెల్లడించింది. అయితే బీజేపీ ప్రభుత్వాలు వాస్తవాలను నమ్మవు. ఎందుకంటే అబద్ధాల ప్రచారమే కేంద్రంలో మోదీ ప్రభుత్వానికి మహా ఇష్టం. పిఎల్ఎఫ్ఎస్ రాష్ట్రంలో కిందనుంచి నాలుగవ స్థానంలో ఉంది. రాష్ట్రాల్లో నాలుగవ గరిష్టస్థాయిలో పంజాబ్, యూపీ, హిమాచల ప్రదేశ్, రాజస్థాన్‌లు నిరుద్యోగ సంక్షోభంలో ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో వలసలు పెరుగుతున్నాయి. 2018-2022 మధ్యకాలంలో ఇతర దేశాలలో చదువులకు 30వేలమంది వెళ్లారు. ఉక్రెయిన్-రష్యాల మధ్య యుద్ధం మొదలైనప్పుడే 2వేల మందికిపైగా హర్యానా విద్యార్థులు అక్కడే చిక్కుబడిపోయిన విషయం తెలిసిందే.

ఇక గుర్‌గావ్, ఫరీదాబాద్‌లు పారిశ్రామికప్రాంతాల్లో పెట్టుబడులుపెట్టేవారి సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. ఈ నేపథ్యంలో ఓటర్ల వద్దకు వెళ్లివారిని నమ్మించడం కష్టమేనని అంచనా. ధనిక రాష్ట్రాల్లో కంటే ఆదాయం హర్యానాలో సగమేనని అంచనాఉంది. ముఖ్యంగా రైతులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటు వేస్తారని బలంగా వినిపిస్తోంది. కాంగ్రెస్, బీజేపీల మధ్యే ప్రధాన పోటీ ఉంటుంది. 90స్థానాలకు ఒకే దశలో పోలింగ్ జరుగుతుంది. లోక్‌సభ ఎన్నికల తర్వాతనే ఈ రెండింటి మధ్య పోటీ ఉంటుందని అంచనా వచ్చింది. అనేక చిన్నచిన్న పార్టీలు కూడా ఎన్నికల బరిలో ఉంటాయి. 2019 లోక్‌సభ ఎన్నికలనాటి వాతావరణం లేనందున బీజేపీకి ఎదురీతే అవుతుంది. 2024 లోక్‌సభ ఎన్నికల తర్వాత బీజేపీ పరిస్థితి దిగజారింది. బీజేపీకి బాగా వ్యతిరేకత ఉందని ఇంకా పెరుగుతుందని కురుక్షేత్ర నివాసి ప్రొఫెసర్ మహావీర్ జగ్లాన్ అంచనా వేశారు. ఇండియన్ నేషనల్ లోక్‌దళ్ (ఐఎన్ఎల్‌డి) పార్టీ నుంచి చీలిపోయిన జగన్నాయక్ జనతాపార్టీ (జేజేపీ) పరిస్థితి 2019లో మెరుగ్గా ఉన్నప్పటికీ లోక్‌సభ ఎన్నికల తర్వాత దాదాపు 90శాతానికిపైగా తగ్గింది. లోక్‌సభ ఎన్నికల్లో 1శాతం ఓట్లు మాత్రమే లభించాయి. అంతకుముందు పదిసీట్లు గెలుచుకుని బీజేపీ ప్రభుత్వంలో భాగస్వామిగా ఉంది.

> హర్యానాలో ప్రధాన ఆదాయవనరు వ్యవసాయమే. నిరుద్యోగం పెద్ద సమస్య. రెండేళ్ల క్రితం సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో రైతులు చేపట్టిన మహత్తర ఉద్యమం ఏడాదికిపైగా నిర్వహించడంతో నరేంద్రమోదీ ప్రభుత్వం చేసిన మూడు దుష్ట చట్టాలను ఉపసంహరించుకున్నదేగానీ రద్దు చేయలేదు. రైతులు ఉద్యమాన్ని విరమించారు. పంటలకు కనీసమద్దతు ధరకు చట్టబద్ధ హామీ ఇవ్వాలన్న డిమాండ్‌ను ఆలకించి చర్చించి ఇస్తామని రాతపూర్వక హామీ ఇచ్చారుకానీ హామీలు అలాగే ఉన్నాయి. ఇటీవల మళ్లీ హర్యానా సరిహద్దుల్లో రైతులు పోరాటం ప్రారంభించారు. ఆందోళన చేస్తున్న రైతుల డిమాండ్లు నెరవేర్చకుండా వేధిస్తున్నారు. ఇప్పుడు ఎన్నికలు వచ్చాయి. ఎలాగైనా అసెంబ్లీ ఎన్నికల్లో గెలవడానికి రాష్ట్రంలో ప్రస్తుత ముఖ్యమంత్రి సైనీ కనీస మద్దతుధరను కల్పిస్తామని హామీ ఇచ్చారు. అయితే ఇదంతా ఎన్నికల స్టంటని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) అభివర్ణించింది.

బీఎస్‌పీతో కలిసి పోటీ చేయాలని ఐఎన్ఎల్‌డి పోటీ చేయాలని భావిస్తోంది. అయితే ఈ రెండుపార్టీల మధ్య నాయకత్వ సమస్య ఉంది. ఆమ్‌ఆద్మీ పార్టీ కాంగ్రెస్‌తో కలిసి పోటీచేయబోమని ప్రకటించింది. ఎన్నికల ప్రకటన వెలువడిన తర్వాత వెంటనే జరిగిన సర్వేలో హంగ్ అసెంబ్లీ ఏర్పడవచ్చునన్న అంచనా వెలువడింది. త్వరలో ప్రధాని మోదీ, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ తదితరులు ఎన్నికల ప్రచారానికి రానున్నారు. రాహుల్ గాంధీ దేశవ్యాప్తంగా రెండుసార్లు పాదయాత్రలుచేసిన తర్వాతనే కాంగ్రెస్ బలం బాగాపెరిగింది. బీసీల ఓట్లు బాగా పెరగవచ్చునన్న ఆశాభావంతో మోదీ మనోహర్‌లాల్ ఖట్టర్‌ను తొలగించి నాయబ్‌సింగ్ సైనీని ముఖ్యమంత్రిని చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ ఆశించినట్టుగా జరగలేదు. ప్రస్తుతానికి బీజేపీపైన కాంగ్రెస్ ఆధిక్యతలో ఉందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఎన్నికలు అక్టోబరు 1న జరుగుతాయి. ఫలితాలు అక్టోబరు 4న వెలువడతాయి.

- టి.వి.సుబ్బయ్య

ప్రజలను విడదీయడం అనాగరికం



డాక్టర్ దేవరాజు మహారాజు

'మూర్ఖత్వాన్ని ఉన్నతీకరించి గొప్పగా చెప్పుకోవడం అనేది నన్ను అమితంగా బాధిస్తుంది. అంతకన్నా నన్ను బాధించేది మరొకటి లేదు' అని అన్నారు ప్రఖ్యాత శాస్త్రవేత్త, వైజ్ఞానిక రచయిత కార్ల్ సాగన్. వివేచన, మౌనం రెండూ కవల పిల్లలు. అందులో ఒకటి వచ్చిందంటే, దానితోపాటు రెండోది తప్పకుండా వస్తుంది. పిచ్చివాగుడువాగే వారికి వివేచన ఉండదని ఇక్కడ గోప్యంగా చెప్పడం జరిగింది. మంగళసూత్రాల మీద మాట్లాడే మన దేశ మహానాయకుడికి ఇది వర్తిస్తుందంటారా? బీజేపీ ప్రభుత్వానికి అంతర్గ తంగా కొన్ని నినాదాలున్నాయి. అవేమంటే "హిందుత్వాన్ని ప్రేమించలేనివాడు భారతదేశాన్ని ఎలా ప్రేమించగలడూ?" అని "జై శ్రీరామ్ అనని వాళ్లంతా పాకిస్థాన్ వెళ్లిపోవాలి" అని "రోగాన్ని ప్రేమించలేని వాడు శరీరాన్ని ఎలా ప్రేమించగలడు?" అన్నట్లుగా ఉంది వీరి నినాదం. హిందు, ముస్లిం, క్రైస్తవం లాంటి మతాలన్నీ 'ధర్మ వ్యాధులే'. ఇందులో హిందు ధర్మవ్యాధిని భారతదేశ ప్రజలకు అంటించిన తొలి పేషంట్-నరేంద్ర మోదీ. మోదీ ఈ దేశ ప్రజలు ధర్మవ్యాధిని వ్యాప్తి చేయడానికి ప్రధానిగా చేశారా? లేక పరిపాలన చెయ్యమనా? దేశాన్ని దేశంగానే ప్రేమించాలి. అందుకోసం ఏదో ఒక ధర్మవ్యాధిని అంటగట్టుకోవాల్సిన పనిలేదు. శరీరం వ్యాధిగ్రస్తమైతే ఏం చేస్తాం? చికిత్స చేయించుకుని ఆ వ్యాధిని వదిలించుకుంటాం, కనీసం తగ్గించుకుంటాం. అందువల్ల, మతానికీ, దేశానికి తేడా తెలియనివారు వెంటనే మానసిక చికిత్స చేయించుకోవాలి. దేశం వేరు, మతం వేరూ అనేది తెలుసుకో గలగాలి. ప్రపంచంలో ఏ దేశమూ ఏ ఒక్క మతానికీ సొంతం కాదు. మన భారత దేశపు ప్రత్యేకత ఏమిటంటే, ఇక్కడ శతాబ్దాలుగా ఎన్నో మతాలు, ఎన్నో భాషలు, ఎన్నో సంస్కృతులు సమ్మిళితమై ఉన్నాయి. "మానసిక రోగులు' ముందు ఆ విషయం గ్రహించుకోవాలి! ఈ భూమి, ఈ దేశం, ఎవరో తయారు చేసింది కాదు. ఎవరి సొంత ఆస్తో కాదు. ఇంది అందరిది! ఇక విశ్వాసాలు, మతాలు అంటారా? అవి వ్యక్తిగతంగానే ఉండాలి. ప్రతి ఒక్కరికీ ఆ స్వేచ్ఛ ఉంది. ఈ భూమి జనాన్ని విడదీయడం లేదు. ఈ భూమి మీద మనిషి ఎప్పుడో ఒకప్పుడు అనాగరిక యుగంలో ఏర్పరచుకున్న విశ్వాసాలు ఇప్పుడు జనాన్ని విడగొడుతున్నాయి. అందులోనూ అధికారంలో ఉన్నవారు మూర్ఖంగా మతాన్ని ఊరేగిస్తూ, తాము ఊరేగుతున్నారు. అందుకు ఈ దేశ ప్రజలు ససేమిరా ఒప్పుకోవడం లేదు. ఈ దేశంలోని మూలవాసులే కొంత కొంతమంది కాలక్రమంలో ముస్లింలుగా, క్రైస్తవులుగా మారారు. తప్పిస్తే, ఇక్కడ ఆ మతాలకు మూలాలు లేవన్నది నిజం. బౌద్ధులుగా, జైనులుగా ఉన్నఈ దేశ మూలవాసుల్ని బలవంతంగా శంకరాచార్యులు, రామానుజాచార్యులు, మధ్వా చార్యులు వగైరాలంతా కలిసి వారి వారి కాలాలలో వైదిక మతస్థులుగా మార్చారన్నది నిజం! అందుకు అన్ని ఆధారాలు ఉన్నాయి. ఇక ఇప్పుడు అన్ని మతాలవారు కలిసిమెలిసి శతాబ్దాలుగా సహ జీవనం చేస్తూ, ఒకరినొకరు గౌరవించు కుంటూ ఒక మిశ్రమ భారతీయ సంస్కృతిని అభివృద్ధి చేసుకున్నదశలో ఎవడో వచ్చి, ఇది 'హిందు దేశం' అని అంటే కుదరదు. ఈ దేశంలని ముస్లింలు, క్రైస్తవులు, పార్సీలు ఇంకా అనేకానేక మతాలవారు అందరూ ఆ దేశ మూలవాసులే! లక్షల సంవత్సరాలు వెనక్కివెళ్లి జీవ పరిణామ దశలు గమనిస్తే, పెద్దఎత్తున జరిగిన మానవ వలసల విషయం క్షుణ్ణంగా గ్రహిస్తే, ఈ దేశానికి అందరికందరూ వలస వచ్చినవారే. అయితే తొలుత వచ్చిన ఎన్నో మానవ జాతుల్లోంచి లక్షల సంవత్సరాలకాలంలో హోమియోసెపియన్లు విడివడి, క్రమంగా నాగరికతను ఏర్పరచుకుంటూ వచ్చారు. వ్యవసాయం అభివృద్ధి చేసుకుని ప్రశాంతంగా జీవించారు. వారే ఈ దేశ మూలవాసులు, ఆ సమయంలో గుర్రాలమీద వలసవచ్చినవారు బ్రాహ్మణార్యులు. వారు, తమ ఆధిక్యతను చాటుకోవడానికి తమను భగవంతుడి స్థానంలో నిలుపుకున్నారు. మిగతావారిని కుల సంస్కృతిప్రకారం, నిచ్చెనమెట్ల వ్యవస్థగా విభజించారు.



మూలవాసులు ఈ విషయం క్షుణ్ణంగా అవగతం చేసుకోవాలి. ఎస్సీ, ఎస్టీ, ఒబిసి, మూలవాసులంతా వైదిక మత ఆచారాలను అనుకరిస్తూ అదే గొప్ప సంస్కృతి. అదే గొప్ప సంప్రదాయం అనే భ్రమలో ఉండకూడదు. వారిని బానిసల్లా తొక్కిపెట్టడానికి హైందవమెంత క్రూరంగా ప్రవర్తించిందో తెలుసుకోవాలి. ప్రపంచానికి తొలిసారి భౌతిక వాదాన్ని వివరించినవారు మన చార్వాకులు. వారేం చెప్పారో తెలుసుకోరు. ఆ తర్వాత వచ్చిన బౌద్ధం, జైనం సూచించిన జీవన విధానం గూర్చి తెలుసుకోరు. వీటన్నింటినీ నాశనంచేస్తూ దౌర్జన్యంగా వచ్చి పెత్తనం చలాయించిందే. వైదిక మతం కాదా? తర్కబద్ధమైన, మనవీయ విలువలతో కూడిన చార్వాకాన్ని, బౌద్ధాన్ని వదిలేసి మూర్ఖపండితులు రూపొందించిన హైందవాన్ని అనుకరించడం విచారకరం. తాము గొప్ప దైవ భక్తులమైపోయామనుకోవడమంత హాస్యాస్పదమైన విషయం మరొకటి ఉండదు. అయితే మూల వాసులు ఈ విషయం ఎంత త్వరగా గ్రహిస్తే అంత మంచింది. వివేకవంతుడెవ్వడూ మనువాద సంస్కృతిని, బ్రాహ్మణిజాన్ని సమర్థించడు. సరే, ఈ విషయాలు అలా ఉండనిచ్చి మనువాదం పునాదులుగా గల బీజేపీ కేంద్ర ప్రభుత్వం ఏం చెపుతుందో చూద్దాం! వారి మాటలవెనక ఎంత నిజాయితీ ఉందో పరిశీలిద్దాం! కాంగ్రెస్, ఇతర ప్రతిపక్షాలు కుటుంబ రాజకీయాలు చేస్తున్నారని మోదీ గొంతుచించుకుటూ ఉంటాడు కదా! తను కూర్చున కుర్చీ అడుగున ఎన్ని గోతులున్నాయో, ఆ గోతుల్లో ఎన్నెన్ని కుటుంబాలున్నాయో ఏ మాత్రం చూసుకోడు. తమ బీజేపీ కుటుబంబాలవైపు లేదా భాగస్వాములైన ఎన్‌డీఏ కూటమి కుటుంబాలవైపు చూసుకుంటే కుటుంబ రాజకీయాలంటే ఏమిటో తెలిసొచ్చేది. ఉదాహరణకు మనమిక్కడ కొన్న కుటుంబాల గురించి చూద్దాం. ఏం; ఇవికుటుంబ రాజకీయాలూ వారసత్వ రాజకీయాలూ కావా? ప్రణీత్ కౌర్, పంజాబ్ మాజీ సీఎం అమరీందర్ సింగ్ భార్య బన్సురీ స్వరాజ్, సుష్మా స్వరాజ్ కుమార్తె, సీతాసొరెన్: జెయంయం నేత శిబుసొరెన్ కోడలు-గీతా కోడా: జార్ఖండ్ మాజీ సీఎం. మధుకోడా భార్య- జ్యోతి మిర్ధా: మాజీ యంపీ, నాథూరామ్ మిర్ధా మనుమరాలు గాయత్రి సిద్ధేశ్వం: కేంద్ర మాజీ మంత్రి జీ.ఎం సిద్ధేశ్వర భార్య -నవనీత్ రాణా: మాజీ ఎమ్మెల్యే రవి రాణా భార్య -మాళవికా దేవి. మాజీ ఎంపీ ఆర్యకేసరి దేశ్ భార్య-కృతిసింగ్ దేవ్ వర్మ :త్రిప్రా మోరా పార్టీ వ్యవస్థాపకుడు ప్రద్యోత్ కిషోర్-మాణిక్యదేశ్ వర్మ సోదరి. పురందేశ్వరి: ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టి. రామారావు కుమార్తె. ఇవికొన్ని మాత్రమే, వీళ్లంతా ఎన్‌డీఏ భాగస్వాములు-బీజేపీ ప్రభుత్వంతో భుజం భుజం రాసుకుని తిరిగేవారు. మోదీ-షాలకు ఎందుకో తమ చుట్టూ ఉన్నవారు కనబడరు. తమకు ఉన్న కంటిదోషం బాగుచేయించుకోరు. నరేంద్ర మోదీ తనకుటుంబ సభ్యులెవరూ రాజకీయాల్లోకి రాకుండా జాగ్రత్త పడ్డాడు. వేరే వాళ్లలాగా తన భార్య ఎక్కడ రాజకీయాల్లోకి వచ్చి, తనను మించిపోతుదేమోనని ముందే పసిగట్టి అనైతికం అని తెలిసి కూడా ఒక మహిళ బతుకును నాశనం చేయడం లాంటిదని తెలిసి కూడా విడాకులు ఇవ్వకుండానే భార్యను వదిలేశాడు. అదే విచిత్రం! దేశప్రజలంతా తన కుటుంబమని చెప్పుకుని తిరుగుతుంటాడు. తన తల్లి బతికిఉన్నంతకాలం తను ఆమె కుమారుడేనని అనుకున్నాడట. ఆమె మరణించిన తర్వాత, తనకు ఒక బలమైన విశ్వాసం కలిగిందట. అదేమంటే, ఆ భగవంతుడే తనను నేరుగా ఈ భూమి మీదికి అంటే ఈ దేశానికి పంపించాడనీ, తనతో ఏవేవో సత్కార్యాలు చేయిస్తున్నాడనీ అనిపిస్తోందట! కనిపెంచిన తల్లి విలువను తగ్గించి, కనపడని దేవుని మహిమకు ప్రాధాన్యతనిచ్చే వాడికి అసలు మనిషికి ఉండే విలువ ఉంటుందా? సీరియస్‌గా ఆలోచించవలసిని విషయం! ఏమైనా ఇలాంటి మాటలతో ఈయన మోదీ బాబా అయిపొయ్యాడు. "వారిపై వారికి అంత విశ్వాసం ఉంటుందంటే, అది కేవలం వారి మూఢత్వం వల్లనే" నని అన్నాడు జర్మన్ రచయిత ఫ్రాంజ్ కాఫ్కా తన రచన "ద ట్రయల్" లో ఒకచోట చెప్పారు.దేశ ప్రధానిని విమర్శించొచ్చా? అని కొందరు ఆందోళన పడుతుంటారు. నిజమే కానీ-ఎప్పుడూ? ఆయన ఆ స్థానానికి, ఆ పదవికి గౌరవమిస్తూ మాట్లాడినప్పుడు, వ్యవహరించనప్పుడు కదా? ఆయనకు ఆ గౌరవం దక్కేదీ? ఆయనే తన పదవిని, స్థాయిని మరిచినప్పుడు, రాజ్యాంగాన్ని అతిక్రమించినప్పుడు ఆయనను విమర్శించే హక్కు ఆయనే ఇతరులు ఇచ్చినట్టవుతుంది. పైగా, ఎలక్షన్ కాలంలో ఆయన ఒక అభ్యర్థి మాత్రమే! పూర్తిస్థాయి ప్రధాని కాదు. ప్రధాని అయినంతమాత్రాన అధికారాలు ఉంటాయి కానీ, సామాన్యపౌరుడికన్నా అధికంగా హక్కులేవీ ఉండవు. ఆరు దశాబ్దాలుగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించినందు వల్లనేకదా ఒక పేదింటి చాయ్‌వాలా దేశప్రధాని అయ్యాడూ? గతంలో దేశం కోసం ప్రాణాలర్పించిన ప్రధానులున్నారు. ఇప్పుడు అధికారంలో ఉన్న వారేమిచ్చారూ? ఆలోచించుకునే పనిలేదా? వారణాసి ఎలక్షన్ ర్యాలీలో బీజేపీ నేత సంబిత్ పాత్ర 'పూరి జగన్నాధుడు మోదీజీ భక్తుడని' ఒళ్లు తెలియకుండా ప్రసంగించాడు. తర్వాత మీడియా ముందుకొచ్చి తను ఒకటి మాట్లాడబోయి ఒకటి మాట్లాడానని విషయం రివర్స్‌లో చెప్పానని క్షమాపణలు కోరారు. బీజేపీ నేతల మాటలూ చేతలూ ఇలా రివర్స్‌లోనే ఉంటాయి. ఈ అబద్ధాల ప్రభుత్వంపోయి, నిజాల ప్రభుత్వం-నిజాయితీగల ప్రభుత్వం ఏర్పడుతుందని ఆశిద్దాం!! అచ్చేదిన్ వచ్చేది అప్పుడే.

కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు విజేత, విశ్రాంత బయాలజీ ప్రొఫెసర్

హెచ్‌డీ రేవణ్ణ, ప్రజ్వల్‌పై ఛార్జ్‌షీట్ దాఖలు

బెంగుళూరు: అత్యాచారం, లైంగిక వేధింపుల కేసులో మాజీ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ, అతని తండ్రి హెచ్‌డీ రేవణ్ణపై ప్రత్యేక దర్యాప్తు బృందం ఛార్జ్‌షీట్ దాఖలు చేసింది. ప్రజ్వల్‌పై సిట్ నాలుగు కేసులు విచారిస్తున్నది. సుమారు రెండు వేల పేజీల ఛార్జ్‌షీట్ దాఖలు చేసినట్లు సిట్ చెప్పింది. దీని కోసం 150 మంది సాక్షులను విచారించింది. ఇంట్లో పనిమనిషిపై లైంగిక దాడి జరిగినట్లు నమోదు చేసిన కేసులో ఛార్జీషీట్‌ను సిట్ సమర్పించింది. స్పాట్ ఇన్‌స్పెక్షన్, బయోలాజికల్, ఫిజికల్, సైంటిఫిక్, మొబైల్, డిజిటల్, ఇతర ఆధారాలు సేకరించినట్లు సిట్ తెలిపింది. ఛార్జ్‌షీట్ దాఖలు చేయడానికి ముందు నిపుణుల అభిప్రాయాలు తీసుకున్నట్లు సిట్ వెల్లడించింది. మాజీ ప్రధాని హెచ్‌డీ దేవెగౌడ కుమారుడు ఎమ్మెల్యే రేవణ్ణపై ఐపీసీలోని సెక్షన్ 354, 354(ఏ) కేసులు నమోదు చేశారు. ప్రజ్వల్‌పై 376, 376(2)(కే), 354, 354(ఏ), 354(బీ) సెక్షన్ల కింద కేసు బుక్ చేశారు. ఓ పనిమనిషి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా దర్యాప్తు చేపట్టారు.

నేడు మహారాష్ట్ర, రాజస్థాన్‌కు మోదీ

న్యూఢిల్లీ : ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆగస్టు 25న మహారాష్ట్రలోని జల్‌గావ్, రాజస్థాన్‌లోని జోధ్‌పూర్‌లో పర్యటిస్తారు. ఉదయం 11:15 గంటలకు లఖపతి దీదీ సమ్మేళన్‌లో పాల్గొంటారు. సాయంత్రం 4:30 గంటలకు జోధ్‌పూర్‌లో రాజస్థాన్ హైకోర్టు ప్లాటినం జూబ్లీ ఉత్సవాల ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొంటారు. మహారాష్ట్రలో లఖపతి దీదీ సమ్మేళన్‌లో ప్రధాని పాల్గొని 11 లక్షల మంది కొత్త లఖపతి దీదీలకు ఆయన సర్టిఫికెట్లు అందజేసి సత్కరిస్తారు. 2,500 కోట్ల రూపాయల రివాల్వింగ్ ఫండ్‌ను విడుదల చేస్తారు. దీనిద్వారా 4.3 లక్షల స్వయం సహాయక బృందాలలో (ఎస్‌హెచ్‌జీలు) 48 లక్షల మంది సభ్యులకు ప్రయోజనం చేకూరుతుంది. 2.35 లక్షల స్వయం సహాయక సంఘాలలోని 25.8 లక్షల మంది సభ్యులకు ప్రయోజనం చేకూర్చే రూ.5 వేల కోట్ల బ్యాంకు రుణాన్ని కూడా ఆయన పంపిణీ చేస్తారు. అలాగే రాజస్థాన్‌లోని జోధ్‌పూర్‌లోని హైకోర్టు క్యాంపస్‌లో జరగనున్న హైకోర్టు ప్లాటినం జూబ్లీ వేడుకల ముగింపు కార్యక్రమానికి ప్రధాని ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. హైకోర్టు మ్యూజియంను ప్రారంభించనున్నారు.

లాలూ, తేజస్వీపై విచారణ వాయిదా

న్యూఢిల్లీ : ఉద్యోగాల కోసం భూ కుంభకోణం కేసులో మాజీ రైల్వే మంత్రి లాలూ ప్రసాద్, ఆయన కుమారుడు తేజస్వి యాదవ్‌తో పాటు మరో ఎనిమిది మందిపై ఈడీ అనుబంధ ఛార్జిషీట్‌ను పరిగణనలోకి తీసుకోవాలా వద్దా అనే దానిపై ఢిల్లీ కోర్టు శనివారం తన ఆదేశాలను వాయిదా వేసింది. ప్రత్యేక న్యాయమూర్తి విశాల్ గోగ్నే ప్రాసిక్యూషన్ ఫిర్యాదుపై (ఈడీ ఛార్జిషీట్‌కి సమానం) కొన్ని వివరణలు అవసరమని పేర్కొంటూ సెప్టెంబరు 7కి వాయిదా వేశారు. ఆగస్టు 6న అనుబంధ ఛార్జిషీట్‌ను కోర్టు ముందు దాఖలు చేసింది. కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) దాఖలు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తన కేసులను దాఖలు చేసింది. 2004 నుంచి 2009 వరకు లాలూ యాదవ్ రైల్వే మంత్రిగా ఉన్న సమయంలో మధ్య ప్రదేశ్‌లోని జబల్‌పూర్‌లో ఉన్న రైల్వేలోని వెస్ట్ సెంట్రల్ జోన్‌లో జరిగిన గ్రూప్-డి నియామకాలకు సంబంధించి నియమితులైన వ్యక్తులు... ఆర్‌జేడీ అధినేత లేదా ఆయన అనుయాయులకు బహుమతిగా ఇచ్చిన లేదా బదిలీ చేసిన భూములకు సంబంధించిన కేసు ఇది.

కూలిన ప్రైవేట్ హెలికాప్టర్

ముంబై: మహారాష్ట్రలోని పుణెలో పౌడ్ సమీపంలో ఓ ప్రైవేటు హెలికాప్టర్ శనివారం కూలిపోయింది. ముంబై నుంచి హైదరాబాద్ వస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఆ సమయంలో హెలికాప్టర్‌లో నలుగురు ప్రయాణికులున్నట్లు పుణె రూరల్ ఎస్పీ పంకజ్ దేశ్‌ముఖ్ వెల్లడించారు. అదృష్టవశాత్తూ వీరంతా ప్రాణాలతో బయటపడ్డారు. వీరిలో కెప్టెన్ తీవ్రంగా గాయపడగా ఆయనను ఆసుపత్రికి తరలించారు. మిగతా ముగ్గురు సురక్షితంగా ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. ప్రమాదం జరిగిన హెలికాప్టర్ గ్లోబల్ వెక్ట్రా కంపెనీకి చెందినదిగా గుర్తించారు. ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది.

ఎన్నారైపై దుండగుల కాల్పులు

అమృత్‌సర్: ఇటీవల అమెరికా నుంచి వచ్చిన ఓ ఎన్నారైపై ఇద్దరు గుర్తు తెలియని దుండగులు శనివారం కాల్పులు జరిపారు. దీనికి ఆస్తి తగాదాలే కారణమని పోలీసులు అనుమానిస్తున్నారు. కాల్పులకు సంబంధించిన దృశ్యాలు సీసీటీవీలో రికార్డ్ అయ్యాయి. పోలీసుల వివరాల ప్రకారం... అమెరికాకు చెందిన సుఖ్‌చైన్ ఇటీవలే ఇండియాకు తిరిగివచ్చారు. పంజాబ్‌లోని అమృత్‌సర్ జిల్లాలో డబుర్జి గ్రామంలో కుటుంబసభ్యులతో కలిసి ఉంటున్నారు. ఈ క్రమంలో తలకు తలపాగా కట్టుకుని, మోటర్ సైకిల్‌పై వచ్చిన ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లోకి ప్రవేశించారు. బాధితుడుని తుపాకితో బెదిరించి మరో గదిలోకి వెళ్లాలన్నారు. అందుకు నిరాకరించడంతో ఇద్దరు దుండగులు కాల్పులు జరిపారు. ఘటన సమయంలో బాధితుడి కుటుంబసభ్యులు ఇంట్లోనే ఉన్నారు. కాల్పుల అనంతరం దుండగులు పారిపోయారు. స్థానికులు బాధితుడిని ఆసుపత్రికి తరలించారు. అమెరికా నుంచి వచ్చిన బాధితుడు ఇటీవలే ఓ హోటల్, లగ్జరీ కారు కొనుగోలుకు ప్రయత్నించారు. ఈ లావాదేవీలకు సంబంధించి వ్యవహారంలోనే కాల్పులు జరిపినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. కాల్పుల దృశ్యాలు రికార్డయిన సీసీటీవీ ఫుటేజీని రికవరీ చేసుకున్నామని, కేసు దర్యాప్తు ప్రారంభించినట్లు వెల్లడించారు.

బీహార్‌లో అవినీతి విలయతాండవం

తేజస్వి

పాట్నా: బీహార్ రాష్ట్రం అవినీతితోపాటు అన్నింట్లోనూ మొదటిస్థానంలో ఉన్నదని ఆర్జేడీ పార్టీ అగ్రనేత, బీహార్ మాజీ ఉపముఖ్యమంత్రి తేజస్వీ యాదవ్ అన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... ముఖ్యమంత్రి నితీశ్ కుమార్‌కు ప్రభుత్వాన్ని నడిపే సత్తా లేదని, బీజేపీ నేతలకు అధికారం తప్ప ప్రజల సంక్షేమం పట్టదని విమర్శించారు. కేంద్రంలో, రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వమే ఉన్నా బీహార్‌కు చేసిందేమీ లేదని మండిపడ్డారు. 'నిరుద్యోగం, పేదరికం, అధిక ధరలు, అవినీతి అన్నింట్లోనూ బీహార్ నెంబర్ వన్ రాష్ట్రం. నేరాల్లోనూ నెంబర్ వన్ రాష్ట్రమే. బీహార్ కోసం బీజేపీ చేసిందేమీ లేదు. ఎప్పుడూ అధికారం కోసం పాకులాడుతుంది. 17 ఏళ్లుగా బీహార్‌లో డబుల్ ఇంజిన్ ప్రభుత్వమే ఉన్నా రాష్ట్రానికి వాళ్లు చేసిందేమీ లేదు' అని తేజస్వి యాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

'బుల్డోజర్ న్యాయం' అంగీకరించం

కాంగ్రెస్ స్పష్టీకరణ

న్యూఢిల్లీ : బీజేపీ పాలిత రాష్ట్రాల్లో మైనారిటీలను తరచూ లక్ష్యంగా చేసుకోవడం తీవ్ర ఆందోళన కలిగిస్తోందని, 'బుల్‌డోజర్ న్యాయం' అనేది పూర్తిగా ఆమోదయోగ్యం కాదని, దానిని వెంటనే ఆపాలని కాంగ్రెస్ శనివారం డిమాండ్ చేసింది. మధ్య ప్రదేశ్‌లోని ఛతర్‌పూర్ జిల్లాలో నిరసన సందర్భంగా హింసకు పాల్పడిన వ్యక్తి ఇంటిని కూల్చివేసిన తర్వాత ప్రతిపక్ష పార్టీ ఈ ప్రకటన చేసింది. 'కొత్వాలి పోలీస్ స్టేషన్ పరిధిలోని షాజాద్ అలీ ఇల్లును కూల్చివేయడం జరిగింది. హింసకు పాల్పడిన 150 మందిపై బుధవారం కేసు నమోదు చేశాం. మేము 46 మంది వ్యక్తులను పేర్కొన్నాం' అని అధికారి ఒకరు తెలిపారు. ఈ ఘటనపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ ఒకరి ఇంటిని కూల్చివేసి వారి కుటుంబాన్ని నిరాశ్రయులుగా మార్చడం అమానవీయమని, అన్యాయమని అన్నారు. 'బీజేపీ పాలిత రాష్ట్రాల్లో మైనారిటీలను తరచూ లక్ష్యంగా చేసుకోవడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. రూల్ ఆఫ్ లా ద్వారా పాలించబడే సమాజంలో ఇటువంటి చర్యలకు స్థానం లేదు' అని ఆయన 'ఎక్స్' లో ఒక పోస్ట్‌లో పేర్కొన్నారు. బీజేపీ రాష్ట్ర ప్రభుత్వాలు రాజ్యాంగాన్ని నిర్లక్ష్యం చేస్తున్నాయని, పౌరులలో భయాన్ని కలిగించడానికి బుల్‌డోజింగ్‌ను ఉపయోగించడాన్ని కాంగ్రెస్ తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఖర్గే తెలిపారు. 'అరాచకం సహజ న్యాయాన్ని భర్తీ చేయదు. నేరాలపై కోర్టులలో తీర్పు ఇవ్వబడాలేగానీ పాలకుల బలవంతం ద్వారా కాదు' అని అన్నారు. ఇదే ఘటనపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా 'ఎక్స్' లో చేసిన పోస్ట్‌లో... 'ఎవరైనా ఒక నేరానికి పాల్పడినట్లయితే, అతని నేరం, శిక్షను కోర్టు మాత్రమే నిర్ణయించగలదు. కానీ ఆరోపణ వచ్చిన వెంటనే నిందితుడి కుటుంబాన్ని శిక్షించడం, వారి ఇంటిని కూల్చివేయడం, చట్టాన్ని పాటించకపోవడం, కోర్టును ఉల్లంఘించడం... ఇది న్యాయం కాదు' అని ఆమె పేర్కొన్నారు. ఇది అనాగరికత, అన్యాయపు ఎత్తు అని, చట్టసభ సభ్యులు, చట్టాన్ని కాపాడే వారు. చట్టాన్ని ఉల్లంఘించే వారి మధ్య వ్యత్యాసం ఉండాలన్నారు. ప్రభుత్వాలు నేరస్తుల వలె ప్రవర్తించలేవని ఆమె నొక్కి చెప్పారు. చట్టాన్ని అనుసరించడం, రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, మానవత్వం అనేది నాగరిక సమాజంలో పాలనకు సంబంధించిన కనీస షరతులు అని ప్రియాంక గాంధీ అన్నారు. 'రాజధర్మాన్ని నెరవేర్చలేనివారు సమాజ శ్రేయస్సు కోసం లేదా దేశ సంక్షేమం కోసం పని చేయలేరు. బుల్డోజర్ న్యాయం పూర్తిగా ఆమోదయోగ్యం కాదు. అది ఆగిపోవాలి' అని తెలిపారు.

మహిళా పోలీసులకు ఏడాది ప్రసూతి సెలవులు: స్టాలిన్

చెన్నై: రాష్ట్రంలోని మహిళా పోలీసులకు ఏడాదిపాటు ప్రసూతి సెలవులు ఇస్తామని తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ప్రకటించారు. చెన్నైలోని రాజరథినం స్టేడియంలో ప్రతిభ కనబర్చిన పోలీసు అధికారులు, సిబ్బందికి రాష్ట్రపతి పతకం, కేంద్ర హోంమంత్రి పతకాలు అందజేసిన సందర్భంలో ఈ ప్రకటన చేశారు. ప్రసూతి సెలవు తర్వాత తిరిగి విధుల్లో చేరిన మహిళా పోలీసులకు వారి తల్లిదండ్రులు లేదా భర్త స్వగ్రామంలో వారి ఎంపిక ప్రకారం మూడేళ్లపాటు ఉద్యోగం కల్పిస్తామని ముఖ్యమంత్రి తెలిపారు. పోలీసు శాఖ సిబ్బంది అభ్యర్థన మేరకు ఈ నిర్ణయం తీసుకుంటున్నట్లు చెప్పారు. 2021లో అధికారంలోకి వచ్చిన తర్వాత డీఎంకే ప్రభుత్వం ఉద్యోగులకు ప్రసూతి సెలవులను తొమ్మిది నెలల నుంచి ఏడాదికి పెంచడం చర్చనీయాంశమైంది. నేరాలను అరికట్టడంలో మీ కర్తవ్యం, బాధ్యత చాలా పెద్దదని సీఎం గుర్తు చేశారు. మీరు ప్రజలను రక్షించాలన్నారు. దీంతోపాటు మీ విధులను అంకితభావంతో నిర్వహించాలన్నారు. నేరాలు తగ్గించడానికి మాత్రమే కాకుండా నేరాలను నిరోధించే విధంగా పని చేయాలని సూచించారు. తమిళనాడును డ్రగ్స్, నేరాలు లేని రాష్ట్రంగా మార్చాలని స్టాలిన్ కోరారు.

భారత్ చేరుకున్న మోదీ

న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పోలాండ్, ఉక్రెయిన్ దేశాల పర్యటన ముగించుకుని శనివారం స్వదేశానికి చేరుకున్నారు. 45 ఏళ్ల తర్వాత భారత ప్రధానిగా మోదీ పోలాండ్‌లో పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా డోబ్రో మహరాజ్ మెమోరియల్, కొల్హాపూర్ మెమోరియల్, మోంటే కాస్సినో యుద్ధ స్మారకం సహా అనేక మెమోరియల్స్‌ను మోదీ సందర్శించి నివాళులర్పించారు. భారత సంతతి ప్రజలను కలుసుకుని భారతదేశ ప్రగతి, వసుధైక కుటుంబం తాత్వికతపై మాట్లాడారు. ఆ దేశ ప్రధాని డోనాల్డ్ టస్క్‌ను కలుసుకుని భారత్-పోలాండ్ మధ్య వ్యూహాత్మక సంబంధాలను మరింత పటిష్టం చేసేందుకు నిర్ణయించారు. వివిధ రంగాల్లో పరస్పర సహకారంపై చర్చించారు. అధ్యక్షుడు ఆండ్రెజ్ డుడాను కలుసుకున్నారు. పోలాండ్ కబడ్డీ ఫెడరేషన్ సభ్యులు, ఐడియాలజిస్టులను కలుసుకుని సాంస్కృతిక సంబంధాల మెరుగు, పోలాండ్‌లో భారత క్రీడలను అభివృద్ధి చేసే అంశాలపై చర్చించారు. కాగా, ఉక్రెయిన్‌తో 1992లో దౌత్య సంబంధాలు మొదలైనప్పటి నుం చి ఆ దేశంలో పర్యటించిన తొలి ప్రధానిగా మోదీ నిలిచారు. ఆగస్టు 23న కీవ్‌లో అడుగుపెట్టిన మోదీ... అక్కడి 'ఒయాసిస్ ఆఫ్ పీస్' పార్క్‌లో మహాత్మాగాంధీ విగ్రహానికి నివాళులర్పించారు. రష్యాతో యుద్ధంలో ప్రాణాలు కోల్పోయిన చిన్నారులకు ఆ దేశ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో కలిసి నివాళులు అర్పించారు. బాధితులకు నివాళిగా ఒక ఆటబొమ్మను ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం ద్వైపాక్షిక సమావేశంలో మోదీ, జెలెన్‌స్కీ పాల్గొన్నారు. కొన్ని ఒప్పందాలపై రెండు దేశాలు సంతకాలు చేశాయి. వ్యవసాయం, వైద్య ఉత్పత్తుల క్రమబద్ధీకరణ, మానవతా సాయం, సాంస్కృతిక మార్పిడి తదితర రంగాల్లో సహకారానికి నిర్ణయించారు. ఉక్రెయిన్ వైద్య అవసరాలకు మద్దతుగా మెడికల్ కిట్స్‌ను జెలెన్‌స్కీకి అందజేసారు. కీవ్‌లో స్కూల్ ఆఫ్ ఓరియంటల్ స్టడీస్‌లో హిందీ నేర్చుకుంటున్న ఉక్రెయిన్ విద్యార్థులను కలుసుకుని వారితో సంభాషించారు. ఉక్రెయిన్ ప్రజలకు భారతీయ సంస్కృతిని చేరువ చేసే ప్రయత్నాలను అభినందించారు. ఉక్రెయిన్-రష్యా సమస్యలపై పరస్పరం చర్చించుకుని సమస్యలు పరిష్కరించుకోవాలని, ఇందుకు ఎలాంటి సహకారం అందించేందుకైనా భారత్ సిద్ధంగా ఉందని జెలెన్‌స్కీతో జరిపిన సంభాషణల్లో మోదీ భరోసా ఇచ్చారు.

హర్యానాలో కాంగ్రెస్ ఒంటరి పోరు

ఆప్‌తో పొత్తు ఉండదు: కుమారి సెల్జా

న్యూఢిల్లీ: హర్యానా అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ ఒంటరిగా పోటీ చేస్తుందని, ఆమ్ ఆద్మీ పార్టీతో పొత్తు పెట్టుకోదని కాంగ్రెస్ సీనియర్ నేత కుమారీ సెల్జా అన్నారు. రాష్ట్రంలో తమ పార్టీ పటిష్టంగా ఉందని తెలిపారు. హంగ్ అసెంబ్లీకి అవకాశాలు లేవన్నారు. 90 మంది సభ్యులు ఉన్న హర్యానా అసెంబ్లీలో కాంగ్రెస్‌కు మెజారిటీ వస్తుందని దీమాగా చెప్పారు. ఆమె పీటీఐ ఎడిటర్లకు ఆ వార్తాసంస్థ కేంద్ర కార్యాలయంలో ఇచ్చిన ఇంటర్వ్యూలో హర్యానాలో కాంగ్రెస్ గెలుపుపై సంపూర్ణ విశ్వాసం వ్యక్తంచేశారు. జననాయక్ జనతా పార్టీ (జేజేపీ) పట్టును కోల్పోయిందని, పార్టీ చీలికలతో అసెంబ్లీ ఎన్నికల్లో రాణించలేదన్నారు. చాలా మంది ఎమ్మెల్యేలు ఆ పార్టీని వీడారని సెల్జా అన్నారు. ఐఎన్ఎల్‌డీ-బీఎస్పీ కూటమి కూడా డీలా పడిపోయిందని వ్యాఖ్యానించారు. రెండు పార్టీలు బలహీనంగా ఉన్నాయని అన్నారు. ఈ కూటమి ప్రభావం ఉండబోదని సెల్జా వెల్లడించారు. ఆప్‌తో పొత్తుకు అవకాశం ఉండదని ఒక ప్రశ్నకు బదులిచ్చారు. 'రాష్ట్రాల్లో పోటీపై పార్టీలు సొంతంగా నిర్ణయాలు తీసుకొచ్చు. విధానసభ ఎన్నికల్లో పొత్తులు పెట్టుకోమని ఆప్ ముందే ప్రకటించుకుంది. కాంగ్రెస్ సొంతంగా ఎన్నికలకు వెళ్లగలదు. బీజేపీకి దీటైన పోటీ ఇవ్వడమే కాకుండా భారీ మెజారిటీనీ సాధించగలదు' అని సెల్జా అన్నారు. మొత్తం 90 స్థానాల్లో పోటీ చేస్తామని, తమకు ప్రతి ఒక్క సీటు ముఖ్యమేనని చెప్పారు. బీజేపీ పాలన నుంచి హర్యానా ప్రజలు విముక్తిని కోరుకుంటున్నారని, పరిపాలనా మార్పును కాంక్షిస్తున్నారని ఆమె అన్నారు. బ్యూరోక్రసీలో లేటరల్ ఎంట్రీ, దానికి కాంగ్రెస్ వ్యతిరేకతపై ప్రశ్నకు '17-20 ఏళ్ల కిందటి పరిస్థితులు, ఇప్పటి పరిస్థితులు వేర్వేరు. అప్పుడు సమర్థించారు కదా ఇప్పుడు ఎందుకు వ్యతిరేకిస్తున్నారంటే అర్థంలేదు. ఇప్పుడు అది పెద్ద సమస్యగా మారింది కాబట్టే దానిపై గళం ఎత్తాల్సి వచ్చింది. అన్ని నియామకాలు, రిజర్వేషన్లను అనుమతించాల'ని నొక్కిచెప్పారు. రైతులకు ఎంఎస్‌పీ, అగ్నిపథ్ పథకం ఉపసంహరణకు కాంగ్రెస్ కట్టుబడి ఉందని తెలిపారు. హర్యానాలో నిరుద్యోగం, అవినీతి పెద్ద సమస్యలుగా ఉన్నాయన్నారు. అనేక కుంభకోణాలు, పేపర్ లీకేజిలు, ఖాళీల భర్తీలో అవకతవకలు వంటివన్నీ అపరిష్కృతంగా ఉన్నట్లు చెప్పారు. మల్లయోధురాలు వినేశ్ ఫొగాట్ రాజకీయాల్లోకి రావడంపై ప్రస్తుతానికి ఎలాంటి వ్యాఖ్యలు చేయలేనన్నారు. ఖాప్ పంచయత్‌లపై ప్రశ్నకు అవి సామాజిక సంఘాలు.... చెడ్డవేమీ కాదు అని బదులిచ్చారు. కొన్ని సార్లు చిన్న విషయాలు పెద్ద వివాదాలుగా మారుతుంటాయి కానీ చాలా సమస్యలను చర్చించి పరిష్కరిస్తారు. సమాజంలో సౌభాతృత్వాన్ని ఖాప్ పంచాయత్‌లు ప్రోత్సహిస్తాయని కుమారీ సెల్జా అన్నారు.

జమ్మూకశ్మీర్‌లో 88 లక్షల మంది ఓటర్లు: సీఈవో

శ్రీనగర్: జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల్లో 88 లక్షల మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నట్లు ముఖ్య ఎన్నికల అధికారి పీకే పోల్ తెలిపారు. సెప్టెంబర్ 18వ తేదీన తొలి దశలో ఏడు జిల్లాలు, సెప్టెంబర్ 23న ఆరు జిల్లాల్లో రెండో దశ ఎన్నికలు జరగనున్నాయి. అక్టోబర్ ఒకటిన ఏడు జిల్లాలో మూడో దశ ఉంటుందని ఆయన తెలిపారు. దక్షిణ కశ్మీర్‌లోని నాలుగు జిల్లాలు, దోడాలోని మూడు జిల్లాలు మొదటి దశ పోలింగ్‌లో ఉన్నట్లు చెప్పారు. ప్రతి పోలింగ్ బూత్‌లో కనీస వసతులు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. కొత్తగా 209 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

మహిళలు, పురుషులకు వేర్వేరుగా క్యూలైన్లు ఉంటాయన్నారు. వృద్ధులకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. 88 లక్షల మంది ఓటర్లలో... 44.89 లక్షల మంది పురుషులు, 43.83 లక్షల మహిళా ఓటర్లు ఉన్నారు. 163 ట్రాన్స్‌జెండర్ ఓటర్లు ఉన్నట్లు తెలిపారు.

41కు పెరిగిన నేపాల్ ప్రమాద మృతులు

రూ.2 లక్షల పరిహారం ప్రకటించిన మోదీ

న్యూఢిల్లీ: నేపాల్‌లోని తహాహున్ జిల్లాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో మరణించిన వారి సంఖ్య 41కి పెరిగింది. ఈ మేరకు మహారాష్ట్ర మంత్రి గిరీశ్ మహారాజ్ తెలిపారు. మృతులు 41కు పెరిగారని, ఢిల్లీలోని ఎంబసీతో సంప్రదింపులు జరుపుతున్నామన్నారు. 12 మంది నేపాల్ సైన్యం ఆసుపత్రికి చేర్చినట్లు చెప్పారు. గాయపడిన వారిని ఎయిర్‌లిఫ్ట్ చేసి త్రిభువన్ యూనివర్సిటీ టీచింగ్ హాస్పిటల్‌కు చేర్చారు. పొఖారా నుంచి ఖాట్మండుకు వెళుతుండగా ఈ దుర్ఘటన జరిగింది. ప్రయాణికుల్లో చాలా వరకు మహారాష్ట్రలోని జల్గావ్ జిల్లాకు చెందిన వారున్నారు. మృతదేహాలను, గాయపడిన వారిని ఉత్తరప్రదేశ్-నేపాల్ సరిహద్దులోని మహారాజ్‌గంజ్ జిల్లా ద్వారా శనివారం మధ్యాహ్నం భారత్‌కు చేర్చినట్లు మహారాష్ట్ర విపత్తు నియంత్రణ యంత్రాంగం (ఎస్‌డీఎంఏ) డైరెక్టర్ లాహు మలీ తెలిపారు. బాధిత కుటుంబాలకు అన్ని విధాలా సహకరించాలని కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు సీఎం ఏక్‌నాథ్ షిండే కోరినట్లు అధికారులు పేర్కొన్నారు. గోరఖ్‌పూర్ నుంచి ఐఏఎఫ్ ప్రత్యేక విమానంలో మహారాష్ట్ర యాత్రికుల మృతదేహాలు నాసిక్‌కు చేరుతాయని, ఇందుకయ్యే ఖర్చును రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుందని వెల్లడించారు. ఇదిలావుంటే, మృతుల కుటుంబాలకు రూ.2లక్షలు, క్షతగాత్రులకు రూ.50వేలు చొప్పున నష్ట పరిహారాన్ని ప్రధానమంత్రి జాతీయ నిధి నుంచి ప్రకటించినట్లు ప్రధానమంత్రి కార్యాలయం ఒక ప్రకటన వెలువరించింది.

జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదా లక్ష్యం

పీడీపీ ఎన్నికల మేనిఫెస్టో విడుదల



శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్ధరణే లక్ష్యంగా అసెంబ్లీ ఎన్నికల మేనిఫెస్టోను పీడీపీ శనివారం విడుదల చేసింది. భారత్, పాకిస్థాన్ మధ్య దౌత్యానికి హామీనిచ్చింది. నియంత్రణ రేఖ (ఎల్‌ఓసీ) వెంబడి వాణిజ్యం తదితర సామాజిక కార్యకలాపాలకు అనుసంధానం పెంచుతామని వాగ్దానం చేసింది. పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా అధినేత్రి మెహబూబా ముఫ్తీ, సీనియర్ నేతలు కలిసి 'ప్రజల ఆకాంక్షలు' శీర్షికతో రూపొందిన మేనిఫెస్టోను విడుదల చేశారు. స్వేచ్ఛ వాణిజ్యం, ప్రజా భద్రత చట్టం (పీఎస్ఏ), ఉపా, శత్రు చట్టం రద్దునకూ పీడీపీ హామీ ఇచ్చింది. సాయుధ దళాలకు ప్రత్యేక అధికారాల చట్టం (ఏఎఫ్ఎస్‌పీఏ) రద్దుకు కట్టుబడి ఉన్నట్లు తెలిపింది. అన్యాయంగా ఉద్యోగాల్లో నుంచి తొలగించిన కేసులను పరిష్కరిస్తామని ఉగ్రవాద ఆరోపణలతో జమ్మూకశ్మీర్ ప్రభుత్వ ఉద్యోగుల తొలగింపునుద్దేశించి పీడీపీ పేర్కొంది. ఈ సందర్భంగా ముఫ్తీ మాట్లాడుతూ తమ అజెండాను కాంగ్రెస్, నేషనల్ కాన్ఫరెన్స్ అమలు చేస్తానంటే తాము పోటీ నుంచి వైదొలుగుతామని చెప్పారు. వచ్చే నెల జరిగే ఎన్నికలకు ఇప్పటికే కాంగ్రెస్, నేషనల్ కాన్ఫరెన్స్ పొత్తు ప్రకటించి... సీట్ల సర్దుబాటు చర్చలు జరుపుతున్నాయి. కాంగ్రెస్, ఎన్‌సీ పొత్తుపై ముఫ్తీ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆ రెండు పార్టీల పొత్తుకు ఓ అజెండా లేదని ముఫ్తీ విమర్శించారు. కేవలం సీట్ల పంపకం కోసమైతే తాము ఏ కూటమిలోనూ చేరబోమని చెప్పారు. ఒకవేళ తమ ఎజెండాకు కాంగ్రెస్, నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీలు సరేనంటే... తాము ఏకంగా పోటీ నుంచే తప్పుకుంటామని చెప్పారు. కశ్మీర్ సమస్యల పరిష్కారమే తమకు ప్రాధాన్యం తప్ప ఇంకేదీ ముఖ్యం కాదన్నారు.

మేఘాలయ సీఎంకు స్క్రబ్ టైఫస్ పాజిటివ్

గువహతి: మేఘాలయ ముఖ్యమంత్రి కానర్డ్ కె.సంగ్మా అస్వస్థతకు గురయ్యారు. తీవ్ర జ్వరంతో బాధపడుతున్నారు. ఆయనకు స్క్రబ్ టైఫస్ పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. టైఫాయిడ్ ఉన్నట్లు తేలింది. తొలుత ఇంటి వద్దనే వైద్యం అందించారు. రక్త పరీక్షలు చేయగా టైఫాయిడ్, స్క్రబ్ టైఫస్ పాజిటివ్‌గా వచ్చింది. వెంటనే షిలింగ్ సివిల్ హాస్పిటల్‌కు తరలించారు. సీనియర్ వైద్యులు ఆయనకు చికిత్స అందిస్తున్నారు. 'సీఎం సంగ్మా స్క్రబ్ టైఫస్‌తో బాధపడుతున్నారు. ఆయన ఆరోగ్యం నిలకడగా ఉంది. వైద్యులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు' అని అధికారిక ప్రకటన తెలిపింది. బుష్ టైఫస్ లేక స్క్రబ్ టైఫస్ అనే ఈ వ్యాధి ఓరెంటియా సుట్సుగాముషి అనబడే బ్యాక్టీరియా ద్వారా వస్తుంది. రోగిలో తీవ్ర జ్వరం, తలనొప్పి, ఒంటినొప్పులు, దద్దుర్లు వంటి లక్షణాలు కనిపిస్తాయి.

నిందితులకు ప్రభుత్వ అండ

బద్లాపూర్ ఘటనపై ఉద్ధవ్

ముంబై/పూణె : మహిళలపై నేరాలకు పాల్పడుతున్న నిందితులపై చర్యలకు తీసుకోవడానికి బదులు వారికి ప్రభుత్వం అండగా నిలుబడుతోందని, ఈ ఘటన దేశంలో మహారాష్ట్ర ప్రతిష్ఠను దెబ్బతీసిందని శివసేన (యూబీటీ) అధ్యక్షుడు ఉద్ధవ్ ఠాక్రే, ఎన్‌సీపీ (ఎస్‌పీ) అధ్యక్షుడు శరద్ పవార్ శనివారం విమర్శించారు. మహిళలపై నేరాలకు వ్యతిరేకంగా ముంబైలో జరిగిన ఒక ప్రదర్శనను ఉద్దేశించి ఠాక్రే మాట్లాడుతూ బద్లాపూర్‌లో ఇద్దరు కిండర్ గార్టెన్ బాలికలపై లైంగిక వేధింపుల ఘటనను ప్రస్తావిస్తూ, రాష్ట్రంలో మహిళల భద్రతకు భరోసా ఇవ్వడానికి మహాయుతి ప్రభుత్వాన్ని తొలగించడం అత్యవసరమని అన్నారు. దోషులపై చర్యలు తీసుకునే బదులు వారి పక్షాన నిలవడం విచారకరమని అన్నారు. అధికారంలో ఉన్న 'సిగ్గు లేని' ప్రభుత్వాన్ని మహారాష్ట్ర ఎన్నడూ చూడలేదని తెలిపారు. మహాయుతి అనేది బీజేపీ, ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేన, అజిత్ పవార్ నేతృత్వంలోని ఎన్‌సీపీ కూటమి. సీఎం షిండేపై విమర్శల దాడి చేసిన ఠాక్రే... మహాభారతంలోని ఒక పాత్రను సూచించే 'కంస మామ' తన మణికట్టుకు రాఖీలు కట్టడంలో బిజీగా ఉన్నారని, మేనకోడళ్లకు ఎప్పుడు న్యాయం చేస్తారని ప్రశ్నించారు. బద్లాపూర్ ఘటనకు నిరసనగా ఠాక్రే, ఆయన భార్య రశ్మీ, వారి కుమారుడు, మహారాష్ట్ర మాజీ మంత్రి ఆదిత్య దాదర్ ప్రాంతంలోని శివసేన భవన్‌లో పార్టీ కార్యకర్తలతో కలిసి నోటికి నల్ల రిబ్బన్లు, నల్ల బ్యాండ్లు కట్టుకుని ప్రదర్శన నిర్వహించారు. రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో ఆ పార్టీ నిరసనలు కూడా చేపట్టింది. బహెన్ సురక్షిత్ తర్ ఘర్ సురక్షిత్' (సోదరీమణులు సురక్షితంగా ఉంటే ఇల్లు సురక్షితం) అనే నినాదంతో సంతకాల ప్రచారాన్ని నిర్వహించాలని థాకరే తన పార్టీ కార్యకర్తలను కోరారు. దానిని బాంబే హైకోర్టుకు అందజేస్తారు. కోర్టు మా బంద్‌ను నిలిపివేసింది. కానీ మా గొంతును అణచివేయలేరని ఠాక్రే అన్నారు. ఎంవీఏ పిలుపునిచ్చిన బంద్‌ను ఆపాలని ప్రభుత్వం తన వర్గీయులతో కోర్టును ఆశ్రయించిందని ఆయన అన్నారు. అన్ని తలుపులు మూసివేసినప్పుడు ప్రజలు వీధుల్లోకి రావడం తప్ప మరో మార్గం లేదని ఠాక్రే తెలిపారు. కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్న మహారాష్ట్ర శాసనసభ ఆమోదించిన శక్తి బిల్లును రాష్ట్రంలో అమలు చేయడానికి రాష్ట్రపతి ఆమోదం తెలపాలని ఆయన డిమాండ్ చేశారు.

మహారాష్ట్ర ప్రతిష్ఠను దెబ్బతీసింది : శరద్ పవార్

బద్లాపూర్‌లోని ఒక పాఠశాలలో ఇద్దరు కిండర్ గార్టెన్ బాలికలపై లైంగిక వేధింపుల ఘటన దేశంలో మహారాష్ట్ర ప్రతిష్ఠను దెబ్బతీసిందని శరద్ పవార్ విమర్శించారు. మహిళల భద్రత బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనన్న విషయాన్ని మరిచిపోయిందన్నారు. పూణేలో జరిగిన మౌన నిరసనలో పాల్గొన్న పవార్, బద్లాపూర్ ఘటనపై ప్రతిపక్షాలు రాజకీయాలు చేస్తున్నాయంటూ ప్రభుత్వం చులకనగా మాట్లాడుతుందన్నారు. 'బద్లాపూర్ సంఘటన దేశంలో మహారాష్ట్ర ప్రతిష్ఠను దెబ్బతీసింది' అని అన్నారు. మహిళలపై నేరాలకు పాల్పడే దోషుల చేతులను నరికివేసే ఛత్రపతి శివాజీ భూమిలో ఇలాంటి ఘటనే జరిగిందని పవార్ అన్నారు. కాగా, యువతులపై జరుగుతున్న నేరాలకు నిరసనగా ఆగస్టు 24న 'మహారాష్ట్ర బంద్'కు ఎంవీఏ పిలుపునిచ్చింది. అయితే బాంబే హైకోర్టు శుక్రవారం రాజకీయ పార్టీలు లేదా వ్యక్తులు ఆగస్టు 24న లేదా ఈ సంఘటనపై భవిష్యత్‌లో జరిగే బంద్‌ను కొనసాగించకుండా నిషేధించింది.

నేషనల్ కాన్ఫరెన్స్‌లో అసమ్మతి జ్వాల

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లో అసెంబ్లీ ఎన్నికల వేళ నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సీ)లో అసమ్మతి జ్వాల రగిలింది. కాంగ్రెస్‌తో పొత్తు క్రమంలో సీట్ల సర్దుబాటు, టికెట్ల పంపిణీపై పార్టీలోని కొందరు నేతలు గుర్రుగా ఉన్నారు. పార్టీని వీడి... స్వతంత్రంగా పోటీ చేయాలని నిర్ణయించుకున్నారు. చీనాబ్ లోయతోపాటు బనిహాల్ ప్రాంతాలోని కీలక నేతలు తిరుగుబాటుకు సిద్ధమయ్యారు. ఈ పరిణామం అగ్రనాయకత్వానికి తలనొప్పిగా మారింది. 60-30 స్థానాల్లో అభ్యర్థులను నిలబెట్టాలని కాంగ్రెస్-ఎన్‌సీ మధ్య ఒప్పందం కుదిరింది. నేషనల్ కాన్ఫరెన్స్ వదులుకున్న స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు పోటీచేయనున్నారు. ఈ ఎన్నికల్లో బీజేపీని ఓడించేందుకు ఇతర రాజకీయ పార్టీలతో పొత్తు పెట్టుకుంటామని నేషనల్ కాన్ఫరెన్స్ ఉపాధ్యక్షుడు ఒమర్ అబ్దుల్లా తమ ఎన్నికల మేనిఫెస్టో విడుదల వేళ ప్రకటించారు. జమ్మూకశ్మీర్ అసెంబ్లీకి దశాబ్దం తర్వాత ఎన్నికలు జరుగనున్నాయి. ఆర్టికల్ 370 రద్దు అనంతరం తొలిసారి జరిగే ఎన్నికలు కావడంతో అన్ని పార్టీలు వీటిని ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్నాయి. పోటీకి ఆసక్తిని కనబరుస్తున్నాయి. మొత్తం 90 స్థానాలున్న అసెంబ్లీకి మూడు దశల్లో పోలింగ్ జరగనుంది. ఫలితాలు అక్టోబరు 4న వెలువడతాయి.

బాధితులకు సీపీఐ బృందం పరామర్శ

ఇవి ఫార్మా యాజమాన్యాల హత్యలే: రామకృష్ణ

విశాలాంధ్ర బ్యూరో- అనకాపల్లి: ఫార్మా కంపెనీలలో వరుసగా జరుగుతున్న ఘోర ప్రమాదాలకు ఫార్మా యాజమాన్యాలు, ప్రభుత్వం, అధికారులు బాధ్యత వహించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. ఫార్మా ప్రమాదంలో గాయపడి అనకాపల్లి జిల్లా కేంద్రంలో గల ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న 20 మంది బాధితులను శనివారం ఆయన పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితి, ప్రభుత్వం ప్రకటించిన పరిహారం వివరాలు అడిగి తెలుసుకున్నారు. అధైర్య పడద్దని, ప్రభుత్వం ప్రకటించిన పరిహారం అందే వరకు పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం స్థానిక మీడియాతో రామకృష్ణ మాట్లాడుతూ అచ్యుతాపురం సెజ్‌లో 288, పరవాడలో 90 శ్రీకాకుళం జిల్లా పైడి భీమవరంలో 40 ఫార్మా కంపెనీలు ఉన్నాయని, వీటిలో తరచూ ప్రమాదాలు జరిగి కార్మికులు మిగతా జీవులుగా, క్షతగాత్రులుగా మారిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సంఘటన జరిగిన తర్వాత ముఖ్యమంత్రి, మాజీ ముఖ్యమంత్రి, మంత్రులు వస్తున్నారు తప్ప యాజమాన్యం ఎక్కడికి వెళ్లిందని ఆయన ప్రశ్నించారు. లాభాలు తప్ప కార్మికుల జీవితాలు వారికి అవసరం లేదా అని ప్రశ్నించారు. కార్మికులను పొట్టన పెట్టుకుని నష్టపరిహారం కింద డబ్బులు ఇచ్చేస్తే సరిపోతుందా అని అన్నారు. తక్షణమే ఎండీ, పాలకవర్గాన్ని అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. బాధితులకు న్యాయం జరిగే వరకూ పోరాడతామని హామీ ఇచ్చారు. అక్కడి నుంచి ఆయన సంఘటన జరిగిన అచ్యుతాపురంలోని ఎసెన్షియా ఫార్మా కంపెనీకి వెళ్లారు. లోపలికి అనుమతి లేదంటూ తొలుత పోలీసులు అడ్డుకున్నారు. సీపీఐ నేతలు నిరసన తెలపడంతో కొద్దిసేపటి తర్వాత అనుమతించారు. రామకృష్ణ వెంట సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కేవీవీ ప్రసాద్, అనకాపల్లి, విశాఖ జిల్లా కార్యదర్శులు బాలేపల్లి వెంకటరమణ, ఎం.పైడిరాజు, ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు అత్తిలి విమల, సీపీఐ నాయకులు జి.గురుబాబు, ఆర్.అప్పలరాజు, బి.సుబ్బలక్ష్మి, బి.పరమేశ్వరి, వి.అర్జున్ కాసుబాబు, వి.కన్నబాబు, జి.ఫణీంద్ర, బాబ్జి, కనకమహాలక్ష్మి తదితరులు ఉన్నారు.

డిసెంబరు నుంచి ‘అమరావతి’ పనులు: నారాయణ

విశాలాంధ్ర-విజయవాడ: రాజధాని అమరావతి నిర్మాణ పనులు డిసెంబరు ఒకటో తేదీ నుంచి ప్రారంభమయ్యే అవకాశం ఉందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. కాన్ఫెడరేషన్ ఆఫ్ రియల్ ఎస్టేట్ డెవలపర్స్ అసోసియేషన్స్ ఆఫ్ ఇండియా (క్రెడాయ్) అధ్వర్యంలో శనివారం ఓ ప్రైవేట్ హోటల్‌లో నిర్వహించిన ‘సౌత్‌కాన్-2024’ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసిన మంత్రి మాట్లాడారు. నాలుగేళ్లలో రాజధాని నిర్మాణం పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. అమరావతితో పాటు ఏకకాలంలో 26 జిల్లాల అభివృద్ధి చేస్తామన్నారు. లే అవుట్‌లు, భవన నిర్మాణాలకు అనుమతులు సరళతరం చేస్తామన్నారు. నిబంధనలు ఉల్లంఘించకుండా రియల్ ఎస్టేట్ వ్యాపారులు ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. క్రెడాయ్ జాతీయ అధ్యక్షుడు బోమన్ ఇరానీ మాట్లాడుతూ దక్షిణ భారత రాష్ట్రాలు వాణిజ్య, నివాస, రిటైల్ రియల్ ఎస్టేట్ కోసం వేగంగా అభివృద్ధి చెందుతున్న కేంద్రాలుగా ఉన్నాయన్నారు. క్రెడాయ్ జాతీయ కార్యదర్శి జి.రామ్ రెడ్డి మాట్లాడుతూ ప్రాంతీయ మార్కెట్ల స్థిరత్వాన్ని ప్రదర్శిస్తూ దక్షిణ భారత రియల్ ఎస్టేట్ రంగానికి కీలక ఘట్టాన్ని సౌత్‌కాన్ ఆవిష్కరిస్తుందన్నారు. క్రెడాయ్ జాతీయ సంయుక్త కార్యదర్శి బి.రాజా శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు శ్రీధరన్ స్వామినాథన్ మాట్లాడుతూ వివిధ రాష్ట్రాలకు చెందిన పారిశ్రామిక ప్రముఖులను ఏకం చేసేలా సౌత్‌కాన్ నిర్వహించడం శుభపరిణామం అన్నారు. క్రెడాయ్ ఆంధ్రప్రదేశ్ చైర్మన్ ఆళ్ల శివారెడ్డి, ఏపీ అధ్యక్షుడు వై.వి.రమణరావు, సౌత్‌కాన్ కన్వీనర్ డి.రాంబాబు మాట్లాడుతూ భాగస్వామ్యాలు పెంపొందించడం, ఆవిష్కరణ, స్థిరత్వాన్ని పెంచడానికి డెవలపర్‌లను ఒకచోట చేర్చిందని పేర్కొన్నారు. కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్‌రావు, బోడే ప్రసాద్, బోండా ఉమామహేశ్వరరావు, క్రెడాయ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

కులగణనతోనే సమన్యాయం

ఉన్నత పదవులకు దూరంగా 90 శాతం జనాభా: రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ: కులగణనతోనే సమన్యాయం సాధ్యమని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మరోమారు వక్కాణించారు. దేశ జనాభాలో 90శాతం మంది ఉన్నత పదవులకు దూరంగా ఉన్నారన్నారు. ఉత్తరప్రదేశ్, ప్రయాగ్‌రాజ్‌లో జరిగిన ‘సంవిధాన్ సమ్మాన్ సమ్మేళన్’ రాహుల్ మాట్లాడుతూ కులాధారిత సంస్థాగత గణనను డిమాండ్ చేస్తున్నామన్నారు. సామర్థ్యం, నైపుణ్యం ఉన్నప్పటికీ 90శాతం జనాభాకు ఉన్నద పదవులు దరిచేరడం లేదని తెలిపారు. కులగణనపై బీజేపీ విమర్శలను తిప్పికొట్టారు. కులగణన కేవలం లెక్క కాదని... విధానాల రూపకల్పనకు మూలమని రాహుల్ అన్నారు. కుల గణన నిర్వహించి వదిలేస్తే ఫలితం ఉండదని, సంపద పంపిణీ తీరును అవగాహన చేసుకోవడం అవసరమని చెప్పారు. బ్యూరోక్రసీలో, న్యాయ వ్యవస్థలో, మీడియాలో ఓబీసీలు, దళితులు, వర్గాల ప్రాతినిధ్యం తేలడం ముఖ్యమన్నారు. వేర్వేరు కులాల్లో ఎంత మంది ఉన్నారన్నది లెక్కించడమేకులగణన ఉద్దేశం కాదని, ఆయా వర్గాల మధ్య సంపద పంపిణీని తెలుసుకోవడమే విజన్ అని అన్నారు. 2004 నుంచి రాజకీయాల్లో ఉన్న తనకు బీజేపీ ఓ విధంగా రాజకీయ గురువేనని, ఏమేమి చేయకూడదో నేర్పిందని రాహుల్ వ్యాఖ్యానించారు. లోక్‌సభ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు కులగణన కోసం కాంగ్రెస్ డిమాండ్ చేస్తోంది. దేశవ్యాప్తంగా సామాజిక-ఆర్థిక, కులగణన నిర్వహించి... కులాలు, ఉప కులాలు, వాటి సామాజిక-ఆర్థిక పరిస్థితులను అంచనా వేస్తామని చెబుతోంది. రాజ్యాంగాన్ని సవరించడం ద్వారా ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల రిజర్వేషన్ పరిధిని 50శాతానికి పెంచుతామని కూడా వాగ్దానం చేసింది.

పోలింగ్ తేదీ మార్చండి

- ఈసీకి హర్యానా బీజేపీ వినతి
- ఓటమి భయంతోనే: కాంగ్రెస్

చండీగఢ్: హర్యానా అసెంబ్లీ ఎన్నికలను వాయిదా వేయాలంటూ ఎన్నికల సంఘానికి బీజేపీ రాష్ట్రశాఖ విజ్ఞప్తి చేసింది. సుదీర్ఘ వారంతపు సెలవుల (లాంగ్ వీకెండ్) కారణంగా ఓటింగ్ శాతం తగ్గే అవకాశం ఉన్నందున పోలింగ్ తేదీని మార్చాలని కోరింది. సెప్టెంబర్ 28 నుంచి అక్టోబర్ 2 వరకు వరుస సెలవులు ఉన్నాయని ఈసీ దృష్టికి తీసుకెళ్లింది. ‘సెప్టెంబరు 28వ తేదీ శనివారం, 29వ తేదీ ఆదివారం కావడంతో ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేటు సంస్థలకు వీక్లీ హాలిడే. అక్టోబరు 1వ తేదీన పోలింగ్ నిర్వహించడం వల్ల ఆ రోజు కూడా ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు మూతపడతాయి. 2వ తేదీ గాంధీ జయంతికి సెలవు ఉంది. అంతేకాక హర్యానాలో బిష్ణోయ్ వర్గీయులు రాజస్థాన్‌లోని ముఖమ్ గ్రామంలో జరిగే వార్షిక యాత్రకు వెళతారు కాబట్టి ఓటు వేయకపోవచ్చు. ఈ కారణాలన్నింటినీ పరిగణనలోకి తీసుకుని మరో తేదీన ఎన్నికలు నిర్వహించాలని కోరుతున్నాం’ అని ఈసీకి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మోహన్ లాల్ లేఖ రాశారు. బీజేపీ హర్యానా విభాగం పంపిన ఈ-మెయిల్ అందిందని, దానిని ఎన్నికల సంఘానికి పంపిస్తామని రాష్ట్ర ఎన్నికల అధికారి పంకజ్ అగర్వాల్ వెల్లడించారు. ఇదిలావుంటే, ఓటమి భయంతోనే ఎన్నికలు వాయిదా వేయాలని బీజేపీ కోరుతోందని కాంగ్రెస్ విమర్శించింది. బీజేపీకి ఓటమి భయం పట్టుకుందని ఎంపీ దీపేందర్ సింగ్ హుడా వ్యాఖ్యానించారు. ప్రభుత్వం సాధించినది, ప్రజలకు చెప్పుకునేది ఏదీ లేక కుంటిసాకులతో వాయిదా కోరుతోందని దుయ్యబట్టారు. 90 టిక్కెట్లకు అభ్యర్థులు కూడా ఆ పార్టీకి లేరన్నారు. వరుస సెలవుల నెపంతో ఎన్నికల వాయిదాకు కుట్ర పన్నుతోందని బీజేపీని హుడా ఆరోపించారు.

మోదీ సర్కార్‌కు గుణపాఠం తప్పదు

‘యువజన వ్యతిరేక విధానాల’ వల్ల ఉద్యోగాల కొరత: కాంగ్రెస్ నేత ఖర్గే



న్యూఢిల్లీ: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఉద్యోగాల గురించి ‘నకిలీ కథనం’ సృష్టిస్తోందని, రాబోయే ఎన్నికల్లో ప్రజలు బీజేపీకి గుణపాఠం చెబుతారని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే శనివారం పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ అనుసరిస్తున్న యువజన వ్యతిరేక విధానాల వల్ల దేశంలో ఉద్యోగాల కొరత ఏర్పడిందన్నారు. ‘బ్యాంక్ ఆఫ్ బరోడా తాజా నివేదిక 2022-23 లోనే దేశంలోని 375 కంపెనీలలో 2.43 లక్షల ఉద్యోగాలు తగ్గిపోయాయని చూపిస్తుంది’ అని ఆయన ‘ఎక్స్’ పోస్టులో పేర్కొన్నారు. లక్షలాది మంది యువత ఉద్యోగాల కోసం పరుగులు తీస్తున్నారని అన్నారు. ‘బీహార్‌లో కానిస్టేబుల్ నియామక పరీక్ష జరుగుతోంది. కేవలం 21 వేల ఖాళీ పోస్టులకు 18 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. పరీక్షకు నాలుగు రోజుల ముందు ప్రశ్నా పత్రం లీక్ అయింది. దీని కారణంగా ఈ పరీక్ష మళ్లీ నిర్వహించనున్నారు’ అని తెలిపారు. ఉత్తర ప్రదేశ్‌లో 60 వేల మంది కానిస్టేబుళ్ల నియామకం కోసం 26 రాష్ట్రాల నుంచి 6.30 లక్షల మంది యువత కూడా దరఖాస్తు చేసుకున్నారని ఆయన వివరించారు. ఈ పరీక్ష ప్రశ్నా పత్రం కూడా ఒకసారి లీక్ అయిందని తెలిపారు. ఈ ఏడాది జులైలోనే 1.24 లక్షల ఐటీ రంగంలో ఉద్యోగాలు కోల్పోయారని, దీంతో దేశ యువతకు తీవ్ర నష్టం వాటిల్లిందని ఖర్గే పేర్కొన్నారు. బ్యాంకింగ్, ఫైనాన్స్, బీమా, హాస్పిటాలిటీ ఇలా అన్ని రంగాల్లో ఉద్యోగాలు తగ్గిపోయాయని చెప్పారు. పైగా మోదీ ప్రభుత్వం చైనా కంపెనీలకు పెట్టుబడులు పెట్టేందుకు ‘రెడ్ కార్పెట్’ పరుస్తోందని ఆయన ఆరోపించారు. ‘మోదీ జీ తప్పుడు పద్ధతిలో నివేదిక తయారు చేసి కోట్లాది మందికి ఉద్యోగాలు కల్పిస్తున్నట్లు తప్పుడు వాదనలు చేశారు. కేఎల్‌ఈఎంఎస్ నుంచి నకిలీ కథనాన్ని సృష్టించేందుకు, మోదీ ప్రభుత్వం జనాభా గణనను ఆశ్రయించలేదు. కానీ వివిధ సంవత్సరాల్లో వివిధ జనాభా వివరాలను ఆశ్రయించింది. ఇది తప్పుడు కార్మిక, జనాభా నిష్పత్తికి దారితీసింది’ అని ఆయన పేర్కొన్నారు. ‘అంతేకాకుండా గ్రామీణ, పట్టణ జనాభా పెరుగుదల ఒకే విధంగా ఉంటుందని భావించబడింది. ఇది అతిగా అంచనా వేయడానికి దారితీసింది’ అని ఆరోపించారు. ఇది కాకుండా ‘వేతనం లేని కార్మికులు’, ‘వారానికి ఒక గంట పని’ వారిని కూడా ఉద్యోగ విభాగంలో లెక్కించబడినట్లు ఇప్పుడు అందరికీ తెలుసు అని కాంగ్రెస్ అధ్యక్షుడు అన్నారు. దేశంలో నిరాశ, నిరుత్సాహానికి గురైన నిరుద్యోగ యువత ఇప్పుడు మోదీ ప్రభుత్వ ఈ ‘తప్పుడు వ్యూహాలను’ అర్థం చేసుకున్నారని ఆయన అన్నారు. రానున్న ఎన్నికల్లో బీజేపీకి కచ్చితంగా గుణపాఠం చెబుతామన్నారు.

11 నుంచి మెరుగైన ఉచిత ఇసుక విధానం

- సమస్యల పరిష్కారానికి టోల్-ఫ్రీ నంబర్ 1800-599-4599
- గనులు, ఆబ్కారీ శాఖ ముఖ్య కార్యదర్శి ముకేశ్ కుమార్ మీనా

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సెప్టెంబరు 11 నుంచి మరింత మెరుగైన ఇసుక విధానం అమలులోకి రానున్నట్లు గనులు, ఆబ్కారీ ముఖ్య కార్యదర్శి ముకేశ్ కుమార్ మీనా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేస్తున్న రోజువారీ సమీక్షల ఫలితంగా ఉచిత ఇసుక విధానం గాడిలో పడుతోందని, ఇసుక కోసం వేచి చూస్తున్న లారీల క్యూలు తగ్గుముఖం పడుతున్నాయని తెలిపారు. గనుల శాఖ తీసుకుంటున్న చర్యలు మంచి ఫలితాలను ఇస్తుండగా, ఒక్కొక్కటిగా సమస్యలు కూడా కనుమరుగవుతున్నాయని అన్నారు. లారీల యజమానులు, మధ్యవర్తులు పేరిట వసూలు చేస్తున్న అధిక ధరలను నియంత్రించటానికి ఇసుక బుకింగ్ విధానంలో తీసుకు వచ్చిన మార్పులు బుకింగ్ కేంద్రాల వద్ద లారీల రద్దీని నివారిస్తున్నట్లు ఆయన చెప్పారు. సెప్టెంబరు 11న మరింత మెరుగైన నూతన ఆన్ లైన్ విధానాన్ని ఆవిష్కరించనుండగా, ఆ విధానం అమలులోకి వచ్చే వరకు వేచిచూడకుండా ఈ మూడు వారాలు సైతం కఠిన నిబంధనలనే అమలు చేయనున్నట్లు మీనా వివరించారు. ఉచిత ఇసుక విషయంలో ప్రజలు ఎదుర్కొనే ఇబ్బందులను టోల్-ఫ్రీ నంబర్ 1800-599-4599 ద్వారా ఫిర్యాదు చేయవచ్చని, ప్రతి ఫిర్యాదు పైనా తప్పనిసరిగా చర్య తీసుకుని, సంబంధిత వ్యక్తులకు ఆయా జిల్లా కలెక్టర్ల కార్యాలయాల నుంచి తిరిగి సమాచారం అందిస్తారని తెలిపారు. ఐవీఆర్ఎస్ విధానం ద్వారా ప్రతి రోజు వినియోగదారుల నుంచి అభిప్రాయాన్ని సేకరిస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు జిల్లాల వారీగా ఇసుక నిల్వలు, లోడింగ్ పరిమాణం, లబ్ధిదారుల సంఖ్య, అందుబాటులో కేటాయింపు తేదీ వంటి వివరాలతో ప్రతి రోజు శాండ్ బులెటిన్‌ను విడుదల చేయాలని నిర్ణయించామన్నారు. సరఫరా కేంద్రాల వద్ద అధిక రద్దీని నివారించడానికి బుకింగ్ ప్రక్రియను రెవెన్యూ కార్యాలయాలకు మార్చామని తెలిపారు. రీచ్‌లు, స్టాక్ యార్డ్‌ల సరఫరా సామర్థ్యం ఆధారంగా ఇన్‌వాయిస్‌లో డెలివరీ తేదీ, సమయం ఉంటుందని, రవాణాదారులు నిర్దేశించిన సమయానికి అక్కడికి చేరుకుంటే సరిపోతుందని ముకేశ్ కుమార్ మీనా వివరించారు. నిబంధనల ఉల్లంఘన, అక్రమ మైనింగ్, అదనపు రవాణా చార్జీల వసూలు వంటి వాటిపై కఠినంగా వ్యవహరించాలని కలెక్టర్లకు ముఖ్యమంత్రి స్వయంగా స్పష్టం చేశారని తెలిపారు.

వికటించిన ప్రయోగం...

24 మంది విద్యార్థులకు అస్వస్థత

- బాపట్ల కేంద్రీయ విద్యాలయంలో ఘటన
- ఏపీ సీఎం చంద్రబాబు ఆరా

విశాలాంధ్ర బ్యూరో-బాపట్ల: సైన్స్ ల్యాబ్‌లో ప్రయోగం వికటించి 24 మంది విద్యార్థులు అస్వస్థతకు గురైన సంఘటన బాపట్ల కేంద్రీయ విద్యాలయంలో శనివారం చోటుచేసుకుంది. సైన్స్ ఉపాధ్యాయురాలు సుజాత ల్యాబ్‌లో క్లోరోఫిల్ యాసిడ్, నిమ్మ ఉప్పుతో ప్రయోగం చేసి విద్యార్థులకు చూపించారు. ఆమె బయటకు వెళ్లగానే ఆ మిశ్రమానికి కొందరు విద్యార్థులు కాఫీ పొడి, ఉప్పు, పంచదార, శానిటైజర్ కలపడంతో ఒక్కసారిగా విషవాయువులు వెలువడ్డాయి. దీంతో ల్యాబ్‌లో ఉన్న విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. బాధిత విద్యార్థులకు బాపట్ల ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ సిద్ధార్థ్ అధ్వర్యంలో వైద్యుల బృందం పరీక్షలు చేసి చికిత్స అందించారు. షణ్ముఖ్ అనే విద్యార్థికి గుండె సమస్య ఉండటంతో మెరుగైన వైద్యం అందిస్తున్నారు. మిగిలిన విద్యార్థులు పూర్తి ఆరోగ్యంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. బాధిత విద్యార్థులను జాయింట్ కలెక్టర్ సుబ్బారావు పరామర్శించారు. 24 మంది విద్యార్థులు ఒకేసారి అస్వస్థత గురవటంతో పిల్లల తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన చెందారు. అనేక రాజకీయ పార్టీల, ప్రజా సంఘాల నాయకులు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించారు. కేంద్రీయ విద్యాలయంలో జరిగిన ప్రమాదంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆరా తీశారు. ఘటనపై సంబంధిత అధికారులతో మాట్లాడిన సీఎం... విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ప్రాణాపాయం లేదని, అత్యవసర వైద్య సహాయం అందిస్తున్నామని అధికారులు వివరించారు. ఘటనపై పూర్తి వివరాలు సీఎంఓకు పంపాలని సీఎం ఆదేశించారు.

డ్రగ్స్ అక్రమ రవాణాపై నిరంతర పోరు: విజయన్



తిరువనంతపురం: డ్రగ్స్ అక్రమ రవాణాపై పోరాటాన్ని తీవ్రతరం చేయాలని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ పోలీస్ యంత్రాంగానికి పిలుపునిచ్చారు. చిన్నారులు, యువత భద్రత కోసం నిఘాను విస్తృతం చేయాలని సూచించారు. కోజికోడ్ జిల్లా వడక్కర సమీపంలోని ఇరింగల్‌లో కేరళ పోలీస్ ఆఫీసర్స్ అసోసియేషన్ (కేపీఓఏ) 34వ రాష్ట్ర సదస్సులో భాగంగా ముఖ్యమంత్రి విజయన్ శనివారం మాట్లాడారు. చిన్నారులు, యువతను లక్ష్యంగా చేసుకున్న డ్రగ్స్ మాఫియా సమాజానికి సవాలు విసురుతోందని, ఈ సమస్యను అన్ని స్థాయిల్లోనూ పరిష్కరించాల్సి ఉందని అన్నారు. రాష్ట్రంలో డ్రగ్స్ నెట్‌వర్క్‌ను అణచివేసేందుకు, సమస్యను పరిష్కరించేందుకు పోలీసు బృందాలు చేపట్టిన చర్యలను ప్రశంసించారు. ఉధృతమవుతున్న ఆందోళనలతో ఈ ప్రాంతాల్లో తీవ్రంగా జోక్యం చేసుకోవాల్సిన సమయం ఆసన్నమైందని అన్నారు. నేరపరిశోధనల్లో వారి సమర్థత, వివిధ మానవతా సహాయ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనడంపై ప్రశంసలు కురిపించారు. పింక్ పెట్రోలింగ్ బృందం పనితీరుపైనా సంతృప్తి వ్యక్తం చేశారు. నిర్దేశిత లక్ష్యాలు సాధించడం ద్వారా ప్రశంసనీయమైన రీతిలో ముందుకు సాగుతుందని అన్నారు. సామాజిక బాధ్యత, మానవతా దృక్పథం కలిగి ఉండటంతో రాష్ట్ర పోలీస్ వ్యవస్థ దేశంలోనే ప్రత్యేకతను సంతరించుకుందని అన్నారు.

బీజేపీ ఎమ్మెల్యేపై పరువునష్టం కేసు: అఖిలేశ్

లక్నో: బీఎస్‌పీ అధ్యక్షురాలు మాయావతిపై చేసిన వ్యాఖ్యలకుగాను బీజేపీ ఎమ్మెల్యే రాజేశ్ చౌదరిపై పరువునష్టం కేసు నమోదు చేయాలని సమాజ్ వాది పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ అన్నారు. ఎమ్మెల్యే చేసిన అగౌరవకరమైన వ్యాఖ్యలు బీజేపీ సభ్యులకు మహిళల పట్ల ముఖ్యంగా అట్టడుగు, అణగారిన వర్గాలపై ఉన్న తీవ్ర ద్వేషాన్ని ప్రతిబింబిస్తున్నాయని విమర్శించారు. ‘మాయావతి నాలుగుసార్లు యూపీ ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఆమెను మొదటి సారి సీఎంను చేసింది మేమే (బీజేపీ) అని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు. మేము తప్పు చేశాం. ఉత్తరప్రదేశ్‌లోనే అత్యంత అవినీతిపరురాలైన ముఖ్యమంత్రి మాయావతి’ అని బీజేపీ ఎమ్మెల్యే చౌదరి వ్యాఖ్యానిస్తున్న వీడియోను అఖిలేశ్ యాదవ్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ‘రాజకీయంగా విభేదాలు ఉన్నప్పటికీ ఓ మహిళగా (మాయావతి) ఆమె గౌరవాన్ని దిగజార్చే హక్కు ఎవరికీ లేదు. ఆమెను ముఖ్యమంత్రిని చేయడం తప్పు అని బీజేపీ సభ్యులు అంటున్నారు. ఇది ప్రజాస్వామ్య దేశంలో ప్రజల అభిప్రాయాన్ని కూడా అవమానించడమే’ అని అఖిలేశ్ అన్నారు. ఆమె అత్యంత అవినీతిపరురాలైన సీఎం అని నిరాధార ఆరోపణలు చేయడం తీవ్ర అభ్యంతరకరం. ఈ బహిరంగ ప్రకటనపై బీజేపీ ఎమ్మెల్యేపై పరువు నష్టం కేసు నమోదు చేయాలని అన్నారు. ఒకవేళ బీజేపీ ఆ ఎమ్మెల్యేపై క్రమశిక్షణా చర్యలు తీసుకోకపోతే... ఇది ఆ సభ్యుడి వ్యక్తిగత అభిప్రాయం మాత్రమే కాదని, పార్టీ అభిప్రాయంగా భావించాల్సి ఉంటుందని చెప్పారు.

సోపోర్‌లో ఎన్‌కౌంటర్... ఉగ్రవాది హతం

జమ్ము: జమ్మూకశ్మీర్‌లోని సోపోర్‌లో ఉగ్రవాదులకు, భద్రతా బలగాలకు మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. భద్రతా బలగాల కాల్పుల్లో ఓ ఉగ్రవాది హతమయ్యాడు. పక్కా సమాచారం మేరకు సోపోర్ పోలీసులు, 32 నేషనల్ రైఫిల్స్ సంయుక్త బృందం రఫియాబాద్, సోపోర్‌లో గాలింపు చర్యలు ప్రారంభించింది. ఈ క్రమంలో భద్రతా బలగాలు, ఉగ్రవాదులకు మధ్య కాల్పులు జరిగాయి. సంఘటనా స్థలంలో ఇంకా ఉగ్రవాదులు ఉన్నారని అనుమానిస్తున్నారు. మిగతా వారి జాడ కోసం బలగాలు అన్వేషిస్తున్నాయి. హతమైన ఉగ్రవాది ఎవరనేది ఇంకా తెలియరాలేదు. ఉగ్రవాదిని గుర్తించేందుకు బలగాలు ప్రయత్నిస్తున్నాయి. దీనికిముందు భద్రతా బలగాలు లష్కరే తోయిబా ఉగ్రవాద సంస్థకు చెందిన పీవోకే నివాసిని గుర్తించి అరెస్ట్ చేశాయి. ఆ వ్యక్తిని జహీర్ హుస్సేన్‌గా గుర్తించాయి. భద్రతా బలగాలు అతన్ని పూంచ్‌లో పట్టుకున్నాయి. జమ్మూ కశ్మీర్‌లో త్వరలోనే ఎన్నికలు జరగనున్నాయి. ఎన్నికలకు ఎలాంటి ఆటంకం కలగకుండా కేంద్ర ప్రభుత్వం భారీ భద్రతా బలగాలను మోహరించింది. ఇప్పటి వరకు దాదాపు 300 కంపెనీల పారామిలటరీ బలగాలను మోహరించారు. శ్రీనగర్, హంద్వారా, గందర్‌బల్, బుద్గాం, కుప్వారా, బారాముల్లా, బందిపోరా, అనంత్‌నాగ్, షోపియాన్, పుల్వామా, అవంతిపోరా, కుల్గామ్‌లలో కంపెనీలను మోహరించినట్లు అధికారిక వర్గాలు తెలిపాయి. కశ్మీర్ లోయలో అసెంబ్లీ ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్, బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్, సహస్త్ర సీమా బల్, ఇండో-టిబెటన్ బోర్డర్ పోలీసులతో సహా 298 కంపెనీల పారామిలటరీ బలగాలను రంగంలోకి దింపారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.